ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-9-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 235 పేజీలు: 10+4 వెల: 6.50

బల్వంత్‌ను ఇంకా ఎందుకు ఉరి తీయలేదు: సుప్రీం 5లో

లడఖ్‌లో వాంగ్చుక్ దీక్ష విరమణ

## ఆంధ్రప్రదేశ్‌కు ఉజ్వల భవిష్యత్తు

### అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న ఉపరాష్ట్రపతి

### కొత్త హోదాతో తొలిసారి కనకదుర్గమ్మ సందర్శనం

### విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొన్న రాధాకృష్ణన్


బుధవారం విజయవాడలో కనకదుర్గమ్మను దర్శించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

**విజయవాడ, సెప్టెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** దుర్గమ్మను దర్శించుకున్న అనంతరం ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ రాష్ట్ర ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. "ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి" అని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. విజయవాడలో దుర్గమ్మను దర్శించడం తనకు ఎంతోసంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు. విజయవాడ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని ఆయన అభిప్రాయపడ్డారు. పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తున్న విజయవాడ భవిష్యత్తులో అంతర్జాతీయ గుర్తింపును పొందు >>2

## అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు

ఏ కష్టం వచ్చినా ఆయనే ఆదుకుంటాడు..

రాయలసీమలో మరిన్ని మెరుగైన వైద్య సేవలు

14 సార్లు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించా: సిఎం చంద్రబాబు


బుధవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

**తిరుమల,సెప్టెంబరు 24ప్రభాతవార్తప్రతినిధి:** తన చిన్నప్పటి నుండీ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని చూస్తూనే పెరిగానని, తనకు ఏ కష్టం వచ్చినా ఆ స్వామివారే ఆదుకుంటున్నారని సిఎం చంద్రబాబునాయుడు మరోసారి విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీవారి దయవల్లే అందరికీ శాంతిసౌభాగ్యం కలుగుతుందని ఆకాంక్షించారు. బ్రహ్మోత్సవాల్లో 14సార్లు స్వామివారికి పట్టువస్త్రాలు ఇచ్చే అవకాశం దేవుడే కల్పించారన్నారు. ప్రపంచంలో హిందువులు వుండే ప్రతిచోటా వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉండాలని తెలిపారు. అన్ని రాష్ట్రాల రాజధానుల్లో వేంకటేశ్వర స్వామి ఆలయాలు నిర్మించాలని సిఎం సూచించారు. బుధవారం రాత్రి తిరుమలలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ఆరంభం సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించి కుటుంబసమేతంగా ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు అనంతరం ఆయన ఆలయంలో మాట్లాడుతూ తిరుమలతోబాటు టిటిడి దేవాలయాల్లో జరిగే అన్నదాన కార్యక్రమాన్ని, రాష్ట్రంలోఉన్న అన్ని దేవాలయాలకు విస్తరించాలని ఆదేశించారు. ఇందుకు టిటిడి బోర్డు, అధికారులు శ్రీకారం చుట్టాలని సిఎం సుచించారు. దేశంలోని అన్ని గ్రామాలలో, మారుమూల ప్రాంతాలతో సహా శ్రీవేకంటేశ్వరస్వామి దేవాలయాలను నెలకొల్పాలన్నారు. వాటిని తిరుమల దేవస్థానంకు అనుసందానం చేయాలని చెప్పారు. వేంకటేశ్వరస్వామి నాకు >>2

## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ

### దంతెవాడ జిల్లాలో 71 మంది లొంగుబాటు

### వారిలో 21 మంది మహిళలు

**చర్ల, ప్రభాతవార్త :** గడిచిన నాలుగు దశాబ్ధాలుగా దండకారణ్యం ప్రాంతంలో సామంతర పాలన నడిపిన మావోయిస్టులకు నేడు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే పార్టీకు దిశానిర్ధేశం చేసే కేంద్రకమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మృతితో పార్టీలో నాయకత్వలేమి కనిపించింది. అనంతరంజరిగిన వివిధ ఎన్‌కౌంటర్‌లో >>2


లొంగిపోయిన మావోయిస్టులు

## రైల్వే ఉద్యోగులకు దీపావళి కానుక

### 78 రోజుల బోనస్‌కు కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** ఉద్యోగులకు భారతీయ రైల్వే తీపికబురు చెప్పింది. దీపావళి సందర్భంగా ఉద్యోగులకు 78 రోజుల ఉత్పత్తి ఆధారిత బోస్ ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా పలుకీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం >>2



## ప్రతిపక్ష హోదాకోసం జగన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

**విజయవాడ,సెప్టెంబరు 24,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి హైకోర్టులో వైఎస్సార్సీ అధినేత జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. వైఎస్సార్సీకి ప్రధాన ప్రతిపక్ష హోదాను తిరస్కరిస్తూ ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూలింగ్‌ను తెచ్చారని వైఎస్ జగన్ సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, స్పీకర్ కార్యదర్శి, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు శాసనవ్యవహారాల కార్యదర్శికి నోటీసులుజారీ అయ్యాయి. జగన్ పిటిషన్ ఆధారంగా ప్రతివాదులను కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 4వ తేదీకి వాయిదా వేసింది. శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు స్పీకర్ తిరస్కరిస్తూ ఇచ్చిన రూలింగ్‌ను సవాల్ చేస్తూ వైఎస్సార్సీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు విచారించింది. పతిపక్ష నేత హోదా ఇచ్చేలా స్పీకర్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని ఈ పిటిషన్‌లో కోరారు. దీనిలో అసెంబ్లీ >>2

## ఆక్వా, వార్డు సచివాలయ బిల్లులకు ఆమోదం

**విజయవాడ,సెప్టెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం రెండు బిల్లులకు ఆమోద ముద్ర పడింది. అక్వా డెవలప్‌మెంట్ అథారటీ సవరణ బిల్లుతోపాటు గ్రామ, వార్డు సచివాలయాల సవరణ బిల్లుకు ఆమోదం తెలిపాయి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. బుధవారం అసెంబ్లీలో రెండు బిల్లులు.. అక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారటీ సవరణ బిల్లుతోపాటు గ్రామ, వార్డు సచివాలయం చట్ట సవరణ బిల్లులను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించిన చట్ట సవరణ బిల్లును మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అలాగే ఆక్వా, సహకార శాఖలకు సంబంధించి చట్ట సవరణ బిల్లును వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు. కూటమి ఎమ్మెల్యేల మద్దతుతో సదరు బిల్లులకు ఆమోద ముద్ర వేశారు. మూడు బిల్లులతోపాటు ఒక తీర్మానానికి ఏకగ్రీవ ఆమోదం లభించిన విషయం విదితమే. ఎస్సీ వర్గీకరణ బిల్లు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, భారతీయ నాగరిక్ సుర్క్షా సవరణ >>2


## మండలానికో జూ. కళాశాల

### చిత్తూరులో కొత్త విశ్వవిద్యాలయం

### చేనేత ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం

### పరకామణి చోరీపై త్వరలో 'సిట్'

### నేడు ఉపాధ్యాయ నియామక పత్రాల పంపిణి: అసెంబ్లీలో మంత్రి లోకేష్


బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** అభివృద్ధికి సంక్షేమానికి ఎవ్వరు అడ్డంకులు వేయలేరని రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారాలోకేష్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ నిలిపివేయించేందుకు వైఎస్సార్సీ నాయకులు అనేక రీతుల్లో ప్రయత్నించి భంగపడ్డారన్నారు. ఏ అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల్లో భాగంగా లోకేష్ అనే అంశాలపై బదులిచ్చారు. డిఎస్సీ నియామకాలపై, వైఎస్సార్సీ ప్రభుత్వం అడ్డుకోవడం కోసం వందకు పైగా కేసులు వేసిందని, అయినప్పటికీ వాటిని అధిగమించి విజయవంతంగా డిఎస్సీ నిర్వహించామని లోకేష్ తెలిపారు. ఉపాధ్యాయ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 25న అమరావతి వెలగపూడిలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానిస్తూ, తమ నియోజకవర్గం పరిధిలో ఎంపికైన ఉపాధ్యాయులను అభినందించమని కోరారు. ఉపాధ్యాయ నియామకాలతో పాటు రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలో కొత్త విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసే అంశంపై ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ రావు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ కీలకవిషయాలనువెల్లడించారు. చిత్తూరులో కొత్త విశ్వవిద్యాలయం ఏర్పాటు, జూనియర్ కళాశాలల అభివృద్ధి, చేనేత రంగ ప్రోత్సాహం, ఉపాధ్యాయ నియామకాలలో పారదర్శకత వంటి అంశాలపై మంత్రి నారా లోకేష్ సవివరంగా తెలిపారు. విద్య, చేనేత రంగాలకు కొత్త ఊపుని ఇస్తున్నాయి. చేనేతరంగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వంకట్టుబడి ఉందని మంత్రి >>2

## రాష్ట్రంలో భూ ప్రకంపనలు

**విజయవాడ,సెప్టెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లో భూమి కంపించినట్లు జాతీయ భూకంప అధ్యయన కేంద్రం పేర్కొంది. రిక్టర్ స్కేలుపై 3.4 తీవ్రతతో కంపనాలు నమోదైనట్లు వెల్లడించింది. 10కిమీలలోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడించింది. ఒంగోలులో స్వల్పంగా భూమి కంపించినట్లు తెలిపారు. గత రాత్రి 2 గంటలకు 2 సెకన్ల పాటు భూమి కంపించినట్లు స్థానికులు పేర్కొన్నారు. కృష్ణానది తీర ప్రాంత గ్రామాల్లోను, పులిచింతల, నందిగామ, జగ్గయ్యపేటలో ఇదే సమయంలో భూమి స్వల్పంగా ప్రకంపించినట్లు చెబుతున్నారు.

రష్యా విమానాలను కూల్చేయండి: ట్రంప్ 5లో

## మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం



### ఉప్పాడ మత్స్యకారులకోసం ప్రత్యేక కమిటీ: డి.సిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప్పాడ మత్స్యకారుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశలో కీలక చర్యలు తీసుకుంటామని ఏపీ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ తన కార్యాలయం నుంచి నేడు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదే అంశంపై 'ఎక్స్' వేదికగా మత్స్యకారుల ఆందోళనపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందించారు. రసాయన పరిశ్రమల వ్యర్థాలతో తమ జీవనోపాధిపై ప్రభావం పడుతున్నట్లు ఉప్పాడ మత్స్యకారులు చేపట్టిన ఆందోళన, వారి సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల మూలంగా మత్స్యకార కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోగలనని పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రస్తుతం శాసనసభ సమావేశాల కారణంగా వ్యక్తిగతంగా వచ్చి మత్స్యకారులతో నేరుగా చర్చించలేకపోతున్నట్లు పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం సోమవారం నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రతి సమస్యను పరిగణనలోకి తీసుకొని పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఆదేశించినట్లు వివరించారు. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీష్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ జిల్లా కలెక్టర్‌తో ఓ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. దీనిలో మత్స్యకార ప్రతినిధులు, స్థానిక నాయకులకు స్థానం ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సమస్యల పరిష్కారంతోపాటు జీవనోపాధి మెరుగుదల, తీర ప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపైనా ఈ కమిటీ దృష్టిపెడుతుందని ఆయన తెలిపారు. నష్ట పరిహారం మదింపు గురించి చర్చిస్తుందన్నారు. మత్స్యకారుల సమస్యలను అధ్యయనం చేసి, అమలు చేయదగిన సిఫారసులతో కూడిన నివేదికను కమిటీ సిద్ధం చేస్తుందని హామీ ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని పవన్ పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉప్పాడలో మత్స్యకార కుటుంబాలు చేపట్టిన నిరసనలు రెండోరోజు కూడా కొనసాగాయి. ఉదయం 6 గంటల నుంచి కూడలి సమీప ప్రాంత రహదారులన్నీ మూసివేసి మత్స్యకారులు ధర్నా చేపట్టారు. కోనపాపపేట, మూలపేట, అమీనాబాద్ మత్స్యకార గ్రామాల్లో రహదారులు మూసివేశారు. దుకాణాలు తెరవద్దని యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మత్స్యకారుల వద్దకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వెళ్లి చర్చించారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున ఆయన హామీ >>2

## తెలుగుభాష ఎంతో మధురం

### విజయవాడ ఉత్సవ్ మరో వందేళ్లు కొనసాగాలి: ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

### ఉత్సవాలతో ఎందరో కళాకారులకు ఉపాధి: కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్



బుధవారం విజయవాడ ఉత్సవ్‌లో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

**విజయవాడ,సెప్టెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భాష సౌందర్యం, సాహిత్యం, సంగీత వైభవాన్ని ప్రశంసిస్తూ తెలుగు భాష ఎంతో మధురమైనదని ప్రముఖ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి అన్న మాటలె అక్షర సత్యాలని భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌అన్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ - 2025 లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా బుధవారం సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ మాట్లాడుతూ ప్రారంభంలో తెలుగులో అందరికీ నమస్కారం చెప్పి తనప్రసంగాన్ని కొనసాగించారు. విజయవాడ ఉత్సవ్ మరో వందేళ్లపాటు కొనసాగాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల ప్రత్యేకతను గుర్తుచేస్తూ దేశవ్యాప్తంగా దుర్గా నవరాత్రులు ఎంతో ప్రత్యేకమని, తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని భక్తితో పూజించే సంప్రదాయం ద్వారా మన భారతీయ సంస్కృతిలో మహిళలప్రాముఖ్యతను ఈఉత్సవాలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. మహిళాశక్తిని గౌరవించడం భారతీయ సంప్రదాయమని, అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా కొలవడం ద్వారా శక్తి, భక్తి రెండూ లభిస్తాయి అని చెప్పారు. ఉత్సవంద్వారా ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై మాట్లాడుతూ విద్య, వైద్యరంగాల్లో రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. >>2


వరద నీటితో పోటెత్తున్న కృష్ణమ్మ

## ప్రకాశం బ్యారేజీకి మరోసారి వరద పోటు

**విజయవాడ,సెప్టెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజీకి మరోసారి వరద పోటెత్తింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి వరద నీరు దిగువకు విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వరద ఉధృతి కొనసాగుతోంది. 4.11 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ 69 >>2



బుధవారం తిరుమలేశునికి సమర్పించే పట్టువస్త్రాలతో ధ్వజస్తంభం వద్ద మొక్కుతున్న సిఎం చంద్రబాబు

# శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం చంద్రబాబు దంపతులు

**తిరుమల,సెప్టెంబరు 24 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభసూచకంగా సిఎం చంద్రబాబునాయుడు దంపతులు బుధవారం రాత్రి తిరుమలేశునికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆనవాయితీ ప్రకారం బేడి ఆంజనేయస్వామి గుడివద్ద నుండి తలపై పట్టువస్త్రాలను తీసుకుని ఆలయంలోనికి చేరుకున్నారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం కులదైవాన్ని దర్శించుకున్నారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనంరామనారాయణరెడ్డి, నారాలోకేష్‌లు సిఎం వెంట శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలోపల 2026 నూతన సంవత్సర క్యాలండర్లు, డైరీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. 12పేజీల పెద్దక్యాలండర్, పెద్దడైరీ, చిన్నడైరీ, టేబుల్‌టాప్ క్యాలండర్, శ్రీవారి పెద్దక్యాలండర్, పద్మావతి వేంకటేశ్వరస్వామివారి క్యాలెండర్, పద్మావతి అమ్మవారి క్యాలండర్ వున్నాయి.



బుధవారం గన్నవరం విమానాశ్రయంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, చిత్రంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు ఉన్నారు.

## మండలానికో జూ. కళాశాల

>> నారా లోకేష్ ప్రకటించారు. చేనేత ఉత్పత్తుల ప్రోత్సాహానికి ప్రత్యేక బృందాన్ని ఎమ్మెల్యేలతో కలిసి ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులకు సరఫరా చేసే యూనిఫాంల తయారీ విషయంలో గతంలో చేనేత సంఘాలకు అవకాశం ఇవ్వాలనుకున్నా, వివిధ కారణాల వల్ల సాధ్యం కాలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం వేర్వేరు సంస్థల ద్వారా యూనిఫాం తయారీ జరుగుతున్నా, నాణ్యత, మన్నికపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు అందించే సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్ల కొనుగోళ్లలో పారదర్శకత పెంచి, ఏటా 200 కోట్ల రూపాయలు ఆదా చేస్తున్నామని చెప్పారు. చేనేతలకు ప్రోత్సాహం కల్పించే దిశగా మంగళగిరిలో వీవర్స్ శాల ఏర్పాటు చేశామని, కొత్త డిజైన్లు, బ్రాండింగ్, ప్రమోషన్‌పై చర్యలు చేపడుతున్నామని వివరించారు. చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వ రంగంలో ద్రవిడియన్ యూనివర్సిటీ, ప్రైవేటు రంగంలో అపోలో యూనివర్సిటీ మాత్రమే ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ముఖ్యమంత్రి హామీ మేరకు జిల్లాకు ఒక ప్రభుత్వ లేదా ప్రైవేటు విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ద్రవిడియన్ యూనివర్సిటీ ప్రధానంగా భాషాపరమైన విశ్వవిద్యాలయమే కావడంతో, చిత్తూరుకు ప్రత్యేకంగా వేరే యూనివర్సిటీ అవసరం ఉందని లోకేష్ చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తుని నియోజకవర్గం తొండంగి మండలంలోని రావికంపాడు హైస్కూలును జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే యనమల దివ్య చేసిన విజ్ఞప్తిపై మంత్రి స్పందించారు. గత ప్రభుత్వ కాలంలో జూనియర్ కళాశాలలు నిర్వీర్యం అయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని పునరుద్ధరిస్తూ విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు 40 శాతం పెరిగాయని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు కాంపిటీటివ్ మెటీరియల్ అందిస్తున్నామని వివరించారు. ప్రతి మండలంలో ఒక జూనియర్ కళాశాల ఉండేలా నిర్ణయం తీసుకున్నామని, రాబోయే రెండు సంవత్సరాల్లో ఈ లక్ష్యాన్ని పూర్తిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఇక టిటిడి పరకామణిలో చోరీ వ్యవహారంపై లోతైన దర్యాప్తు జరిపేందుకు త్వరలో ప్రభుత్వం 'సిట్' వేయనున్నట్లు మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. పారిశ్రామిక వేత్తలను ఒప్పించి రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నామని అక్టోబరు నుంచి రాష్ట్రానికి వరుస పెట్టుబడులు వచ్చేలా ప్రణాళికలు సిద్ధంచేశామన్నారు. 20లక్షల ఉద్యోగా లకల్పన దిశగా నిర్విరామకృషి జరుగుతోందన్నారు.

## శ్రీవారి ఆలయాలు

>> ప్రాణదానం చేశారు. ఏరోజైతే బ్రహ్మోత్సవాల సమయంలోనే తనపై దాడిజరిగితే , తనకు స్వామివారు ప్రాణదానం చేశారని అన్నారు.ఆ రోజే ప్రాణదాన ట్రస్టుకు శ్రీకారం చుట్టినట్లు సిఎం చంద్రబాబు గుర్తుచేశారు.. స్వామివారి దేవాలయాల నిర్మాణంలో అవసరమైతే దాతల సహాయం తీసుకుని ముందుకు వెళ్తామని అన్నారు. ప్రాణదాన ట్రస్టుకు 709 కోట్లు ఉన్నాయని అందులో 21కోట్లు ఖర్చు పెట్టారు, 688 కోట్లు రూపాయలు ఉందని అన్నారు. రాయలసీమలో వైద్యసదుపాయాల కల్పించే విదంగా ఈ కార్యక్రమం ముందుకు వెళ్తోందని వివరించారు. శ్రీవారి సేవకులలో 12 లక్షల మంది మహిళలు, 5 లక్షల మంది పురుషులు శ్రీవారిసేవకులు ఉన్నారని వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న వీరందరికీ కూడా రేటింగ్ ఇచ్చి ఇక్కడు వచ్చేల శ్రీవారి కార్యక్రమాలలో భాగస్వామ్యులు అయ్యేల చూడాలని చెప్పారు. పచ్చదనంలో తిరమల 80శాతంగా ఉందన్నారు. ప్రతి అంశాన్ని లాజికల్‌గా తీసుకోవాల్సిన అవసరంఉందని సిఎం నొక్కి చెప్పారు. పవిత్రతను కాపాడటానికి మనందరం ముందుకురావాలని ఆయన మరోసారి పిలుపునిచ్చారు. అనంతరం ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌తో కలసి సిఎం చంద్రబాబునాయుడు దంపతులు, మంత్రి నారాలోకేశ్ దంపతులు పెద్దశేషవాహనసేవలో పాల్గొన్నారు.

## హైకోర్టులో విచారణ

>> సెక్రటరీ, స్పీకర్ కార్యాలయ కార్యదర్శి, న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శిలతో పాటు స్పీకర్ అయ్యన్న పాత్రుడు, శాసనవ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. అసెంబ్లీలో సభా నాయకుడి తర్వాత ప్రతిపక్ష నేతతో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయించే సంప్రదానికి వీడ్కోలు పలికారని, సిఎం, మంత్రులు ప్రమాణం తర్వాత తనకు అవకాశం ఇచ్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని స్పీకర్‌కు లేఖలు రాశాను. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

## ఆంధ్రప్రదేశ్‌కు ఉజ్వల భవిష్యత్తు

>> తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ ప్రజలు, రాష్ట్ర ప్రజలకు ఉపరాష్ట్రపతి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ తన పర్యటనలో భాగంగా ఆయన దుర్గగుడి చేరుకుని కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, ఆలయ పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ తదితరులు ఉపరాష్ట్రపతి దంపతులకు స్వాగతం పలికారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించేలా సదుపాయాలు కల్పించారు. దుర్గమ్మను దర్శించుకున్న అనంతరం ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ రాష్ట్ర ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా రాధాకృష్ణన్ విజయవాడ కనదుర్గమ్మను దర్శించుకున్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గానూ అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఈసారి ఉపరాష్ట్రపతి తన భార్య సుమతి, కుటుంబ సభ్యులతో కలిసి జగన్మాత ఆలయానికి వచ్చి అన్నపూర్ణాదేవి అలంకరణలోని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు విశేష భోగ నివేదన అనంతరం ఉపరాష్ట్రపతి ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు

అమ్మవారి గర్భగుడిలోకి ప్రవేశించిన ఉపరాష్ట్రపతి గోడలపై అమ్మవారి అలంకరణ విశేషాలతో కూడిన ఫొటోలను, ధ్వజస్తంభాన్ని దర్శించుకుని నమస్కరించారు. అంతరాలయంలో మాతాన్నపూర్ణేశ్వేరి ఎంతో సౌందర్యంగా భిక్షాందాహి అంటూ పరమేశ్వరుడు పాత్ర పట్టుకుని నిలుచున్న అలంకరణను ఉపరాష్ట్రపతి దంపతులు ఎంతో తన్మయత్వంతో తిలకించి పులకించారు. లలితాత్రిపురసుందరీదేవి నామాలు, ఖడ్గమాల అర్చనతో అమ్మలగన్న అమ్మకు పూజలు చేసిన పండితులు, ఉపరాష్ట్రపతి, ఇతర కుటుంబ సభ్యుల పేరిట అర్చన చేశారు. దుర్గాష్టకాన్ని ఉపరాష్ట్రపతి పఠించి, అమ్మ ఎదుట తన భక్తిని చాటుకున్నారు.

అనంతరం పండితులు వేద ఆశీర్వచనం పలికారు. మరింత ఉన్నత హోదా పొందాలని ఆకాంక్షించారు. విజయవాడ అమ్మవారి ఆలయ విశిష్టతగురించి పండితులను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి ప్రసాదాన్ని పండితులు అందజేశారు. ఆలయం తరఫున అమ్మవారి చిత్రపటం, పట్టువస్త్రాలను కమిషనర్ రామచంద్ర మోహన్, ఈవో శీనానాయక్ బహుకరించారు. అనంతరం ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ పున్నమి ఘాట్ వద్ద నిర్వహించిన విజయవాడ ఉత్సవ్‌లోకూడా పాల్గొన్నారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొనడం స్థానిక ప్రజలకు ఉత్సాహాన్ని కలిగించింది. ఆయన పర్యటనతో ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణ లభించింది.

**స్వాగతం పలికిన గవర్నర్, సిఎం**

విజయవాడ చేరుకునే ముందు గన్నవరం విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రెండ్రోజుల ఎపి పర్యటనలో భాగంగా ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విమానాశ్రయానికి చేరారు. విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, పలువురు ఉన్నతాధికారులు, మంత్రులు, ఎంపీలు, కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి పోలీసులు గౌరవ వందనం చేశారు. ఉపరాష్ట్రపతి రోడ్డు మార్గంలో విజయవాడ చేరుకున్నారు. ఇంద్రకీలాద్రిపై శ్రీకనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం విజయవాడ ఉత్సవ్ 2025 కార్యక్రమం ముగించుకుని తిరుపతికి తిరుగు ప్రయాణమైన భారత ఉపరాష్ట్రపతి దంపతులు సీపీ రాధాకృష్ణన్ ఆర్ సుమతి లకు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

## తెలుగుభాష ఎంతో మధురం

>>వికసిత భారత్ అనేది ఒక కల కాదు, అది నిజం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తోందని అన్నారు. శాస్త్ర, సాంకేతిక, వైద్య, విద్య రంగాల్లో కూడా రాష్ట్రం విశేష పురోగతిని సాధిస్తోందని తెలిపారు. ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన మొదటి అధికారిక పర్యటనలో భాగంగా విజయవాడకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసారు. కనకదుర్గ అమ్మ పేరులోనే అనుగ్రహం, ప్రేమ, అమృతం నిక్షిప్తమై ఉంది అని భావోద్వేగంగా తెలిపారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభతో మెరిసిపోతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ముందడుగు వేస్తున్నారని.. సాంప్రదాయంతో సాంకేతికతను, సంస్కృతితో సృజనాత్మకతను, వారసత్వ సంపదతతో అభివృద్ధిని సమ్మిళితం చేసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశంలో టూరిజం వేగంగా అభివృద్ధి చెందుతుందని, లోకల్ టూ గ్లోబల్ దిశగా అభివృద్ధి పథంలో దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. ఇటువంటి ఉత్సవాల నిర్వహణ ద్వారా ఎందరో హస్తకళాకారులు రూపొందించిన ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ లభిస్తుందన్నారు. ఎంతో మంది కళాకారులకు ఉత్సవాలు ఉపాధిని కల్పిస్తున్నాయని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలియజేశారు..

## మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం

>> ఇచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీష్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ జిల్లా కలెక్టర్‌తో ఓ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. దీనిలో మత్స్యకార ప్రతినిధులు, స్థానిక నాయకులకు స్థానం ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సమస్యల పరిష్కారంతోపాటు జీవనోపాధి మెరుగుదల, తీర ప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపైనా ఈ కమిటీ దృష్టిపెడుతుందని ఆయన తెలిపారు. నష్ట పరిహారం మదింపు గురించి చర్చిస్తుందన్నారు. మత్స్యకారుల సమస్యలను అధ్యయనం చేసి, అమలు చేయదగిన సిఫారసులతో కూడిన నివేదికను కమిటీ సిద్ధం చేస్తుందని హామీ ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని పవన్ పేర్కొన్నారు. ఉప్పాడ మత్స్యకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని పవన్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత స్వయంగా మత్స్యకారులతో కూర్చొని అన్ని సమస్యలపై సమగ్రంగా చర్చిస్తానని ఆయన తెలిపారు.

## రైల్వే ఉద్యోగులకు దీపావళి కానుక

>> తెలిపింది. 10.91లక్షల మంది ఉద్యోగులకు రూ.1865.68 కోట్ల బోనస్ చెల్లించనున్నది. అలాగే కేబినెట్ బీహార్‌లో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. తర్వలోనే బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రూ.2,192 కోట్లతో రైల్వే డబ్లింగ్‌కు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. భక్తియార్‌పూర్-రాజ్‌గిర్‌తిలయ్యా రైల్వేలైన్‌కు ఆమోదించింది.

రూ.3,822.31 కోట్లతో నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇదిలా ఉండగా గతేడాది దాదాపు 11 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు కేంద్రం బోనస్ ఇచ్చింది. మోడీ ప్రభుత్వం రైల్వే ఉద్యోగులకు రూ.2,029 కోట్ల బోనస్‌ను ఆమోదించింది. అర్హత కలిగిన రైల్వే ఉద్యోగికి 78 రోజులకు గరిష్టంగా రూ.17,951 చెల్లించనున్నారు. ఈ మొత్తాన్ని వివిధ రకాల రైల్వే ఉద్యోగులకు ఇవ్వనున్నారు. ఇందులో ట్రాక్ మెయింటెయినర్లు, లోకోమోటివ్ పైలట్లు, రైలు మేనేజర్లు (గార్డులు), స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మెన్, మినిస్టీరియల్ సిబ్బంది, ఇతర గ్రూప్ సీ ఉద్యోగులు ఉన్నారు. 2024-25 సంవత్సరంలో రైల్వేల పనితీరు చాలా బాగుంది. రైల్వేలు రికార్డు స్థాయిలో 1614.90 మిలియన్ టన్నుల సరుకును.. దాదాపు 7.3 బిలియన్ల ప్రయాణికులను రవాణా చేశాయని ప్రభుత్వం తెలిపింది. నేషనల్ షిప్ బిల్డింగ్ మిషన్‌కు కేంద్ర మంత్రి కూడా ఆమోదం తెలిపారని వైష్ణవ్ వెల్లడించారు.

## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ

>> ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు మృతిచెందగా... మరో సభ్యురాలు లొంగిపోయారు. పార్టీలో అంతర్గతంగా నెలకొన్న విభేధాలతో సతమతమవుతున్న క్రమంలో మావోయిస్టు పార్టీకు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా దంతెవాడ జిల్లాలో 71 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ లొంగుబాటు వివరాలను బస్తర్ రేంజ్ ఐజి పి.సుందర్‌రాజ్ వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన లొన్‌వర్రాట్టు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. మావోయిస్టు పార్టీలో వివిధ క్యాడర్‌లో పనిచేస్తున్న 71 మంది లొంగిపోయారని, వీరిలో 21 మంద మహిళలు ఉన్నట్లు ఆయన తెలిపారు. లొంగిపోయిన వారికి పునరావాస విధానం ప్రకారం తక్షణ సహాయంగా రూ.50వేల నగదును అందజేస్తామని, నైపుణ్య, అభివృద్ధి శిక్షణ, వ్యవసాయ భూమి, స్వయం ఉపాధి అవకాశాలు వంటివి వీరికి లభిస్తాయని అన్నారు. నేటి వరకు ఈ కార్యక్రమం ద్వారా (లోన్‌వర్రాట్టు) ప్రచారం ద్వారా 1113మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 297 మందిపై రివార్డు కలిగి ఉన్నారని, దంతెవాడ జిల్లాలోనే గత 19 నెలల్లో 461 మంది నక్సలైట్లు లొంగిపోగా వీరిలో 129 మంది రివార్డు కలిగి ఉన్నారని అన్నారు. హింస, ఉగ్రవాదం వలన సాధించేది ఏమీ లేదని, అడవి బాట వీడి జనజీవన స్రవంతిలో కలిసి ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, మావోలందరూ తమ కుటుంబాలు, మరియు సమాజం కోసం హింసా మార్గాన్ని విడిచి శాంతి, అభివృద్ధి వైపు పయనించాలని అన్నారు. ఈ సమావేశంలో దంతెవాడ రేంజ్ డిఐజి కమలోచన్ కశ్యప్, సిఆర్‌పిఎఫ్ డిఐజి (ఆపరేషన్స్) రాకేష్‌చౌదరి, దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్, సీఆర్పీఎఫ్, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వరదపోటు

>> గేట్లను పైకి ఎత్తి దిగువకు 4.11 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. అత్యవసర సహాయక చర్యల కోసం విజయవాడ ఘాట్లలో 5 ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ఇక్కడ ఏర్పాటు చేసామని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ, ప్రఖర్ జైన్ తెలిపారు. దసరా ఉత్సవాలు సందర్భంగా అధికార యంత్రాంగానికి ప్రత్యేక సూచనలు చేసారు. నది ఘాట్ల వద్ద భక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలి భద్రతా చర్యలకు పోలీసు, నీటి పారుదల, మునిసిపల్ సిబ్బంది ఘాట్ల దగ్గర ఉండాలి. నది ప్రమాద స్థాయి తెలియజేసే బారికేడింగ్‌లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. దసరా ఉత్సవాలు సందర్భంగా అధికార యంత్రాంగానికి ప్రత్యేక సూచనలు చేసారు. నది ఘాట్ల వద్ద భక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలి. భద్రతా చర్యలకు పోలీసు, నీటిపారుదల, మునిసిపల్ సిబ్బంది ఘాట్ల దగ్గర ఉండాలి. నది ప్రమాద స్థాయి తెలియజేసే బారికేడింగ్‌లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.ఈ విషయంలో భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు.

## బిల్లులకు ఆమోదం

>> బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. ఎస్సీ వర్గీకరణ బిల్లును మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి సభలో ప్రవేశపెట్టారు. వీటికి ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, ఎంఎస్ రాజు, బి.రామాంజనేయులు మద్దతు తెలిపారు. ఈ బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇక స్థానిక సంస్థలకు నాలా ఫీజు ఇచ్చే పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సభలో ప్రవేశపెట్టారు. దీనిని ఎమ్మెల్యే పార్థసారథి మద్దతు తెలిపారు. ఎపి వ్యవసాయ భూమి చట్టం 2006 రద్దు చేసేందుకు దీనికి అనుగుణంగా పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేస్తూ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు చేసినప్పుడు చెల్లించే నాలా ఫీజును ఇప్పటి వరకు రెవెన్యూ శాఖ వసూలు చేస్తోంది. ఇకపై ఈ నాలా ఫీజు స్థానిక సంస్థలకు చెందనుంది. అదే విధంగా మాన్యువల్ స్కావెంజర్ల నియామకం, డ్రై మరుగుదొడ్ల నిర్మాణ నిషేధ చట్టాన్ని రద్దు చేయాలనే తీర్మానాన్ని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిప్రవేశపెట్టారు.దీనిని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది.

## తెలంగాణకు వాయు'గండం'

### 30 దాకా భారీ వర్షసూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు24:** తెలంగాణ రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అల్పపీడనాల ప్రభావంతో రాష్ట్రంలో ఈనెల 30 వరకు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం కొనసాగుతున్న అల్పపీడనం 12 గంటల్లో బలహీనపడే అవకాశం ఉందని తెలిపింది. 25న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరొక్క అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది.

## వారం - వర్జ్యం

25-09-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
తదియ ఉ.7.06
స్వాతి రా.7.09
వర్జ్యం : రా.1.27-3.15
దు.ఉ.10.00-10.48, 2)మ.2.50-3.38
శుభసమయం: ఉ.7.30-8.30, సా.6.45-7.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** విదేశములకు సంబంధించిన యత్నములకు ఇతరుల పరపతిని నమ్ము కోవడం కన్నా స్వయం కృషి చేయడం ఉత్తమము.

**వృషభం:** జీవిత భాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. ఇంటర్వ్యూలలో విజయంసాధిస్తారు.

**మిథునం:** కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లభిస్తుంది. దేవాలయ సందర్శనం చేసుకుంటారు.

**కర్కాటకం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. ధనలాభం.

**సింహం:** నూతన పెట్టుబడుల విషయంలో నిదానం అవసరం. వాహనాల విషయంలో జాగ్రత్తలు అవసరం.

**కన్య :** స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** క్రీడారంగం యందు ఆసక్తిని చూపుతారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. నూతన ప్రయత్నలు ఫలిస్తాయి.

**ధనుస్సు:** దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వాహనాల కొనుగోలు చేస్తారు.

**మకరం:** మీ సహాయ సహకారాలు అందరికి అందిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**కుంభం:** పలుకుబడి ఉన్నవారితో పరిచయాలు ఏర్పడతాయి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం:** దీర్ఘాలోచనల కన్న సమయ స్ఫూర్తితో వెనువెంటనే తీసుకునే నిర్ణయాల వల్ల లాభపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్


బి1/91/2025, తేది.23.09.2025 **ఫారమ్ నెం.VI (ఎ)**

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమాళి 2014లో రూల్ 19, సబ్ రూల్(1) ననుసరించి)

రి.ఓ.నెం.129/2025/ఎ తేది. .09.2025

**ప్రాథమిక ప్రకటన**

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం కోయరాజమండ్రి గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా వరరామచంద్రపురం మండలం చొక్కనపల్లి గ్రామము, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లా లో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులకు ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం డివిజన్ బుట్టాయిగూడెం మండలం కోయరాజమండ్రి గ్రామం నందు భూమికి భూమి కేటాయింపు నిమిత్తం అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్ట పరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఎరుక నిమిత్తము ఇందు మూలముగా నోటీసు జారీచేయబడినది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియూ లేవు.

స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలక్టరు(భూసేకరణ పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారికి, వారి సిబ్బందికి, పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4)ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్- 1, కొవ్వూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు(క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60(అరవది) దినములలోగా ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలక్టరు పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్ - 1, కొవ్వూరు వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

**షెడ్యూలు**

జిల్లా : ఏలూరు మండలం: బుట్టాయిగూడెం గ్రామం : కోయరాజమండ్రి

| వ. సంఖ్య | ఎల్.పి. నెం. | సర్వే నెం. | వివరణ | భూసేకరణ క్రింద విస్తీర్ణం | సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా | సరిహద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు మరియు కట్టడముల వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | | | | 8 |
| 1 | 702 | 196/2 | స.పుంత | 1.16 | ముప్పిన నాగేశ్వర రావు తండ్రి లక్ష్మయ్య | ఎల్.పి. నెం.492 | ఎల్.పి.నెం. 705, 706, 1348 | ఎల్.పి.నెం. 701 | ఎల్.పి.నెం. 703 | ఖాళీస్థలం |
| 2 | 1088 | 281/1 | స.పుంత | 3.09 | దగ్గు వెంకట మహేశ్వర రావు తండ్రి సుబ్బారావు | ఎల్.పి.నెం. 1083 | ఎల్.పి.నెం. 1089, 1090 | ఎల్.పి.నెం. 1085, 1086, 1087 | ఎల్.పి.నెం. 1091, 1096 | ఖాళీస్థలం |
| 3 | 1083 | 281/1 | స.పుంత | 2.41 | దగ్గు సత్యనారాయణ తండ్రి సుబ్బారావు | ఎల్.పి.నెం. 1025 | ఎల్.పి.నెం. 1088, 1096 | ఎల్.పి.నెం. 1027, 1081, 1082, 1084, 1085 | ఎల్.పి.నెం. 1097, 1017 | ఖాళీస్థలం |
| 4 | 1206 | 334/1A1, 334/2B | స.పుంత | 1.63 | ముదునూరి ప్రసన్న తండ్రి వెంకట రాము | ఎల్.పి.నెం. 1205 | ఎల్.పి.నెం. 1208 | ఎల్.పి.నెం. 1207 | ఎల్.పి.నెం. 1204, 1200 | ఖాళీస్థలం |
| 5 | 813 | 161/1 161/1 | స.పుంత | 1.60 | చిట్రాజుల వెంకట రాము బ్రహ్మాదార్యులు తండ్రి మంగయ్యదార్యులు | ఎల్.పి.నెం. 814 | ఎల్.పి.నెం. 867, 876, 869 | ఎల్.పి.నెం. 831, 832, 833, 834 | ఎల్.పి.నెం. 808, 803, 802, 877, 807, 809 | ఖాళీస్థలం |
| | 877 | | | | | ఎల్.పి.నెం. 802 | ఎల్.పి.నెం. 876 | ఎల్.పి.నెం. 813 | ఎల్.పి.నెం. 878 | |
| 6 | 1085 | 326/1A 326/1 | స.పుంత | 2.15 | దగ్గు వెంకట రావు తండ్రి బొరయ్య | ఎల్.పి.నెం. 1084 | ఎల్.పి.నెం. 1086 | ఎల్.పి.నెం. 1029 | ఎల్.పి.నెం. 1083 | ఖాళీస్థలం |
| 7 | 1074 | 327/1B | స.పుంత | 1.03 | పారేపల్లి మునలయ్య తండ్రి వెంకన్న | ఎల్.పి.నెం. 1073 | ఎల్.పి.నెం. 1075 | ఎల్.పి.నెం. 1070 | ఎల్.పి.నెం. 1030 | ఖాళీస్థలం |
| 8 | 181 | 126 | స.పుంత | 4.00 | బండి వరలక్ష్మి భర్త రామకృష్ణ | ఎల్.పి.నెం. 182, 178 | ఎల్.పి.నెం. 200, 205 | ఎల్.పి.నెం. 183, 1334 | ఎల్.పి.నెం. 177,179, 180, 201, 202, 203, 204 | ఖాళీస్థలం |
| 9 | 456 | 187/1 | స.పుంత | 3.65 | కుంజం పద్మావతి | ఎల్.పి.నెం. 448, 454, 455 | ఎల్.పి.నెం. 532 | ఎల్.పి.నెం. 447, 533 | ఎల్.పి.నెం. 457 | బోరు-1, టాడి-5, వేప-5, టేకు-5 |
| మొత్తం | | | | 20.72 | | | | | | |

కె.సతీష్
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)
ఆర్.ఎం.సి.యూనిట్-1, కొవ్వూరు

సం/- యస్.సరళా వందనం
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, రాజమహేంద్రవరం

खाद्य प्रसंस्करण उद्योग मंत्रालय
भारत सरकार

# భారతీయ ఆహార ఆర్థిక వ్యవస్థకు
## ఒక స్వాగత సింహ ద్వారం

4వ ఎడిషన్

WORLD FOOD INDIA 2025
25th to 28th September
प्रसंस्करण से समृद्धि



ప్రారంభోత్సవం

# శ్రీ నరేంద్ర మోదీ
భారత ప్రధానిచే

**25 సెప్టెంబర్, 2025 | 18.00 గం.లు ఆపై | భారత మండపం, న్యూఢిల్లీ**

## వరల్డ్ ఫుడ్ ఇండియా 2025 ముఖ్యాంశాలు

**ప్రపంచంతో సారూప్యం, అపరిమిత అవకాశాలు**
1800+ ప్రదర్శకులు, 500+ అంతర్జాతీయ కొనుగోలుదారులు, 100+ దేశాలు.

**జీవ-పర్యావరణ సంరక్షణకు పురోగతి**
ప్రపంచ ఆహార నిబంధనల శిఖరాగ్ర సమావేశం 2025 మరియు ఇండియా అంతర్జాతీయ సముద్ర ఆహారోత్పత్తుల ప్రదర్శన, CEO రౌండ్ టేబుల్స్ స్టార్ట్-అప్ షోకేస్‌లు మరియు విషయ సంబంధిత సదస్సులు.

**సుమధురిమలు, భవిష్య సంభావాలు మరియు భాగస్వామ్యాలు**
లైవ్ ఫుడ్ జోన్స్, వినూత్న ఉత్సవ కేంద్రాలు మరియు క్రమ-విక్రయ సమావేశాలు.

**ప్రపంచం నుండి భారత్‌కు, ఒకే పైకప్పు నీడలో**
20+ దేశాల శిబిరాలు & 25+ రాష్ట్రాలు పాల్గొనటం.

## గత 11 సంవత్సరాలలో లక్ష్య సాధనలు

**విలువల చోదకత్వం, పురోగతి సాధికారిత**
ఫుడ్ ప్రాసెస్సింగ్ పరిశ్రమల నుండి గ్రాస్ వేల్యూయాడెడ్ (GVA) 2014-15లోని రూ.1.34 లక్షల కోట్ల నుండి 2023-24లో 2.24 లక్షల కోట్లకు పెరుగుదల.

**విశ్వ విశ్వాస, ఇండియా యొక్క అవకాశం**
ఇండియాలోని ఫుడ్ ప్రాసెస్సింగ్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి 2014-15 మరియు 2024-25 మధ్యలో రూ.53 వేల కోట్లు పై బడింది.

**ప్రపంచ వేదికపై భారతీయ ఉత్పత్తుల చేరవేత**
ఇండియా నుండి ప్రోసెస్ట్ అయిన ఆహార ఎగుమతులు 2014-15లోని రూ.33 వేల కోట్లు నుండి 2024-25లో సుమారు రూ.86 వేల కోట్లుకు రెట్టింపు అయ్యాయి.

**ఒక దశాబ్ద కాలం యొక్క దృఢమైన, స్వయం పోషక పెరుగుదల**
ఈ రంగం అత్యంత ప్రశంసనీయ పెరుగుదల సాధించి మరియు 2023-24 ముగింపుగా గత తొమ్మిది సంవత్సరాలు పైగా 6.55% వార్షిక సగటు పెరుగుదల రేట్‌ను దాటింది.

DD న్యూస్‌పై ప్రత్యక్ష ప్రసారం

www.worldfoodindia.gov.in @worldfoodindia

WFI 2025 వీక్షించటానికి స్కాన్ చేయండి

వార్త


పుస్తకాలు మాత్రమే చదవకు. మనుషులను కూడా చదువు. ముఖ్యంగా నిన్ను నీవు చదువుకో.

-ఆస్కార్ వైల్డ్

# పనిగంటలు ఎన్ని?

దేశ కాల మాన పరిస్థితులను బట్టి శ్రామికశక్తి, ఉత్పాదకతల బేరీజులో మానవ వనరుల వినియోగానికి విలువకట్టే దిశగా ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. ఇప్పటికే కంప్యూటర్ సంస్థల్లో పని గంటల విషయమై చర్చ బయలుదేరింది. చికాగో నగరంల్లో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసిన కార్మిక శ్రామిక వర్గం 8 గంటల పనికాలాన్ని సాధించుకోవడానికి ఎన్నో ఆపసోపాలు పడింది. కార్మికులు పని యంత్రాలుగా నిరంతరం పనిచేసే ప్రదేశాలకే అంకితమైపోవాలన్న భావన నుండి బయటపడి ఎన్నో వెసులుబాట్లు సాధించుకున్నాయన్న తరుణంలో పని గంటల పెంపు ఆలోచన సమయోచితం కాదేమోకార్మికుల ఉద్యోగ భద్రత, ఉపాధి కల్పన రెండింటికీ ఒకదానికొకటి ముడిపడి ఉన్న తరుణంలో కొత్త నిర్ణయాలు వారిని ఏవిధంగా ఇబ్బంది పెడతాయో కాలక్రమేణా తెలిసి రాగలవు. కొన్ని నెలల క్రితం వారానికి 90 పనిగంటలు అవసరమంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యల నంతరం ఈ ప్రతిపాదనపై మిశ్రమ స్పందన వచ్చింది. ఆ పిమ్మట పని గంటల విషయమై ముందడుగులు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో దుకాణాలు, ఫ్యాక్టరీలు ఇతర వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగాల పనివేళలకు సంబంధించి ప్రభుత్వం కొన్ని కీలక మార్పులు ప్రతిపాదించి బిల్లు చేసింది. రోజువారీ పని గంటలను పెంచింది. మహిళలకు రాత్రిపూట పనిని నిర్దేశించింది. వారికి రాత్రి షిఫ్టులను అనుమతిస్తూ ఏపి దుకాణాల సంస్థల సవరణ బిల్లు-2025, ఫ్యాక్టరీస్ సవరణ బిల్లులను అసెంబ్లీ ఆమోదించింది కూడా. కొత్త నిబంధనల ప్రకారం దుకాణాలు, ఇతరసంస్థల్లో రోజువారీ పనిగంటలను 8గంటల నుంచి 10 గంటలకు, ఫ్యాక్టరీల్లో 9 గంటల నుంచి 10 గంటలకు పని సమయాన్ని పెంచారు. కాగా వారానికి మొత్తం పని గంటల పరిమితిని యథాతథంగా 48 గంటలకే పరిమితం చేశారు. దాంతో గతంలో మూడు నెలలకు 75 గంటలుగా ఉన్న ఓవర్ టైమ్ పరిమితిని తాజా 144 గంటలకు మార్చారు. కొత్త సవరణలో భాగంగా మహిళలు రాత్రిపూట షిఫ్టులపైన్న ఆంక్షలను ప్రభుత్వం సడలించింది. ఇకపై మహిళలు తమకు సమ్మతమైతే రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు షిఫ్ట్ టైమింగ్స్‌ను ఎంచుకోవచ్చు. ఫ్యాక్టరీలలో పనిచేసే ఉద్యోగాలకు ప్రతి ఆరు గంటల పనికి అరగంట విరామం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విరామంలో కలుపుకొని ఆ పని వారి మొత్తం పని సమయం రోజుకు 12 గంటలు మించరాదని బిల్లులో పేర్కొన్నారు. 20 మంది కంటే తక్కువ సిబ్బంది ఉన్న చిన్నచిన్న వ్యాపార సముదాయాలకు కొన్ని నిబంధనల్లో మినహాయింపులున్నాయి. ఇన్ని సడలింపులు, మినహాయింపులు కల్పించే ప్రభుత్వాలు మహిళల విషయంలో పూర్తి భద్రతతోపాటు ఇంటి నుంచి కార్యాలయానికి, కార్యాలయం నుంచి ఇంటికివెళ్ళే విషయంలో సుకృత రవాణా సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకే ఇస్తూ చట్టం చేసింది. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాల విషయంలో నిర్దిష్ట ప్రమాణాలు, జాగ్రత్తలు పాటించాలని లేకుంటే తీవ్రస్థాయిలో క్రమశిక్షణ చర్యలు పాటించాలని ప్రభుత్వం సూచిస్తోంది.ఇంతవరకు ఎన్నో ఫ్యాక్టరీల్లో జరిగిన అనేకానేక ప్రమాదాల విషయంలో కనీస భద్రత ప్రమాణాలు పాటించే విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించి ప్రజల నుంచి విమర్శల నెదుర్కొన్నాయి. రాత్రి షిఫ్టుల్లో పనిచేసే మహిళా సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు ఆఫీసు నుంచి ఇంటికి చేరే సమయంలో అగచాట్లకు గురైన సందర్భాలు నమోదై ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీలు, తదితర సంస్థల నుంచి ఇంటికి వెళ్లే మహిళా ఉద్యోగుల భద్రతపై ప్రభుత్వ అజమాయిషీ కూడా ఉండాలి.పనిగంటలు పెరిగితే ఉత్పాదకత పెరుగుతుందన్న ఆలోచన సరికాదని అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. వారంలో మరో రోజుకి కాస్త ఉపశమనం లభిస్తే లభించవచ్చుగాక, కానీ ఒకేసారి నిరంతరాయంగా పదిగంటల పని అనగానే శారీరక బడలికతో అనారోగ్యం పాలయ్యే పరిస్థితి తలెత్తుతుంది. కార్మిక చట్టాలలో వికాస నినాదంతో తెచ్చిన ఇలాంటి మార్పులు శ్రామిక కార్మికులకు ఏవిధంగా అనువుగా ఉంటుయన్నది ప్రస్తుతానికి మిలియన్ డాలర్ల ప్రశ్న. అనుభవ పూర్వకంగా ఎలాంటి సమస్యలు, తలెత్తుతాయనే విశ్లేషణలో, అవి మేథో సమస్యలు కానీ, శారీరక ఆరోగ్య సమస్యలుకానీ ముందు ముందు కానీ తెలియదు. తెలంగాణ, కర్నాటక వంటి రాష్ట్రాల్లోనే కాక బిజెపి పాలిత రాష్ట్రాల్లోనూ పని గంటల పెంపుసమయం కొనసాగుతూనే ఉంది. కర్ణాటకలో 48గంటల పని సూచిస్తునే రోజుకి 8గంటల పనిని 10 గంటలకు పెంచడం కార్మికలోకం ఏమాత్రం సంతృప్తిగా లేదు. ఇలాంటి ప్రతిపాదనలు ఇప్పటికిప్పుడు పుట్టినవి కాకపోయినా శ్రామికలోకానికి ఏమాత్రం ఇబ్బంది కలిగించని రీతిలో ఉండడం అవసరం. పనిగంటలు పెరిగితేనే దేశాభివృద్ధి చెందుతుందన్న వాదన సంగతి ఏమోకానీ కార్మికలోకం ఆగ్రహించింది. పనిదినాలు, సెలవులు, కార్మిక చట్టాలపై విస్తృత స్థాయిలో చర్చసాగాలి. హేతుబద్ధమైన కొత్త భాష్యాలు, వాటికనుగుణంగా ఆచరణయోగ్యమైన పనితీరు కనబరచే శ్రామికవర్గాన్ని తయారు చేసుకోవడం ప్రభుత్వ నిర్ణయాల మీదఆధారపడి ఉంది.కార్పొరేట్ రంగంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల పనిగంటలు,పనితీరుపైకూడా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కోవిడ్ తర్వాత మానవ వనరుల పనితీరు,ఆలోచనల్లో ఎంతో విభిన్నమైన వ్యత్యాసం కనబడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కార్మిక చట్టాలు శ్రామిక వర్గాలకు అనువుగా తీర్చిదిద్దడం అవసరం.

తోటి వారికి మీ వల్ల సాధ్యమైనంత ఎక్కువ ఉపకారమూ, సాధ్యమైనంత తక్కువ అపకారమూ జరిగేటట్లు చూసుకోవడమే సరైన ప్రవర్తన.



హెచ్. లాంగ్‌ఫెలో

ఆలోచించినదంతా మాట్లాడకు. ఆలోచనలు మాత్రమే నీవి. అవి బయటకు వెళితే మాత్రం నీవి కావు.



బెర్నార్డ్ షా

## ప్రజావాక్కు



### జీఎస్టీ తగ్గింపు రాష్ట్రానికి లాభమా? నష్టమా?

జీఎస్టీ రేట్లుతగ్గితే వినియోగదారులకు తక్షణ ఉపశమనం లభిస్తుంది. వస్తువులు,సేవలు తక్కువ ధరలకు దొరకడం వల్ల వినియోగం పెరిగి వ్యాపారానికి ఊతం లభిస్తుంది. దీర్ఘకాలంలో ఇది రాష్ట్రానికి పరోక్ష లాభాలను అందించ గలదు. అయితే తక్షణ ఫలితాలు మాత్రం భిన్నంగా ఉంటాయి. రాష్ట్ర ఆదాయం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. తెలంగాణ వంటి అభివృద్ధి దశలో ఉన్న రాష్ట్రానికి ఈ పరిస్థితి ఆర్థిక భారంగా మారవచ్చు. సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సేవలపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. ఇలాంటి సందర్భంలో అసలు ప్రశ్న ఏమిటంటే ఈ నష్టాన్ని ఎవరు భరించాలి? జీఎస్టీ ఒక జాతీయ పన్ను విధానం కావడంతో కేంద్ర ప్రభుత్వమే రాష్ట్రాల ఆదాయ లోటును భర్తీ చేయాల్సిన బాధ్యత వహించాలి. ఇందుకోసం జీఎస్టీ పరిహార నిధి ఇప్పటికే ఏర్పాటు చేసినా, రాష్ట్రాలకు సమయానికి ఆ నిధి అందకపోవడం సమస్యగా మారుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### అహంకారం అంతరాలు చూస్తుంది

అహంకారం తలకెక్కితే అంతరాలు కనబడవు ఇందులో ఆరోగ్యకరమైన ఆత్మవిశ్వాసం,ఆత్మగౌరవం,తనను తాను గౌరవించుకునే భావన కూడా అహంకారం ఒక రూపమై వ్యక్తిగత లక్ష్యాలను సాధించడానికి సహాయపడుతుంది. కాని కొందరు తమ గుర్తింపు,విజయాలు లేదా సామర్థ్యాల గురించి ఉన్నతమైన భావన కలిగి ఉండి దర్పంతో ఇతరుల పట్ల ధిక్కారంతో కూడిన ప్రవర్తన, వారిని తక్కువగా చూసే స్వభావం.ఆత్మవిశ్వాసంతో పాటు మితిమీరిన ధైర్యం లేదా ముందుచూపు లేకుండా ప్రవర్తించడం, ఇది మొరటుగా లేదా అసంబద్ధంగా కనిపిస్తుంది.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### అభివృద్ధి అంటే ఏమిటి?

అభివృద్ధి ఎలా ఉండాలి, అసలు అభివృద్ధి అంటే ఏమిటి అని ఆలోచనలు చర్చలు ప్రతి రోజు నడుస్తుంటాయి. అయితే ఒక భౌగోళిక ప్రాంతంలో ఉన్న సహజ వనరులను విధ్వంసం చేసి తద్వారా సృష్టించబడిన ఆస్తి ఆ ప్రాంత పౌరులకు ఏ విధంగా ఉపయోగపడకపోతే ఎం లాభం?ఉత్తరాఖండ్‌లోనదులపైనఎలివేట్డ్ హైవేలు తెలం

- భారత అవినాష్, జనగామ

### ప్రపంచ శాంతికి దోహదం చేయగలరా?

పాలస్తీనా ప్రభుత్వాన్ని బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, పోర్చుగీసు దేశాలు గుర్తించాయి. అలాగే ఫ్రాన్స్ తదితర దేశాలు కూడా అదే బాటలో తమ సమ్మతిని తెలియచేసాయని వార్త. ఏటాజరిగే ఐక్యరాజ్య సమితి జనరల్ ఎసెంబ్లీకి దాదాపు 140 దేశాధినేతలు అమెరికాలోని న్యూయార్క్ నగరానికి నిర్దేశించిన తేదికి చేరుకోనున్నారు. ఈ సమావేశ ముఖ్యోద్దేశం ఇజ్రాయెల్ పాలస్తీనాల మధ్యసయోధ్య కుదర్చడమేనని ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు గట్టిగా విశ్వసిస్తున్నాడు. ప్రపంచంలోని సగం దేశాలు ఈ ఎజెండాను సమర్థించడం మిక్కిలి హర్షింపదగ్గదే. ఇజ్రాయిల్ అధ్యక్షుడు నేతన్యాహుఆయన అమెరికా మిత్రుడు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పాలస్తీనాలోని గాజా సీటిని, ప్రజలను, ఆస్తులను ఏమన్నా ఇంకా మిగిలి ఉంటే వాటిని కాపాడే ప్రయత్నం చేయాలి.ఇప్పటికే తానుఏడుయుద్ధాలను ఆపానని తనంతతానే ఘనంగా చెప్పుకుంటూ నోబల్ శాంతి బహుమతికి అర్రులు చాస్తున్న శ్వేతసౌధాధిపతి ప్రపంచశాంతికి దోహదం చేయగలరా?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### అధికరేట్లకు అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి వెంకన్న దర్శనం కోసం ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికులు వస్తుంటారు. కనీసం 70,80 వేలమంది వస్తుంటారు.పైన వెంకన్న నిలువు దోపిడీచేస్తే, కింద బస్టాండు షాపులవారు ప్రతి వస్తువుమీద అసలు రేట్లకంటే ఎక్కువ ధరకు అమ్ముతు ప్రయాణికులు జేబులు ఖాళీచేస్తున్నారు. పర్యవేక్షణ లేదు.అందరూ ఫిర్యాదుచేయలేరు కదా! దాదాపు అన్నీ బస్టాండులలో పరిస్థితి ఇలాగే ఉంటుంది. వాటర్ బాటిల్ మీద కనీసం ఐదురూపాయలు ఎక్కువతీసుకుంటారు. కూల్డ్రింకుల మీద పదిరూపాయలు ఎక్కువ తీసుకుంటున్నారు. ఆర్టీసి యజమాన్యంవారు ఈదోపిడిపైన దృష్టిపెట్టి తగుచర్యలు తీసుకోవాలి.

-నార్నెవెంకటసుబ్బయ్య, ఒంగోలు, ప్రకాశం జిల్లా

### ఉపయోగం లేని గురుకుల వాషింగ్ మిషన్‌లు?

తెలంగాణ రాష్ట్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల విద్యాసంస్థలలో లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన వాషింగ్ మిషన్‌లు నిరుపయోగంగా ఉండడం వలన ప్రభుత్వ ధనం వృధా అవుతుంది.అట్టిమిషన్ గదులలో చూడడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. అధికారులు ఆయా గురుకులంలో ఉన్న వాషింగ్ మిషన్ ఉపయోగంలోకి తెచ్చే విధంగా క్రీడల ఉపాధ్యాయిని పర్యవేక్షణలో వాషింగ్ మిషన్ ఉపయోగంలోకి తేవాలి.

- రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# ఎత్తుకు పైఎత్తులతో నేతల ఎదురీత

**ఎన్డీయే, మహాగట్ బంధన్ల మధ్యపోటీ నువ్వానేనా అన్నట్లున్నది.ఓట్ల తేడా ఒక్క శాతం గనుక ఇంకా నెలరోజులు పైగా వ్యవధి ఉన్నందున ,ప్రధాని మోడీ, నితీష్, రాహుల్, తేజస్విలకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకమైనవి. వాగ్ధాటిలో, ఎన్నికల మంత్ర, తంత్రాలలో ప్రధాని మోడీ మేటి గనుక, తన ప్రచార ధాటితో, మరిన్ని ఎన్నికల వాగ్దానాలతో ఎన్డీయేను ఆయన మళ్లీ విజయ పంథాన నడిపిస్తారని అధికార కూటమి అభిమా నులు విశ్వసిస్తున్నారు ఎన్నికల సర్వేక్షకుడు ప్రశాంత్ కిషోర్ కొత్తగా ప్రారంభించినరంభించిన జన సురాజ్ పార్టీ గెలిచేంత ప్రభావం చూపలేకపోయినా ఏమేరకు, ఎంత శాతం ఎన్డీయే ఓట్లు చీలుస్తుందనేది వేచి చూడాల్సిందే. తేజస్విపై యువత మొగ్గు ఉన్నా మరికొన్ని ఇతర సామాజిక వర్గాలను కూడగట్టడం, భాగస్వామ్య పక్షాల మధ్య సజావుగా సీట్ల సర్దుబాటు పైనే, గట్బంధన్ విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.**



పతకమూరు దామోదర్ ప్రసాద్

యుపి తర్వాత 13.1కోట్ల జనాభాతో రెండో పెద్ద హిందీ రాష్ట్రంబీహార్ 18వ శాసనసభకు త్వరలో జరుగనున్న ఎన్నికలలో గెలవడానికి మోడీ, నితీష్ కుమార్‌ల నేతృత్వంలోని అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి, కాంగ్రెస్ అధినేత రాహుల్, మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ రెండో కుమారుడు ఆర్జెడి అధిపతి తేజస్వి యాదవ్‌ల నాయకత్వంలోని ప్రతిపక్ష కూటమి మహాగట్ బంధన్ నువ్వా..నేనా అనేరీతిలో తలపడుతున్నాయి. సామాజిక న్యాయం, కులఅస్తిత్వాల ప్రభావం అధికంగా ఉన్న బీహార్, తమిళనాడుల పరిస్థితిని గమనంలోకి తీసుకుని ఇన్నాళ్లు వ్యతిరేకిస్తూ వచ్చిన కులగణనకు ప్రధాని మోడీ ఆమోదం తెలపడం అధికార కూటమికి అనుకూలం కాగలదని భావిస్తున్నారు. సుపరిపాలనాదక్షుడిగా పేరు గాంచిన సోషలిస్టు నితీష్ కుమార్ 2సార్లు కూటములు మార్చినా,10 నెలల పాటు మహా దళిత నేత జితన్ రామ్ మాంజికి సీఎం పదవి అప్పగించడం పోను గత20 ఏళ్లగా ముఖ్యమంత్రిగా కొనసాగుతూనే వున్నారు. ప్రధాని నరేంద్రమోడీ ఇప్పటికే 6సార్లు బీహార్లో పర్యటించి నితీష్‌తో కలిసి ఎన్నోఅభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రకటించి, కొన్నిప్రారంభించి బీహారీలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కాగా ఎన్నికల సంఘం అధికార కూటమికి లబ్ధి కలిగేలా ఓటర్ల జాబితా నుండిఅర్హులైన లక్షలాదిమందిని తొలగిస్తు ఉందని ఆరోపిస్తూ తేజస్వి యాదవ్‌తో కలిసి రాహుల్ జరిపిన ఓటు చోరీ వ్యతిరేక యాత్రకు ప్రజలు తండోపతండాలుగా హాజరుకావడం విశేషం. అయితే కాంగ్రెస్ అక్రమ వలసదార్లను దేశంలో తిష్ట వేసి మన వనరులు కబలించేలా ప్రోత్సహిస్తోందని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు ధ్వజమెత్తుతుండగాగత11 ఏళ్లగా కేంద్రంలో అధికారంలో ఉన్నా అసమర్ధ బిజెపి సర్కార్ అక్రమ వలసలు నిరోధించలేకపోయిందని కాంగ్రెస్, ఆర్జేడీ ఎదురు దాడిచేస్తున్నాయి. మహాగట్బంధన్ గెలిస్తే మళ్లీ లాలూ కాలం నాటి ఆటవిక పాలన వస్తుందని అధికార కూటమి హెచ్చరిస్తుండగా రెండింజన్‌ల పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని, నిరుద్యోగం పెరిగి బిహారీల వలసలు,ద్రవ్యోల్బణంతో ధరలుపెరిగి శాంతిభద్రతలు క్షీణించి మహిళలు భీతిల్లున్నారని ప్రతిపక్ష కూటమి ఆరోపిస్తోంది. 2020 శాసనసభ ఎన్నికలు కూడా 2 కూటముల మధ్య హోరాహోరీగా జరిగి చెరి 37శాతం ఓట్లు సాధించాయి. మజ్లీస్ పార్టీ పోటీకి దిగి ఉత్తరబీహార్లో 5సీట్లు గెలవడంతో మైనారిటీ ఓట్లు తగ్గి గట్బంధన్ అధికారానికి దూరం కావలసి వచ్చింది.రెండు కూటముల మధ్యఓట్ల తేడా11వేలే. గత అసెంబ్లీ ఎన్నికలలో ఆర్జేడీ 144 స్థానాలకు పోటీ చేసి 75 స్థానాలు గెలవగా,బిజెపి 101 స్థానాలకు పోటీ చేసి74 సీట్లు గెలిచి రెండో పెద్దపార్టీగా నిలిచింది.కాంగ్రెస్ 70 సీట్లకు పోటీ చేసి కేవలం 19స్థానాలే గెలిచినందున ఈసారి 50 స్థానాలకే పరిమితం చేసికూటమిలో కొత్తగా చేరిన ముకేశ్ సహానీ నాయకత్వంలోని నిషదుల వికాస్ సీల్ ఇన్సాఫ్(వీఐపి) పార్టీకి కనీసం డజన్ స్థానాలు కేటాయించాలని తేజస్వి యాదవ్ తలపోస్తున్నారు.గత ఎన్నికలలో 19 స్థానాలకు పోటీచేసిన మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ 12 స్థానాలు గెలవగా 6 స్థానాలకే పోటీ చేసిన సీపిఐ 4స్థానాలకు పోటీ చేసిన సిపిఎం చెరి 2 సీట్లు గెలిచాయి. 2020లో కూడా నితీష్ ప్రాభవాన్ని తగ్గించడానికి బిజెపి కుతంత్రం పన్ని చిరాగ్‌పాశ్వాన్ ఎల్జేపిని ఎగదోసి 137 స్థానాలకు అదీ జేడీయు పోటీ చేస్తున్న చోట్ల పోటీ పెట్టడంతో జేడీయు 43 స్థానాల్లో మాత్రమే గెలిచినా బిజెపికి తగిన సారథి లేక




మళ్లీ నితీశ్‌కే పట్టంకట్టక తప్పలేదు. ఈసారి కూడా అదే పన్నాగంలో భాగంగానే కమలనాథులు నితీష్ పేరుని ఎన్డీయే సీఎం అభ్యర్థిగా ప్రకటించడం లేదనే ఆరోపణలున్నాయి. అయితే నితీశ్ తప్ప మరొకరు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం లేదని జేడీయూ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఝా స్పష్టం చేశారు.కమలనాథులు నోరుమెదపడం లేదు.అందుకే చిరాగ్ పాశ్వాన్ మొత్తం243 స్థానాలకు పోటీ చేస్తామని ప్రకటనలు ఇస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికలలో ఎన్డీయే 30సీట్లు గెలిచింది. పాశ్వాన్ ఎల్జేపి5 ,బిజెపి 12,జేడీయూ 12,మాంజీ హిందుస్తాన్ అవామీ ఒక్క ఎంపీ స్థానాలు గెలిచాయి.గత గట్‌బంధన్ 9ఎంపీ స్థానాలు గెలవగా అందులో ఆర్జెడి 4,సిపిఎంఎల్ 2కాంగ్రెస్ 3స్థానాలు దక్కించుకున్నాయి. ఇండిపెండెంట్‌గా పప్పుయాదవ్ గెలిచారు.బీహార్‌సామాజిక స్వరూపాన్ని పరిశీలిస్తే దాదాపు20శాతం దళితులుకాగా వారిలో పాస్వాన్లు 5శాతం,ముసాహార్లు 3శాతం,ఇతర దళిత కులాలవారు 10శాతం, 1.8శాతం ఎస్టీలు ఉన్నారు. 15.5శాతం ఉన్న అగ్రవర్ణాలు ప్రధానంగా బిజెపికి స్థానిక నాయకత్వాలు బలంగా ఉన్న చోట్ల కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. బ్రాహ్మణులు 3శాతం, భూమిహారులు2.8 శాతం కాయస్థులు0.6 శాతం ఉన్నారు.వీరిలో అత్యధికులు మోడీ నితీశ్ మద్దతుదారులు. 27శాతం బిసిలలో యాదవులు 14శాతం కాగా ముస్లింలు17 శాతం ఉన్నారు. వీరు ప్రధానంగా ఆర్జేడి,కాంగ్రెస్ మద్దతుదారులు.దాదాపు3శాతం ఉన్న కుర్మీలు,4శాతం ఉన్న కుస్వాహలు బీహార్ ఉత్తర ప్రాంతంలో ఎన్డీఏకు, దక్షిణప్రాంతంలో మహాగట్ బంధన్‌కు ఓటేయవచ్చని అంచనా.7శాతం ఉన్న తెలి,కాను, బిసి బనియాలు ఎక్కువగా ఎన్డీఏ వైపు మొగ్గు చూపవచ్చు మైనారిటీలు ఎక్కువగాఉండే సీమంచల్ ప్రాంతంలో మజ్లీస్ పోటీచేస్తే గట్బంధన్ ఓట్లు చీలి ఎన్‌డియేకు లాభించవచ్చు. నితీష్ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 2006 నుండి పంచాయతీలలో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు, బేటీ బచావ్..బేటీ పడావ్ కార్యక్రమం కింద 9వ తరగతి నుండి డిగ్రీవరకు రూ.94,100 ఒక్కోబాలిక ఖాతాల్లో జమచేస్తూ వచ్చారు.బాలికలకు 9వ తరగతి నుండి ఉచితసైకిళ్లు, ఆర్థిక సాయం అందిస్తూ మహిళల అక్షరాస్యత 20శాతం పెరిగేలా చేశారని మన్ననలు పొందారు.2006లోనే నితీష్ ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకాలలో50శాతం రిజర్వేషన్లు కల్పించింది. 2005లో గెలిచాక గృహహింస చట్టాలు కఠినతరం చేయడంతో అవి తగ్గి మహిళలకు ఎంతో ఊరట నిచ్చాయి. మహిళలు సొంతవ్యాపారాలు చేసుకోవడానికి ఒక్కోమహిళకు రూ.10వేలు ఆర్థికసాయం పంపిణీచేస్తూ వారి ఇళ్లలోదసరా పండుగ సంబరాలు నింపుతున్నారు.అయినా బిహార్ అసెంబ్లీకి కేవలం 26మంది,అంటే 10శాతం మహిళలు మాత్రమే ఎన్నికయ్యారు.బీహార్ జనాభాలో సగం మంది 25ఏళ్ల యువత. జనాభా అధికంగా ఉండటంతో ఉద్యోగ ఉపాధి కోసం బయటిప్రాంతాలకు వలస వెళుతున్నందున ఓటింగ్‌లో మహిళలే అధికంగా పాల్గొంటున్నారు. ప్రతివెయ్యిమంది పురుషులకు 918 మంది మహిళలు మాత్రమే ఉన్నారు. రాహుల్, తేజస్విల ఓట్ల చోరీ జరిగిందనే ప్రచారం సంచలనం కలిగించింది.అందులో ఎంత మాత్రంనిజంలేదని కేంద్ర ఎన్నికల సంఘం,బీజేపీ ఖండిస్తున్నా అనుమానాలు తొలగిపోలేదు. ఇప్పటివర కు98శాతం పైగా అంటే 7,89,68,844 రిజిస్టర్డ్ ఓటర్ల తనిఖీ,డిజిట లై జేషన్ పూర్తయిందని,20లక్షల మంది ఓటర్లు మరణించారని,28 లక్షల మంది శాశ్వతంగా వలస వెళ్లారని,4.7 లక్షలమంది 2చోట్ల ఓటర్లుగా నమో దయ్యారని,మొత్తం ఓటర్లు 7.9 కోట్లు కాగా వారిలో 4.5 శాతం వారి నివాసాలలో లేరని యెన్నికల సంఘం ధృవీకరించింది. ఎన్డీయే, మహా గట్ బంధన్ల మధ్యపోటీ నువ్వానేనా అన్నట్లున్నది.ఓట్ల తేడా ఒక్క శాతం గనుక ఇంకా నెలరోజులు పైగా వ్యవధి ఉన్నందున ,ప్రధాని మోడీ, నితీష్, రాహుల్, తేజస్విలకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మక మైనవి. వాగ్ధాటిలో,ఎన్నికల మంత్ర, తంత్రాలలో ప్రధాని మోడీ మేటి గనుక, తన ప్రచార ధాటితో, మరిన్ని ఎన్నికల వాగ్దానాలతో ఎన్డీయేను ఆయన మళ్లీ విజయ పంథాన నడిపిస్తారని అధికార కూటమి అభిమానులు విశ్వసిస్తున్నారు ఎన్నికల సర్వేక్షకుడు ప్రశాంత్ కిషోర్ కొత్తగా ప్రారంభించినరంభించిన జన సురాజ్ పార్టీ గెలిచేంత ప్రభావం చూపలేకపోయినా ఏమేరకు, ఎంత శాతం ఎన్డీయే ఓట్లు చీలుస్తుందనేది వేచి చూడాల్సిందే. తేజస్విపై యువత మొగ్గు ఉన్నా మరికొన్ని ఇతర సామాజిక వర్గాలను కూడగట్టడం, భాగస్వామ్య పక్షాల మధ్య సజావుగా సీట్ల సర్దుబాటు పైనే, గట్బంధన్ విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.ప్రధాని మోడీకి ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకమే గనుక ఆయన విజయసాధనకు గట్టి ప్రయత్నాలే చేస్తారు. అక్టోబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక మరింత స్పష్టత రావచ్చు. ●

(రచయిత: సీనియర్ జర్నలిస్టు)

# వైద్యుల, రోగులకు వారధులు ఫార్మసిస్టులే

రామ కిష్టయ్య సంగన భట్ల

ఆరోగ్యంపై ప్రతి వారికీ శ్రద్ధ ఉండడం సహజం. ఆరోగ్యం కోసం ప్రపంచంలోని ప్రతిఒక్కరూ నానాపాట్లు పడుతుంటారు. చికిత్స కన్నా, నివారణే నయమని, ఇప్పుడిప్పుడే చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏ చిన్నపాటి రోగం వచ్చినా,వెంటనే మందులు తీసుకుంటున్నారు.ఆరోగ్య మెరుగుదలలో మందులు ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. ఇంతకూ మందులను ఎవరు మెరుగుపరుస్తారో, ఎవరు తయారు చేస్తారో తెలుసా ఫార్మాసిస్టులు. వైద్య బృందంలో ఫార్మసిస్టుల ప్రాముఖ్యత ఎంతో ఉంది. చికిత్స,ఉత్పత్తులను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా రోగులకు ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ఔషధ నిపుణుల ప్రాథమిక లక్ష్యం. అందువల్ల, ఫార్మసిస్ట్‌ప్రాముఖ్యత, పాత్ర గురించి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని జరుపుకుంటారు.ఈ సందర్భంగా ఫార్మాసిస్టులు మానవాళి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎలాంటి పాత్ర పోషిస్తారో, వైద్య ప్రపంచంలో ఫార్మాసిస్టుల పాత్రఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. వాస్తవానికి ఫార్మాసిస్టు రెండో వైద్యుడిగా పరిగణించబడతాడు.రోగులకు కావాల్సిన మందులను,ఏ రోగికి ఎంత మోతాదులో కావాలో నిర్ధారిస్తాడు. అంతేకాదు వాటి వల్ల ప్రయోజనాలు కలిగేలా చేస్తాడు. దుష్ప్రభావాలు కలగకుండా మార్గనిర్దేశాలు చేస్తాడు. క్లినికల్ ఫలితాలను మెరుగుపరచడానికి మందులు వాడే పద్ధతిని, సురక్షితమైన వాడకాన్ని కూడా ప్రోత్సహిస్తాడు. ప్రపంచంలోని ప్రతి ఒక్క రోగికీ అందరికీ సురక్షితమైన, సమర్థవంతమైన మందులు అందించేందుకు అనుక్షణం ఫార్మాసిస్టులు కృషిసల్పుతారు. ఔషధాల వాడకాన్ని మెరుగుపరచి, రోగుల భద్రతను నిర్ధారించే, పరిరక్షించేందుకు ఫార్మాసిస్టులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు. ప్రజల ఆరోగ్య భద్రత రీత్యా మెడిసిన్స్‌లోని లోపాలను తగ్గించేందుకు ఫార్మాసిస్టులు ఎక్కువగా కృషి చేస్తారు. ఫార్మాసిస్టులు వారి విస్తృత జ్ఞానం, నైపుణ్యాన్ని ప్రజల ఆరోగ్యాల కోసం ఉపయోగిస్తారు. ఏ ఒక్క రోగికి హాని కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందనే విషయాన్ని అనుక్షణం గుర్తుంచుకుని, పనిచేస్తారు. వారు తయారు చేసిన మెడిసిన్స్ నుండి ఉత్తమ ఫలితం వచ్చేలా కృషి చేస్తారు. చాలా మంది వారి పని, తాము సూచించిన మందులను అప్పగించడమే అనుకుంటారు.కానీ జ్ఞానం, అనుభవపరంగా వారు డాక్టర్ కంటే ఏమాత్రం తక్కువ కాదు. ఫార్మాసిస్టులకు మెడిసిన్స్, వాటి దుష్ప్రభావాల గురించి సంపూర్ణ అవగాహన ఉంటుంది. ప్రధానంగా వైద్యులవద్దకు వెళ్లలేని, వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు, ఔషధాలను అందించడంలోనూ వారు ఎక్కువ బాధ్యత వహిస్తారు. కాని ఔషధ పంపిణీకి మించి ఫార్మాసిస్టు పాత్ర విస్తరిస్తుందని మనం తెలుసుకోవాలి. రోగులకు హాని లేదా మరణానికి మరో ప్రధాన కారణం ఔషధ లోపం అని కొన్ని అధ్యయనాలు చెపుతున్నాయి. లోపం తరచుగా శాశ్వత అవ యవ నష్టం, పక్షవాతం లేదా మరణానికి దారి తీస్తుంది. ఔషధ లోపం, వాటిని నివారించడంలో ఫార్మాసిస్టుల వల్ల కలిగే పరిణామాలను చూసిన ఈరోజును ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ 2009 ఇస్తాంబుల్ (టర్కీ)లో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఫార్మసీఅండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో గుర్తించింది. కానీ అంతకుముందే 1912 సంవత్సరంలోనే సెప్టెంబర్ 25న ఫార్మాసిస్టు డే జరుపుకోవడానికి ఎంపిక చేయబడింది. అప్పటి నుండి ఫార్మాస్యూటి కల్ ఫెడరేషన్ ప్రారంభించబడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్తంగా కనీసం 2.6 మిలియన్ ఫార్మసిస్టులు ఇతర ఫార్మాస్యూటికల్ సిబ్బంది ఉన్నట్లు అంచనా వేసింది. ఆరోగ్యకరమైన జీవనానికి సలహాఇవ్వడం, వ్యాధిని నివారించడానికి టీకాలు వేయడం మందులు సరిగ్గా తీసుకునెలా చూడడం, తద్వారా వ్యాధులను చక్కగా నయం చేయడం, జీవిత నాణ్యతను మెరుగుపరచడం, సురక్షితమైన,సమర్థవంతమైన మందులు,వ్యాక్సిన్లను అభివృద్ధి చేయడంద్వారా ఔషధ శాస్త్రవేత్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేస్తున్న సేవలు అమోఘం. ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందరూ ఫార్మాసిస్టుల సేవలను గుర్తించి, ఔషధ తయారీ నుండి, కావలసినవారికి పంపిణీ, మందులు వాడే విధానం వరకు, అసమాన సేవలు అందిస్తున్న వారి ప్రతిభావంతమైన పాత్రకు సముచిత గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలి. ●

# దేశీయ బ్యాంకులపై విదేశీ పెత్తనమా?



డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

దేశంలో మిలిటరీ పోలీస్ వ్యవస్థలు తప్ప అన్నిరంగాలలో విద్యా వైద్య పారిశ్రామిక సేవల తదితర రంగాలు ప్రైవేట్ యాజమాన్యంలో నడుస్తున్నాయి. ఇప్పుడు బ్యాంకులపై విదేశీ పెట్టుబడి సంస్థల పెత్తనం ఉండే విధంగా పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భారతీయ బ్యాంకుల యాజమాన్యంలో ప్రవాసులకు వాటా ఉండవచ్చు. అయితే ఆ వాటా 15శాతానికి మించకుండా ఉండాలని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిమితి విధించింది. అయితే ఆ పరిమితిని అప్పుడప్పుడు ఉల్లంఘిస్తున్నారు. దీనివలన మరలా మన బ్యాంకులు పెట్టుబడిదారుల చేతుల్లోకిపోయే ప్రమాదం ఉన్నది. ఒకప్పుడు బ్యాంకులంటే పెట్టుబడిదారులవే. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెండు దశాబ్దాలు గడిచినంక కొన్ని బ్యాంకులను జాతీయంచేసి ప్రభుత్వ నియంత్రణలోకి తెచ్చుకొని ప్రజలకు ఉపయోగపడే విధంగా బ్యాంకులను నియంత్రించారు. 1980లో మరల ఆరు బ్యాంకులను ప్రభుత్వ నియంత్రణలోకి తెచ్చారు. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో రుణ సదుపాయాలు బ్యాంకుల నుంచి అంతంత మాత్రంగానే ఉండేవి. 1975లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను స్థాపించి ముఖ్యంగా సన్న చిన్నకారు రైతులకు గ్రామీణ చేతివృత్తుల వారికి రైతు కూలీలకు మాత్రమే ఈ గ్రామీణబ్యాంకులో రుణాలు అందించాలని నిర్దేశించిగ్రామీణ అభివృద్ధికి తోడ్పడినాయి. ఇలా భారత ప్రభుత్వంబ్యాంకింగ్ వ్యవస్థను నియంత్రించి ప్రజల ముంగిటతెచ్చారు. ఆనాడు గ్రామీణ బ్యాంకులలో ప్రజలందరూ ఎంతోకొంత రుణ సదుపాయం పొందారనడంలో సందేహంలేదు. ప్రభుత్వ నియంత్రణలో ఉన్నంతకాలం 1990 దశకానికి ముందు కాలంలో భారతీయ ఆర్థికరంగంలో చేపట్టిన పురోగమి చర్యలు అన్నిటిని నేడు గణనీయంగా నయా ఉదారవాదం వలన తిరుగుముఖం పట్టింది. ఉదాహరణకు ప్రధానంగా రుణాలకు సంబంధించి పాటించవలసిన ప్రమాణాలు అసలు ప్రాధాన్యతలు ఏమిటన్న నిర్వచనాన్ని మార్చివేశారు. అంతకుముందు రైతులు చిన్న ఉత్పత్తిదారులు చిన్న వ్యాపారులు బలహీన వర్గాల వారు ప్రధాన రంగంగా పరిగణించబడ్డాయి.ఇప్పుడు అటువంటి దిగువ తరగతుల ప్రజలకు బ్యాంకు రుణాలు



లభించడం దాదాపు అసాధ్యమయ్యే విధంగా విధానాలను మార్చివేశారు. ఇటీవల ఐద్వా చేసిన అధ్యయనం ప్రకారం ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలకు మైక్రోఫైనాన్స్ కంపెనీలకు బ్యాంకులు 10కన్నా తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నాయి. ఆ ఫైనాన్స్ కంపెనీలు పేద మహిళలకు 26శాతం వడ్డీకి రుణాలను ఇస్తున్నాయి. బ్రిటీష్ వారి కాలంలో గ్రామాల్లో వడ్డీ వ్యాపారి పేదలను ఏ విధంగా కొల్లగొట్టేవాడు అదే మాదిరిగా ఇప్పుడు జరుగుతున్నది. అంతేకాదు ఈ ఫైనాన్స్ సంస్థలకు బ్యాంకులు ఇచ్చే రుణాలను ప్రాధాన్యత రంగంగా పరిగణిస్తున్నారు. గతంలో బ్యాంకులను జాతీయం చేసినప్పుడు ప్రకటించిన లక్ష్యాలలో వ్యవసాయానికి చిన్న వ్యాపారులకు చిన్నతరహా పరిశ్రమలకు తేలికగా మధ్య దళారీలు లేకుండా రుణాలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యం ఒకటిగా ఉండేది. ఇప్పుడు ఆ లక్ష్యమే దెబ్బతినింది. మరోపక్క బ్యాంకింగ్ రంగం యావత్తు ప్రభుత్వ రంగ బ్యాంకులతోసహా బడా పెట్టుబడిదారుల కనుసనల్లోకిపోయింది. ఆ బడా పెట్టుబడిదారులు బ్యాంక్ రుణాలను అత్యధికంగా పొందడం వాటిని తిరిగి చెల్లించకుండా ఉండడం వంటివి చేయకుండా వారి ఆటలు కట్టించడం కోసం గతంలో బ్యాంకులను జాతీయం చేసినారు. ఇప్పుడు ప్రభుత్వరంగ బ్యాంకులలో ప్రభుత్వ వాటాక్రమంగా తగ్గిపోతే, విదేశీ సంస్థల వాటా పెరిగితే బ్యాంకుల జాతీయకరణ గ్రామీణ బ్యాంకుల స్థాపన ఉద్దేశాలు కనుమరుగవుతాయి. ఇప్పుడు దీనికితోడు బ్యాంకులల్లో విదేశీ సంస్థల వాటా 15శాతానికి మించితే అప్పుడు విదేశీసంస్థల గుత్తాధిపత్యంతో పేదలు మధ్యతరగతి వారికి బ్యాంకు రుణాలు మరింత దూరం అవుతాయి. బ్యాంకుల్లో దాచుకున్న ధనం మరింతగా స్పెక్యులేటివ్ కార్యకలాపాలకు ఈ పెట్టుబడిదారులు మళ్లిస్తారు.అందుకే ప్రస్తుతం ఉన్న 15శాతం పరిమితిని తొలగించాలని విదేశీ పెట్టుబడిదారులు ఒత్తిడి చేస్తున్నారు. అంతేగాక భారత ఆర్థికవ్యవస్థ మీద తన పట్టు పెరగాలంటే భారతీయ బ్యాంకుల మీద పెత్తనం సాధించడం సామ్రాజ్యవాదానికి కీలకమైన అంశంగా ఉంటుంది. నయా ఉదారవాదం అంటే సామ్రాజ్యవాదపు వ్యూహం అని మనం గమనించాలి.విదేశీ యాజమాన్యానికి విదేశీ ప్రభుత్వం నుండి పూర్తి సహకారం లభిస్తుంది. అదే మాదిరి సహకారం భారతీయ యాజమానికి మన ప్రభుత్వం నుండి లభించదు. ఇలా నయా సామ్రాజ్యవాద విధానం వైపుగా మన బ్యాంకింగ్ వ్యవస్థను మన బ్యాంకులపై విదేశీ పెత్తనాలను అనుమతిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై పేద మధ్యతరగతి వాళ్లకి రుణాలు అందడం దుర్భరమవుతుంది. ●


# బల్వంత్‌ను ఇంకా ఎందుకు ఉరితీయలేదు?



## పంజాబ్ మాజీ సిఎం హత్యకేసు విచారణలో ప్రశ్నించిన సుప్రీం

### తన మరణశిక్షను జీవితఖైదుగా మార్చాలన్న బబ్బర్ ఖల్సా ఉగ్రవాది

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** పంజాబ్‌ముఖ్యమంత్రి బియాంత్‌సింగ్ హత్యకేసులో నిందితుడిగా ఉన్న బబ్బర్‌ఖల్సా ఉగ్రవాది బల్వంత్‌సింగ్ రాజోనాపై ఉన్న మరణశిక్షను ఇప్పటివరకూ ఎందుకు అమలుచేయలేదని కారణాలను ప్రశ్నించింది. రాజోనా దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణకు స్వీకరించింది. ఆయనపైఉన్న మరణశిక్షను జీవిత ఖైదుగా మార్చాలంటూ దాఖలుచేసిన పిటిషన్‌ను బుధవారం విచారణకు స్వీకరించింది. తన క్షమాబిక్ష పిటిషన్ రాష్ట్రపతి వద్ద 2012 నుంచి ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందని అందువల్ల తన మరణశిక్షను రద్దుచేయాలంటూ అభ్యర్థించారు. పంజాబ్ పోలీస్ అధికారి అయిన బల్వంత్‌సింగ్ రాజోనా 2007లో ఆయనకు మరణశిక్ష విధించింది.
ఆయనపై ఐపిసి 120బి, 302, 307, 1860 ఐపిసిపరిధిలోను, ఆయుధ చట్టం 1908లోని సెక్షన్స్ 3(బి), 4(బి) 5(బి) రెడ్‌విత్ 6సెక్షన్లకింద కేసులు నమోదు చేసారు. చండీఘర్ సెక్రటేరియట్ కాంప్లెక్స్‌లో 1995 ఆగస్టు 31వ తేదీ ఆత్మాహుతి బాంబు దాడికి పాల్పడ్డారని, ఆ దాడిలోనేనాటి పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్‌తోపాటు మరో 16 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సిబిఐ ఛార్జిషీటు దాఖలుచేసింది. ఈకేసులో బుధవారం సింగ్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తన వాదనలు వినిపించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్; జస్టిస్ సందీప్‌మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారి యాల బెంచ్‌పై రాజోనా పిటిషన్‌ను విచారిం చారు. రాజోనాను ఇప్పటికే 29 ఏళ్లకుపైబడి జైలులో ఉంచారని, 15 ఏళ్లుగా ఆయ ఇప్పటికీ మరణశిక్ష ఖైదీగానే ఉన్నారని, ఆయన తరపున సిక్ గురుద్వారా కమిటీ పిటిషన్ దాఖలుచేసిందని అన్నారు. ఇప్పటికే చాలా ఆలశ్యం అయిందని, సత్వరమే ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సుప్రీం కోర్టులోనే రెండున్నరేళ్లక్రితం న్యాయ మూర్తులు చెప్పిన అంశాన్ని గుర్తుచేసారు.
తన పిటిషన్ ముందుకు సాగకపోవడంపై 2024లో మరో పిటిషన్ దాఖలుచేసారని చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ కేంద్రానికి ఒక చిట్టచివరి అవకాశం ఇచ్చి క్షమా బిక్ష పిటిషన్‌ను సత్వరమే పరిశీలించాలని ఆదే శించింది. ఇప్పటికీ కూడా కేంద్రం స్పందించలే దని, అందువల్ల కోర్టు మాత్రమే ఈ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వం తరపున హాజరయిన అదనపు సొలిసిటర్ జనరల్ కెఎం నటరాజ్ కేంద్రం తరపున పిటిషన్ దాఖలుచేసేందుకు కొంత వ్యవధి కావాలనికోరారు. ప్రస్తుత స్థితినివేదికను తెలియ జేస్తామని కోరగా రోహత్గి మాట్లాడుతూ ఇప్పటికే ఎనిమిదినెలలు గడిచిందని ఏంజరుగుతుందో కూడా ఎవరికి తెలియడంలేదని అన్నారు.
గతంలో భుల్లార్‌పై నమోదయినకేసులో విధించిన మరణ శిక్షను సుప్రీంకోర్టు జీవిత ఖైదుగా మారిందని, ప్రస్తుత పిటిషనర్‌గడచిన 30ఏళ్లుగా జైలు లోనే ఉన్నారని వాదించారు. ఈ పిటిషన్ విచారణ లోనే జస్టిస్ మెహతా మాట్లాడుతూ ఆయన మరణశిక్షను ఇప్పటివరకూ ఎందుకు అమలుచేయ లేదని, ఎవరిని ఇందుకు బాధ్యులను చేయాలని ప్రశ్నించారు.కనీసం సుప్రీం కోర్టుకూడా బల్వంత్ సింగ్ మరణశిక్షను వాయిదా వేయలేదని గుర్తు చేసారు. పిటిషన్‌పై తదుపరి విచారణ వచ్చేనెల 15నజరుగుతుందని ఆలోపు కేంద్రం వివరణ ఇవ్వాలని న్యాయ మూర్తులు ఆదేశించారు.



# భారత్ మావైపే నిలుస్తోంది!

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**క్యీవ్,సెప్టెంబరు 24:** ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న దాడికి భారత్ నిధులు సమకూరుస్తోందంటూ అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. ఇలాంటి తరుణంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తమవైపే ఉందని తాజాగా మీడియా ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునే అంశంలో మోడీ ప్రభుత్వం మనసు మార్చుకుంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. రష్యాతో భారత్ చేసుకున్న ఒప్పందం మాకు సమస్యగా మారింది. కానీ, దీనిని ట్రంప్ పరిష్కరించగలరని అనుకుంటున్నా. భారత్ తరహాలో చైనా మాకు మద్దతిస్తుందని నేను అనుకోను. ఎందుకంటే ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధాన్ని ఆపెయ్యడం వల్ల తమకు కలిగే ప్రయోజనం ఏదీ లేదని చైనా అనుకుంటోంది. అయినప్పటికీ ట్రంప్ తలచుకుంటే జిన్‌పింగ్ వైఖరిని కూడా మార్చగలరని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ ఆదాయం సమకూరుస్తున్న దేశాలపై సుంకాలు విధించడం సరైన నిర్ణయమేనని గతంలో జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. తాజాగా భారత్ విషయంలో ఆయన తన వైఖరిని మార్చుకున్నట్టు అర్థమవుతోంది. అయితే తాజాగా న్యూయార్క్‌లో జరిగిన ఐక్య రాజ్యసమితి ప్రతినిధుల సమావేశంలో ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలు ఉక్రెయిన్ యుద్ధానికి మద్దతుగా నిలుస్తున్నాయన్నారు. అలాగే నాటో దేశాలుకూడా రష్యానుంచి చమురు కొనడాన్ని తగ్గించడం లేదని విమర్శించారు.

# లడఖ్‌లో వాంగ్‌ఛుక్ దీక్ష విరమణ

### శాంతియుత ఆందోళన ఒక్కటే మార్గమని యువతకు పిలుపు

**లేహ్, సెప్టెంబరు 24:** లడఖ్‌కు రాష్ట్రహోదా ఇవ్వాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో చేర్చాలని కేంద్రాన్ని డిమాండ్‌చేస్తూ గడచిన 15 రోజులుగా నిరవధిక దీక్ష చేపట్టిన పర్యావరణ హక్కుల పరిరక్షణ నేత సోనమ్‌వాంగ్‌చుక్ తన దీక్షను విరమిస్తున్నట్లు ప్రకటించారు. లడఖ్ రాజధానిలో ఉవ్వెత్తున ఎగిసిన హింసాకాండతో ఆయన తీవ్రమనస్తాపం చెంది దీక్షను విరమిస్తూ విడియో సందేశం విడుదలచేసారు. లడఖ్ యువత శాంతి సంయమనం పాటించాలని పిలుపు నిచ్చారు. వందలాదిమంది యువకులు వీధుల్లోకి వచ్చి రాళ్లురువ్వడం, వాహనాలు దగ్ధంచేయడంతోపాటు స్థానిక బిజెపి, ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పుపెట్టడంతో ఆయన ఆందోళన వ్యక్తంచేసారు. హింసతో మన సమస్యలు పరిష్కారం కావని యువత ప్రత్యేకించి నిరసనకారులు సంయమనం పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి ఆందోలనలు పరిస్థితిని మరింత దిగజారుస్తాయని, లడక్‌లో అయినా దేశంలో అయినా మనం అస్థిరతను కోరుకోవడంలేదని వాంగ్‌ఛుక్ తెలిపారు.

# లడఖ్ కోసం ఎగసిపడిన నిరసనలు



### బిజెపి కార్యాలయం దగ్ధం, పోలీస్ వాహనానికి నిప్పు

### రాళ్లురువ్విన ఆందోళనకారులు, జన్‌జెడ్ ఉద్యమం అంటున్న యువత

**లేహ్, సెప్టెంబరు 24:** కేంద్ర పాలితప్రాంతంగా ఉన్న లడఖ్‌కు రాష్ట్రహోదా ఇవ్వాలని, అంతేకాకుండా తమ ప్రాంతాన్ని రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో చేర్చాలని కోరుతూ నిర్వహిస్తున్న లడఖ్ వాసుల ఆందోళనలు తీవ్రతరం చేసారు. ఆందోళనకారులు లడఖ్ రాజధాని లేహ్‌ను స్తంభింపచేసారు. బుధవారం తమ నిరసనలతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బిజెపి కార్యాలయాన్ని తగులబెట్టారు. పోలీస్ వాన్‌ను కూడా దగ్ధంచేసారు. దీనితో పోలీసులు ఆందోళన కారులను కట్టడిచేసేందుకు టియర్‌గ్యాస్ ప్రయోగించారు.అయినా ఆందోళనకారులు ముందుకురావడంతో లాఠీఛార్జిచేసారు. ఆందోళన ఉధృతిని చూస్తుంటే నేపాల్ తరహా జెన్‌జడ్ ఉద్యమంగా మారుతున్నట్లు లడఖ్ యంత్రాంగం భావిస్తోంది. బిజెపి ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వం వెంటనే తమతో చర్చలు జరపాలని వారుడిమాండ్‌చేస్తున్నారు. కొందరు యువత పోలీసు సిబ్బందితో ఘర్షణ పడి వారిపైరాళ్లురువ్వారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు వాహనాల పైనా రాళ్ల రువ్వడంతో అదనపు సిబ్బందిని మొహరించారు. సెక్షన్ 163 నిషేధపుటుత్తర్వులను లడఖ్ ప్రాంతంలో జారీచేసారు. ఐదుగురికంటే ఎక్కువమంది గుమికూడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. లడఖ్ అపెక్స్ బాడీ(ల్యాబ్) యువజనవిభాగం ఈ నిరసనకు పిలుపునిచ్చింది. 35రోజుల నుంచి అంటే ఈనెల 10వ తేదీనుంచి 15 మంది నిరవధిక దీక్షలో ఉన్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమించడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆధ్వర్యంలో ఈనిరవధిక రిలే దీక్షలు, సమ్మె కొనసాగుతోంది. ఆందోళన కారులు శాంతియుతంగా ఉండాలని శాంతియుత నిరసన ప్రదర్శనలకే పరిమితం కావాలంటూ పిలుపు నిచ్చారు. యువత భావోద్వేగాలకు లోనుకావద్దని చెప్పిన వాంగ్‌చుక్ వారికి ఉద్యోగాలు నష్టపోతున్నామని, ప్రజాస్వామ్యయుతంగా వచ్చే హక్కులు కోల్పోతున్నామన్న భావన ఉందని వాంగ్‌చుక్ అన్నారు.
కేంద్రం వెంటనే చర్చలను ముందుకు జరిపి సంప్రదింపులు చేయాలని అక్టోబరు ఆరునుంచి ఈనెలాఖరుకు మార్చాలని కోరారు. కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ బుధవారం కార్గిల్‌జిల్లాలో బంద్‌కు పిలుపునిచ్చింది. రాష్ట్ర హోదా, ఆరోషెడ్యూలులో చేర్చాలన్న డిమాండ్లతో ఈ కూటమి బంద్ పిలుపు ఇచ్చింది. నిరవధిక దీక్షలుచేస్తున్న వాంగ్‌చుక్ ఇతరులకు కూడా మా మద్దతు ఉంటుందని కెడిఎ కోకన్వీనర్ అస్గర్ కర్బాలాయ్ అన్నారు. నాలుగు రోజులపాటు లడక్‌లో నిర్వహించే వార్షిక వేడుకలను నిరసనల కారణంగా రద్దుచేసారు. లడఖ్ పాలనాయంత్రంగా ఈ వేడుకలు రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది.

# ప్రముఖ కన్నడ రచయిత బైరప్ప కన్నుమూత

### గుండెపోటుతో మృతి, ప్రధాని మోడీ దిగ్భ్రాంతి, సంతాపం

**బెంగళూరు, సెప్టెంబరు 24:** ప్రముఖ కన్నడ నవలా రచయిత ఎస్‌ఎల్ బైరప్ప (94) కన్నుమూశారు. బుధవారంనాడు ఓప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. 'ప్రముఖ భారత నవలా రచయిత, తత్వవేత్త, పద్మశ్రీ, పద్మభూషణ, సరస్వతి సమ్మాన్ పురస్కార గ్రహీత ఎస్‌ఎల్ బైరప్ప మధ్యాహ్నం గుండెపోటుకు గురయ్యాడు. హుటాహుటిన ఆస్పత్రి తీసుకువచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, అప్పటికే ఆయన ప్రాణాలు విడిచారు' అని ఆస్పత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. బైరప్ప రాసిన వంశవృక్షం, దాతు, పర్వ, మందార తదితర నవలలతో పేరుగాంచారు. కన్నడ నుంచి ఇంగ్లీషు, ఇతర భాషలలోకి అనువదించారు. పద్మ భూషణ్, పద్మశ్రీ, సరస్వతి సమ్మాన్, సాహిత్య అకాడమీ తదితరఅవార్డులు అందుకున్నారు. 'నాయి-నీరలు', 'మాతదానా', 'వంశ వృక్షం', 'తబ్బలియు నీనాడే మగన', తదితర నవలలు సినిమాలుగా వచ్చాయి. 'గృహ భంగే', 'దాతు' నవలల ఆధారంగా టీవీ సీరి యల్స్ ప్రసారమయ్యాయి. పద్మవిభూషణ్ బైరప్ప మృతిపట్ల ప్రధానిమోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన తన ఆలోచనాత్మక రచ నలతో కన్నడ సాహిత్యాన్ని ఎంతోసుసంపన్నం చేశారు. ఆయన రచనలు తరతరాలుగా సమాజానికి ప్రేరణనిస్తాయని అభిప్రాయపడ్డారు. "మన చరిత్ర, సంస్కృతిపట్ల ఆయనకున్న అచంచలమైన మక్కువ భవిష్యత్‌లో మనస్సులను ప్రేరేపిస్తూనే ఉంటుంది. ఈ విషాద సమయంలో నా ఆలోచనలు ఆయన కుటుంబం, అభిమానులతో ఉన్నాయి'అని ప్రధాని పేర్కొన్నారు. ఆయన మృతికిసంతాపం చెబుతూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నేషనల్ మాల్‌లో ట్రంప్-ఎప్‌స్టీన్‌ల విగ్రహాలు



**వాషింగ్టన్‌డిసి, సెప్టెంబరు 24:** లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటూ జైలులోనే అనుమానాస్పది స్థితిలోమరణించిన జెఫ్రీఎప్‌స్టీన్‌తో ట్రంప్ హుషారుగా కరచాలనం చేసుకుంటున్నట్లు ఉన్న విగ్రహం ఇపుడు వాషింగ్టన్ వాసుల్లో ఆసక్తిని రేకెత్తించింది. నేషనల్ మాల్‌లో తూర్పువైపున అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జెఫ్రీ ఎప్‌స్టీన్‌లు హుషారుగా కరచాలనంచేసుకుంటున్న విగ్రహాన్ని రూపొందించి అక్కడ ఏర్పాటుచేసారు.పైగా ఈ శిలాఫలకంపై అధ్యక్షుడు ట్రంప్, ఆయన అనుంగుమిత్రుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌లమధ్య ఉన్న స్నేహ బంధాన్ని వేడుకచేసుకుంటున్నాం అని రాసి పెట్టారు. నేషనల్‌పార్క్ సర్వీస్ అధికారులు ఈ పెయింట్ వేసిన ఈ రజత విగ్రహాన్ని ఏర్పాటుచేసేందు అనుమతించారని తెలుస్తోంది. అయితే ఈ విగ్రహం ఎవరు తయారుచేసారు. రాజకీయంగా అప్రదిష్టపాలుచేసేందుకేనా అన్న ఊహాగానాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈవిగ్రహం ఏర్పాటులోఆంతర్యం బయటికి తెలియ లేదు. అలాగే విగ్రహంతయారుచేసిందెవరన్నది కూడా తెలియకపోయినా గతంలో ఇలాంటి విగ్రహాలే మరికొన్ని ట్రంప్‌పై రూపొందించారు. జనవరి 6వ తేదీ నిరసనలకు గౌరవంగా అని పేర్కొంటూ ట్రంప్ విగ్రహం కూడా రూపొందించారు. నియంత ఆమోదించారు అన్న నినాదంతో మరో విగ్రహాన్ని కూడా గతంలో రూపొందించినట్లు తెలుస్తోంది. అలాగేమరికొన్ని కొటేషన్లు ట్రంప్‌చెప్పినవి ఉదహరిస్తూ ఈ విగ్రహాలురూపొందించారు. వ్లాదిమిర్‌పుతిన్, జైర్ బోల్సనారో, కిమ్‌జాంగ్ ఉన్, విక్టర్ ఆర్బాన్ తదితరులతో ట్రంప్‌పరిచయాలను కూడా ఈసందర్భంగా ప్రస్తావించారు.

# సంక్షిప్తంగా..

## డాక్టర్ కోర్సు ఇష్టంలేదని అడ్మిషన్ రోజే ఆత్మహత్య

**ముంబయి, సెప్టెంబరు 24:** నీట్‌పరీక్షలో అత్యధిక మార్కులు సాధించినా తనకు డాక్టర్ చదవడం ఇష్టంలేదని ఒక విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా, సందేవాహి తాలూకాలోని నవర్గావ్ గ్రామానికి చెందిన అనురాగ్ అనిల్ బోర్కర్ (19 ఏళ్లు) నీట్ యూజీ 2025 పరీక్షలో 99.99 శాతం పర్సంటైల్ సాధించాడు. ఒబిసి కేటగిరీలో ఆల్ ఇండియా లెవల్‌లో 1475వ ర్యాంక్ సాధించాడు. అతని ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఉన్న వైద్య కళాశాలలో సీటు కూడా లభించింది. అయితే వైద్య కళాశాలలో అడ్మిషన్ కోసం బయలుదేరాల్సిన రోజునే అతను తన ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విద్యార్థి బలవన్మరణానికి పాల్పడడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. వారికి ఒక సూసైడ్‌నోట్ దొరికింది. అయితే అందులోని పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించలేదు. కానీ ఆ నోట్‌లో తనకు డాక్టర్ కావడం ఇష్టం లేదంటూ ఆ యువకుడు రాసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నవర్గావ్ పోలీసులు పేర్కొన్నారు.

## బీహార్‌లో ఎంఐఎం ఒంటరిగానే బరిలోకి




**పాట్నా, సెప్టెంబర్ 24:** బీహార్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ఒంటరిగానే పోటీ చేయనుంది. అధికార బిజెపి- జెడియూ ఎన్డీయే కూటమిని ఓడించడానికి మహాఘట్ బంధన్ చేరాలని ప్రయత్నించినప్పటికీ ఆశించిన స్పందన రాలేదని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ వాపోయారు. ఆర్జేడీకి మూడుసార్లు లేఖలు రాసినా ప్రతిస్పందన లేదని, అందుకే ఒంటరిగానే బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఒవైసీ ఇప్పటికే సీమాంచల్ ప్రాంతంలో ఎంఐఎం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 2020 ఎన్నికల్లో 19 స్థానాల్లో పోటీ ఐదు సీట్లు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. సీమాంచల్ రీజియన్‌లోని పుర్నియా, కటిహార్, కిషన్‌గంజ్, అరారియా జిల్లాలో ముస్లింల జనాభా గణనీయంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో 15 స్థానాల్లో పోటీ చేయగా, ఏ ఒక్క స్థానంలోనూ విజయం సాధించలేకపోయింది. ఎంఐఎం అధినేత ఒవైసీ సెప్టెంబర్ 27 నుంచి సీమాంచల్ న్యాయ్ యాత్ర పేరుతో కిషన్ గంజ్ నుంచి ప్రచారం ప్రారంభించనున్నారు.

## 5 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 24న ఎన్నికలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి ఇసి షెడ్యూల్ విడుదల చేసింది. జమ్మూకాశ్మీర్‌కు సంబంధించి పెద్దల సభలో 2021 ఫిబ్రవరి నుంచి ఆ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అక్టోబర్ 24న ఎన్నికలు జరుగనున్నాయి. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున కొత్తగా ఎన్నికైన సభ్యుల పదవీకాలం అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పుపై ఆధారపడి ఉంటుందని ఇసి వివరించింది. ఇసి కథనం ప్రకారం, నాలుగు ఖాళీలు ఆయా వార్షిక కాలపరిమితిలో ఉండేవి, ఇద్దరు సభ్యులు ఫిబ్రవరి 15, 2021న పదవీ విరమణ చేయగా, మరో ఇద్దరు ఫిబ్రవరి 10, 2021కి ముందే పదవీ విరమణ చేశారు. ఏకే వాలియా వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (1994) కేసులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈసీ ప్రస్తావించింది. వీటితోపాటు పంజాబ్‌లో ఒకస్థానానికి ఎన్నికలకమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది.

## మిగ్-21కు ఇక వీడ్కోలు!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** భారత వాయుసేనకు కొన్ని దశాబ్దాలుగా వెన్నెముక వలె ఉండి ఎన్నో యుద్ధాల్లో విజయాన్ని అందించిన మిగ్ - 21కు వాయుసేన చీఫ్ ఎపి సింగ్ వీడ్కోలు పలకనున్నారు. చండీగఢ్‌లో యువసేన కేంద్రం వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. ఐఎఫ్ చీఫ్ స్వయంగా మిగ్ -21 బైసన్‌పై చివరి సార్టికివెళ్లనున్నారు. ఈ రకం విమానం భారత్‌లో తొలిసారి అడుగుపెట్టింది కూడా ఈ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లోనే కావడం విశేషం. నాడు ఫస్ట్‌సూపర్ సోనిక్స్‌గా వ్యవహరించే 28వ స్క్వాడ్రన్‌కు వీటిని మొదటిసారి అప్పగించారు. వింగ్ కమాండర్ దిల్బాగ్ సింగ్ దీనికి నాయకత్వం వహించారు. ఆ తర్వాత ఆయన ఎయిర్ చీఫ్ మార్షల్ స్థాయికి ఎదిగారు. ఇక మిగ్ -21లు కూడా దాదాపు 60 ఏళ్లకు పైగా వాయుసేనకు సేవలు అందించాయి.



## కుటుంబంలో నలుగురిని హత్యచేసిన టీనేజర్‌కు

# 100 యేళ్ల జైలు

### 40 లక్షల పాక్ రూపీ జరిమానా

### లాహోర్ సెషన్స్‌కోర్టు సంచలన తీర్పు

**లాహోర్,సెప్టెంబరు 24:** కుటుంబంలో తల్లి, సోదరి, ఇద్దరు సోదరులను హత్యచేసినందుకుగాను పాకిస్తాన్‌కు చెందిన ఒక టీనేజర్‌కు కోర్టు 100యేళ్లపాటు కారాగారశిక్ష విధించింది. ఆన్‌లైన్‌గేమింగ్ పబ్‌జి ఆడేందుకు అడ్డుకున్నందుకుగాను ఘర్షణపెరిగి కోపోద్రిక్తుడైన టీనేజర్ ఇంట్లో అందరినీ చంపినట్లు కోర్టు అభిప్రాయపడింది. 2022లో ఈ సంఘటన చోటుచేసుకుంది. లాహోర్ అదనపు జడ్జి రియాజ్ అహ్మద్ నిందితుడికి 100ఏళ్ల కఠిన కారాగారశిక్ష విధించారు. నిందితుడు 17 ఏళ్ల జైన్ ఆలీ ఘోరమైన అకృత్యానికి పాల్పడినట్లు జడ్జి అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా 40 లక్షల పాకిస్తాన్ రూపాయల జరిమానాకూడా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ ఆధారాలతో సహా నిరూపితంచేసిందని, సాక్ష్యాలు నిందితుడు ఈ ఘోరానికి పాల్పడినట్లు రుజువుచేస్తున్నాయని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఆతని వయసు దృష్ట్యా నిందితుడికి నాలుగు జైలు శిక్షలుఅంటే ఒక్కొకక్కటి 25 ఏళ్లపాటు జైలు జీవితం అనుభవించాలని తీర్పుచెప్పారు. లాహోర్‌లోని అత్యంత జనసాంద్రత కలిగిన కహ్నా ప్రాంతంలో జైన్‌ఆలీ 14 ఏళ్ల యువకుడు అంతేకాకుండా పబ్జీ గేమ్ ఆడాలని తహతహ ఎక్కువఉండేది. తరచూ ఆతడి తల్లి నహీద్ ముబారక్ మందలించేది. గేమ్‌లో ఇచ్చిన టార్గెట్లు సాధించలేకపోవడంతో ఒక్కసారిగా జైన్ ఆలీలో అసహనం పెరిగిపోయింది. వెంటనే అక్కడే ఉన్న టీనేజర్ తన తల్లి భద్రపరుచుకున్న పిస్టల్ తీసుకునని ఆమెగదిలోకి వెళ్లి ఆమె నిద్రిస్తున్న సమయంలో కాల్చి చంపేసాడు.

# విద్యార్థినులపై స్వామీజీ లైంగిక వేధింపులు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** ఢిల్లీలోని విలాసవంతమైన వసంత్ కుంజ్ ప్రాంతంలో ఉన్న ఓ ఆశ్రమం లోని స్వామీజీపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. దాదాపు డజన్ మంది కన్నా ఎక్కువ మంది మహిళలు ఆ స్వామీజీపై ఫిర్యాదుచేసినట్లు పోలీసులు చెప్పారు. శ్రీ శారద ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న స్వామి చైతన్యానంద సరస్వతి అలియాస్ పార్థసారధి అనే స్వామీజీపై కేసు నమోదు చేశారు. బలహీన వర్గాల కేటగిరీలో పిజి మేనేజ్మెంట్ డిప్లొమా కోర్సులు చదువుతున్న విద్యార్థినులు ఆ ఫిర్యాదు చేశారు. ఆ ఆశ్రమంలోని 32 మంది విద్యార్థినులను పోలీసులు విచారించారు. దీంట్లో సుమారు 17 మంది అమ్మాయిలు స్వామీ చైతన్యానందపై ఆరోపణలు చేశారు. ద్వేషపూరిత భాషను వాడుతున్నారని, శృంగారభరిత టెక్స్ట్ మెసేజ్‌లు చేస్తున్నారని, భౌతికంగా తాకేందుకు ప్రయత్నిస్తున్నారని మహిళలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. డైరెక్టర్‌కు లొంగిపోవాలని ఆ ఆశ్రమంలోని మహిళా సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది కూడా వత్తిడి చేస్తున్నట్లు విద్యార్థినులు ఆరోపించారు. ఆశ్రమంలో పనిచేస్తున్న వార్డెన్లు.. నిందితుడికి తమను పరిచయం చేసినట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. స్టూడెంట్స్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా స్వామీ చైతన్యానందపై లైంగిక వేధింపుల కేసు బుక్ చేసినట్లు డిసిపి అమిత్ గోయల్ తెలిపారు. పోలీసులు సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలించారు. నిందితుడి అడ్రస్‌లో తనిఖీలు చేశారు.ఆ స్వామీజీ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఆగ్రా వద్ద ఆయన ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడ గాలింపు చేపట్టారు. దర్యాప్తు సమయంలో ఇన్స్‌టిట్యూట్ బేస్మెంట్‌లో ఉన్న వోల్వో కారును పోలీసులు స్వాధీనం చేస్తుకున్నారు. ఆ వాహనాన్ని స్వామీ చైతన్యానంద వాడినట్లు గుర్తించారు. అయితే ఆ కారుకు నకిలీ డిప్లమాటిక్ నెంబర్ ప్లేట్ (39యూఎన్ 1) ఉండటంతో ఆ కారును సీజ్ చేశారు. నిందారోపణలు రావడంతో ఆశ్రమ అడ్మినిస్ట్రేషన్ ఆ స్వామీజీని తొలగించింది. శృంగేరిలోని దక్షిణామ్నాయ శ్రీశారదా పీఠం ఢిల్లీలో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నది. ప్రస్తుత ఘటన నేప థ్యంలో ఆ పీఠం ఓ ప్రకటన జారీచేసింది. స్వామీ చైతన్యానంద ప్రవర్తన, కార్యకలాపాలు అక్రమంగా, అసహజంగా, పీఠానికి వ్యతిరేకంగా ఉన్నట్లు పేర్కొన్నది. నిందిత స్వామీజీతో అన్ని సంబంధాలను తెంచుకున్నట్లు ఆ పీఠం పేర్కొన్నది.

# రష్యా విమానాలను కూల్చేయండి



### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** ప్రపంచంలోని రెండు భారీ శక్తుల మధ్య వివాదం ముదురుతోంది. నాటో కూటమి దేశాల గగనతల సరిహద్దులను ఉల్లంఘించి రష్యా ఫైటర్ జెట్లు దూసుకురావడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే రష్యా విమానాలను కూల్చేస్తామన్నారు. ఆయన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. ఆ తర్వాత మాట్లాడుతూ అలాంటి పరిస్థితుల్లో నాటో సభ్యదేశాలు రష్యా విమానాలను కూల్చేయాలా? అని ప్రశ్నించారు. అందుకు ట్రంప్ అవును కూల్చేస్తాం అని బదులిచ్చారు. ఇటీవల కాలంలో నాటో దేశాలైన పోలాండ్, ఎస్తోనియా సహా పలు నాటో సరిహద్దుల్లోకి రష్యా ఫైటర్ జెట్లు చొరబడిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ట్రంప్ రష్యా, ఉక్రెయిన్‌పై ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. ఉక్రెయిన్2014 నుంచి కోల్పోయిన తన భూభాగం మొత్తం తిరిగి పొందగలదని తాను అభిప్రాయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ యుద్ధం రష్యాకు ఓ పేపర్ టైగర్‌గా మార్చేసింది. ఈ యుద్ధం వల్ల దానికి భారీగా డబ్బు ఖర్చవుతోంది. పెట్రోలియం విక్రయాలతో నిధుల సంపాదన కష్టంగా మారిందన్నారు. సమయం, ఓపిక, ఐరోపా సమాఖ్య, ముఖ్యంగా నాటో మద్దతుతో ఉక్రెయిన్ తన భూభాగం తిరిగి పొందడం ఎందుకు సాధ్యం కాదు. అంతకుమించి చేతలకు సమయం ఆసన్నమైంది అని ఈ పోస్టులో హెచ్చరించారు. ట్రంప్ పోస్టు భారీ మార్పుకు చిహ్నమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. అమెరికా నాయకుడు ఓ గేమ్ ఛేంజర్‌అని అభివర్ణించాడు. ట్రంప్‌తో భేటీ సమయంలో యుద్ధక్షేత్రంలో ఏం జరుగుతోందో తాను వివరించినట్లు చెప్పారు. ఆయనకు మరిన్ని విషయాలు కూడా తెలుసని చెప్పారు. ట్రంప్ పోస్టు చేసిన కొద్దిసేపటికి అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో మాత్రం దీనికి భిన్నంగా స్పందించారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని సైనిక చర్యలతో ముగించలేమన్నారు. కేవలం చర్చల ద్వారానే ఇది సాధ్యమని తెలిపారు. ఈ విషయాన్ని ఆయన ఐక్యకరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో పేర్కొన్నారు. ఈ ప్రమాదకర సంక్షోభానికి శాంతియుత పరిష్కారం తీసుకొచ్చేందుకు అమెరికా అన్నా ప్రయత్నాలు చేస్తోందన్నారు.

# జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ సుభాష్ సస్పెన్షన్!



**విజయవాడ,సెప్టెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** వస్తు, సేవల పన్ను (జిఎస్టి) అసిస్టెంట్ కమిషనర్ సుభాష్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'రాజధాని అమరావతి..మునిగిపోయిందే' అని పేర్కొంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఆయన కొన్ని ఫోటోలు పోస్ట్ చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.. సోషల్ మీడియాలో సుభాష్ పోస్టులు సంబంధించి ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు రావడంతో ఆయనను వివరణ కోరగా..ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని సుభాష్ బదులు ఇచ్చారు. ఆయన వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొంటూ సస్పెండ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# దేశంలోనే తొలి ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్



## - వైకుంఠం 1 కాంప్లెక్స్‌లో ఏర్పాటు

**తిరుమల,సెప్టెంబర్ 24 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతిరోజు లక్షలమందివరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. వేలాదిమంది భక్తుల సమస్యలకు చెక్‌పెట్టేందుకు కృత్రిమమేథస్సు(ఏఐ)ను వినియోగించుకోవాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు కార్యాచరణలోకి తీసుకువచ్చారు. ఎన్ఆర్ఐల దాతృత్వంతో దేశంలోనే తొలిసారిగా తిరుమలలో ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసిసిసి)ను టిటిడి అందుబాటులోకి తీసుకువస్తోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లోని 25వ నంబర్ కంపార్టుమెంట్‌లో ఈవ్యవస్థను ఏర్పాటుచేశారు.దీనిద్వారా భక్తుల రద్దీ నియంత్రణ, వ సతి, భద్రత పెంపొందించడం వంటి చర్యలు చేపట్టనుంది. ఈ కేంద్రాన్ని నేడు(గురువారం)ఉదయం సిఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ అందుబాటులోకి వస్తే పెద్ద డిజిటల్ స్క్రీన్, అన్ని విభాగాలకు చెందిన సిసిపుటేజీలు కనిపిస్తాయి. వీటిని 25మందికిపైగా సాంకేతిక సిబ్బంది పర్యవేక్షిస్తూ అధికారులకు వాస్తవ పరిస్థితులను తెలియజేస్తారు. ప్రస్తుతం ఉన్నవాటితోపాటు కొత్తగా అమర్చిన సిసికెమెరాలతో అలిపిరి వద్ద నుండే భక్తుల రద్దీని ఏఐ అంచనా వేస్తుంది. క్యూలైన్లలో ఎంతమంది భక్తులు ఉన్నారు,ఎంత సమయం వారు నిరీక్షిస్తున్నారు, సర్వదర్శనం పరిస్థితి తదితర అంశాలను ఏఐ ట్రాక్‌చేస్తుంది. ముఖగుర్తింపు పరికరంద్వారా భక్తులను గుర్తిస్తుంది. దొంగలు,ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా కనిపెడుతుంది. తప్పిపోయిన వాళ్ళు ఎక్కడ ఉన్నా గుర్తించి సమాచారం అందిస్తుంది. భక్తుల ముఖకదలికలు(హావభావాలు)ఆధారంగా వారి ఇబ్బందులు తెలుసుకుంటుంది. క్యూలైన్స్, వసతి ఇతర సౌకర్యాలను వాస్తవ పరిస్థితులలతో 3డి మ్యాపు, చిత్రాలతో చూపుతుంది. కొండపై రద్దీ ఉన్న ప్రాంతాల్ని రెడ్‌స్పాట్‌లుగా చూపడంతోపాటు చర్యలకు సంకేతాలిస్తుంది. ఆన్‌లైన్‌లో నిరంతరం పర్యవేక్షిస్తూ సైబర్‌దాడులు, టిటిడి ప్రతిష్టను దెబ్బతీసే సామాజిక మాధ్యమాల్లో పెట్టే అనుచిత పోస్టులు, ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారాలను అడ్డుకుంటుంది. ఎప్పటికప్పుడు భక్తుల అనుభవాలను తెలుసుకుని శ్రీవారి దర్శనాన్ని మరింత సౌకర్యవంతం చేసేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది. అలాగే వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, క్యూలైన్లలో అత్యవసర పరిస్థితుల్లో భక్తులను బయటకు తీసుకువచ్చే సమీప మార్గాలను చూపుతుంది. ఈ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను బుధవారం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డుసభ్యులు శాంతారాం,నరేశ్, సివిఎస్‌ఓ కెవి మురళీకృష్ణ, విఎస్‌ఓ వింగ్ ఎస్వీవిరామ్‌కుమార్ పరిశీలించారు.

# అదనంగా మరో ఐదువేలమందికి వసతి

**తిరుమల,సెప్టెంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వస్తున్న భక్తులకు అదనంగా మరో ఐదువేలమందికి వసతి కల్పించేందుకు పిఏసి 5(యాత్రికుల వసతి సముదాయం) వేంకటాద్రి నిలయం సిద్దమైంది. సముదాయం భవనంలో విశాలమైన హాళ్ళు, చంటి పిల్లలకు పాలు తాగించే ప్రత్యేక గదులు, అన్నప్రసాద వితరణ కేంద్రం ఉన్నాయి. 102కోట్ల రూపాయల వ్యయంతో ఐదు అంతస్తుల ఉచిత సముదాయాన్ని నిర్మించారు. విశాలమైన హాళ్ళు, డార్మిటరీలు, లాకర్లు ఉన్నాయి. 216 మరుగుదొడ్లు, 216 స్నానపు గదులు, రెండు కళ్యాణకట్టలు, జలప్రసాదాలు, ప్రథమచికిత్స కేంద్రాలు, అన్నప్రసాద భవనం సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించారు. నేడు సిఎం చంద్రబాబు ప్రారంభానికి ముందు బుధవారం మధ్యాహ్నం టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుపతి ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఓ మురళీకృష్ణ ,డిప్యూటీ ఈఓ రాజేంద్రతో కలసి గదులు, లాకర్లను, కల్యాణకట్టలను పరిశీలించారు.

# తిరుమల సమాచారం

## పెద్దశేషుని ఆశీస్సులందుకున్న సిఎం చంద్రబాబు దంపతులు

**తిరుమల,సెప్టెంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** సాక్షాత్తు దేవలోకంలో వైకుంఠంలో ఆదిశేషుని శేషతల్పంపై కొలువుదీరిన వైనాన్ని గుర్తుచేస్తూ కలియుగవైకుంఠం తిరుమలలో సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అలంకారంలో శ్రీమన్నారాయణుడు ఏడుతలల పెద్దశేషునిపై భక్తులను కటాక్షించాడు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు బుధవారం రాత్రి స్వామివారు ఏడుతలల స్వర్ణ శేషవాహనంపై తిరుమాడ వీధులలో విహరించారు. వాహనసేవలో సిఎం చంద్రబాబునాయుడు దంపతులు పాల్గొని స్వామివారి ఆశీస్సులందుకున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ ,అదనపు ఈఓ వెంకయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## పట్టువస్త్రాల సమర్పణకు సిఎం చంద్రబాబుకు సాదర స్వాగతం



**తిరుమల,సెప్టెంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** కలదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు బుధవారం సాయంత్రం సిఎం చంద్రబాబునాయుడు దంపతులు తిరుమలకు వచ్చారు. ఇక్కడ గాయత్రి అతిథిగృహం వద్ద రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, వసతి కల్పన అధికారులు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం ఆయన బేడి ఆంజనేయస్వామి గుడి వద్దకు చేరుకున్నారు.

# తిరుమల క్షేత్రంలో తొలిపూజ ఆది వరాహునికే



విద్యుద్దీపకాంతులతో తేజోమయమైన కలియుగవైకుంఠం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమలదివ్యక్షేత్రంలో భక్తులు తొలి దర్శనం, తొలిపూజ,తొలి నైవేద్యం ఆదివరాహస్వామికే సమర్పిస్తారని నియమంతో శ్రీవేంకటేశ్వరస్వామి ఒప్పందం దానపత్రం రాసిచ్చాడు. వరాహస్వామిని తొలుత దర్శిస్తేనే శ్రీవేంకటేశ్వరుడు సంతోషిస్తాడు. క్షేత్ర సాంప్రదాయం ప్రకారం శ్రీవరాహస్వామిని దర్శించుకున్న తరువాతనే శ్రీనివాసుని దర్శించుకోవడం సంప్రదాయం. శ్రీమహావిష్ణువు వైకుంఠం వదలి కలియుగంలో వేంకటాచలంపై శ్రీవేంకటేశ్వరునిగా ఆవిర్భవించిన సమయంలో శేషాచలంకొండల్లోని సప్తగిరులపై తన నివాసముంటే అన్నింటా శుభకరమని భావించాడు. తిరుమల గిరులు ఏడుకొండలకు ప్రతీతి. ఈ కొండలకు గరుడపురాణంలో ఒక్కోకొండకు ఒక్కో ప్రత్యేకత ఉంది. అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు చేరుకునే భక్తులు ఎంతో పవిత్రంగా, భక్తిభావంతో కొండలెక్కి వస్తారు. వృషాద్రి, వృషభాద్రి, గరుడాద్రి, అంజనాద్రి, శేషాద్రి, వేంకటాద్రి, నారయణాద్రి.ఏడు చక్రాలు దాటితే ఆనందానుభూతి కలుగుతుంది. శక్తిస్థానాలుగా ఉన్న ఏడుకొండలు ఎక్కడం కూడా ఒకరహస్యం . శ్రీమహావిష్ణువు కొలువుండే వైకుంఠానికి ఏ విధంగా జయవిజయులు కాపలాగా ఉంటారో ,అలాగే కలియుగవైకుంఠం తిరుమలలో ఆనందనిలయంలో బంగారువాకిలికి దక్షిణాన జయుడు, ఉత్తరాన విజయుడు శంఖుచక్ర గధాదారులై సాక్షాత్తు విష్ణుమూర్తి ప్రతిరూపంలా దర్శనమిస్తుంటారు. వీరిని'చండప్రచండులు"అని కూడా వ్యవహరిస్తారు. పది అడుగుల ఎత్తుతో గంభీరంగా ఉండే ఈ పంచలోహ విగ్రహాలు తర్జనితో భక్తులను ఎల్లవేళలా హెచ్చరిస్తుంటాయి. స్వామివారి పుష్కరిణిలో పవిత్ర స్నాన మాచరించి, శుచిగా ఆలయంలోనికి ప్రవేశించి ఆలయ నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో మెలగుతూ తోటి భక్తులకు ఇబ్బంది కలగకుండా స్వామివారి దర్శనం చేసుకోవాలి.

## శ్రీవారికి బంగారు యజ్ఞోపవీతం విరాళం



**తిరుమల, సెప్టెంబర్ 24 ప్రభాత వార్త ప్రతినిధి:** తిరుమలేశునికి 3.86 కోట్లు విలువైన స్వర్ణ యజ్ఞోపవీతంను బుధవారం సాయంత్రం దాత అందజేశారు. విశాఖపట్నంకు చెందిన హిందుస్థాన్ ఎంట ర్ప్రైజ్ ఎండి పువ్వాడ మస్తాన్ రావు, కుంకుమ రేఖ దంపతులు 3.860 కిలోల బరువు గల వజ్రాలు పొదిగిన స్వర్ణ యజ్ఞోపవీతాన్ని...రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కు అందజేశారు. దాతలను అభినందించి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేసిన చైర్మన్ బిఆర్‌నాయుడు.

## వైభవంగా ధ్వజారోహణం - గరుడధ్వజపటం ఊరేగింపు



**తిరుమల,సెప్టెంబర్24ప్రభాతవార్తప్రతినిధి:** సప్తగిరులపై వేంచేసిన కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సకలదేవతలను ఆహ్వానిస్తూ బుధవారం సాయంత్రం మాఢవీధుల్లో గరుడుడు ఊరేగాడు.శ్రీవారి వాహనమైన గరుడుని చిత్రాన్ని కొత్తవస్త్రంమీద చిత్రీకరించి దీన్ని"గరుఢధ్వజపటం"అంటారు. దీన్ని ధ్వజస్తంభం మీద కట్టేందుకు నూలుతో చేసిన కొడితాడును సిద్ధం చేశారు. ఉత్సవమూర్తులైన శ్రీమలయప్పస్వామి, శ్రీదేవిభూదేవుల సమక్షంలో గోధూళి లగ్నమైన మీనలగ్నంలో కొడితాడుకు కట్టి నూతనకేతనాన్ని వేదపండితులు వేదమంత్రాలతో, మంగళవాద్యాలతో సాయంత్రం 5.43గంటల నుండి 6.15గంటల మధ్య బంగారు ధ్వజస్తంభంపై ఎగురవేశారు. దీంతో దేవదేవుని బ్రహ్మోత్సవాలకు శ్రీకారంపడింది. ఈ ధ్వజారోహణం సందర్భంగా ముద్గలాన్నం(పెసరపులగం)నివేదించారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతానాన్ని కోరేవారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం.ముందుగా బంగారు తిరుచ్చిపై శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్పస్వామివారిని ఆలయంనుండి వెలుపలకు తీసుకువచ్చి మాఢవీధుల్లో మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, సివిఎస్‌ఓ మురళీకృష్ణ, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, ఎంఎస్‌రాజు, శాంతారామ్, జంగా కృష్ణమూర్తి, జానకీదేవి,సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి,ఆలయ అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు.

# ఉద్యోగస్తుల అవసరాలు తీర్చడం ప్రభుత్వ బాధ్యత

## - జెఎసి అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

**తిరుచానూరు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తుల సమస్యలను నెరవేర్చడం ప్రభుత్వ కనీస బాధ్యత అని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఏపీ జెఎసి అమరావతి బుధవారం తిరుపతి కేంద్రంగా తిరుచానూరు రోడ్డులోని ప్రైవేట్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ శాఖలకు సంబంధించి దాదాపు 63 అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెఎసి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వానికి పలు డిమాండ్లు తెలియజేశారు. ఇందులో ప్రధానంగా ఐఆర్ వెంటనే ప్రకటించాలి అని అన్నారు. అనంతరం 12 పిఆర్సిని వెంటనే ప్రకటించాలని కోరారు. డిఏ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుండి రావలసిన అన్ని రకాల సహాయ కార్యక్రమాలు వెంటనే నెరవేర్చాలని కనీసం దసరా కన్నా ప్రభుత్వ శుభవార్త చెప్తారని ఆశిస్తున్నామన్నారు. లేని యెడల జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సూచించారు. అనంతరం రెవిన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ ప్రజలకు అత్యంత సేవ చేయకలిగిన గలిగిన శాఖ రెవెన్యూ శాఖ అని అటువంటి రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత వలన పూర్తిస్థాయిలో ప్రజలకు కావలసిన కార్యక్రమాలు చేయలేకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా నూతనంగా విధులలో చేరే ఉద్యోగస్తులలో నైపుణ్యం, మెలకువలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధ్యక్షులు శివప్రసాద, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఇతర జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి నిమ్మల కుమార్తె శ్రీజ, పవన్‌ల వివాహ వేడుక

## వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి దంపతులు, తనయుడు లోకేష్



**పాలకొల్లు ప్రభాతవార్త** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ వరుడు పవన్ వివాహ వేడుక బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులు, వారి కుమారుడు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ స్వయంగా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి వధూవరులకు నూతన ఆశీర్వదించారు.

# సిఎం చంద్రబాబుతో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ భేటీ

**విజయవాడ,సెప్టెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ఫూర్తి, సృష్టి సభల తీర్మానాలకు సంబందించిన అంశాలను ప్రభుత్వం వైపు నుండి పరిష్కారాలను ముఖ్యమంత్రి దృష్టి కి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, స్టేట్ ఆర్గనైజేషనల్ సెక్రటరీ మధుకర్ తీసుకుని వెళ్లారు. అదేవిధంగా అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించే ఖాదీ సంతకు మాధవ్ ఆహ్వానం పలకగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ నేపద్యంలో నే సంచార జాతుల సమస్యలు, విశ్వకర్మల సమస్యలు ఎన్ డి ఎ ప్రభుత్వంగా పరిష్కరించాల్సి న అంశాలపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించారు.

ఈ నేపధ్యంలో విశ్వకర్మ విగ్రహాన్ని రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ధ్రుష్టికి ప్రత్యేకంగా తీసుకుని వచ్చారు. సీఎం చంద్రబాబు ని ఉండవల్లి నివాసంలో కలిసిన బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, స్టేట్ ఆర్గనైజేషనల్ సెక్రటరీ మధుకర్ జీ ఎన్డిఎ భాగస్వామ్యంలో పరిష్కరించాల్సి న అంశాల పైకూడా చర్చించారు. భారతీయ జనతాపార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఖాదీ సంత కార్యక్రమం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు కు వివరించారు .ఖాదీఉత్పత్తులు ప్రదర్శన, కొనుగోలు కు భారీ ప్రచారం కల్పిస్తూ ప్రత్యేకంగా గాంధీ జయంతి సందర్భంగా ఖాదీ సంత లు ఏర్పాటు చేస్తున్న వివరాలు ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ ముఖ్య మంత్రి కి వివరించారు.

విజయవాడ లో జరిగే ఖాదీ సంతకు ముఖ్య అతిథి గా హాజరు కావాలని మాధవ్ ముఖ్య మంత్రి కి ఆహ్వాన పత్రిక ను అందజేశారు భారత ప్రధాని శ్రీ నరేంద్రమోడీ గారు మొదటగా అమరావతి రాజధాని కోసం భూమి పూజ చేసిన స్థలంను 10 ఎకరాలుగా విస్తరించి 100 అడుగుల విశ్వకర్మ విగ్రహం ఏర్పాటుతో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలి నిరంతర స్వదేశీ వస్తు ప్రదర్శన ఏర్పాటు చేయాలి భూమి పూజ, పవిత్ర మట్టి, నీరు ఉద్దేశ్యాన్ని ప్రజలకు తెలిసే విధంగా తీర్చిదిద్దాలని కొరారు.మున్సిపాలిటీ, కార్పొరేషన్ వారు నిర్మించే వాణిజ్య సముదాయాల్లో కార్పెంటర్స్ స్వర్ణకారుల కోసం వారి అమ్మకాల కోసం ప్రత్యేక షాపింగ్ కాంప్లెక్స్ లు ఏర్పాటు చేయాలి. వృద్ధాప్య పెన్షన్లు 50 ఏండ్ల నిండిన వారికి విశ్వబ్రాహ్మణ వృత్తుల వారికి అందించాలి.ఐదు వృత్తుల వారి కోసం ప్రత్యేక పారిశ్రామిక విధానం వారికి ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలని కోరారు.విశ్వకర్మ జయంతిని శ్రామికుల దినోత్సవం గా జరుపుకోవాలిఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# సభకు రాకుండా సంతకాలు చేసి సర్దుకోవడమా?

## ప్రశ్నించిన ఎథిక్స్ కమిటీ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్

**విజయవాడ,సెప్టెంబరు24,ప్రభాతవార్తప్రతినిధి:**ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు శాసనసభకు హాజరుకాకుండా కేవలం సంతకాలు చేసి సర్దుకోవడం ఏం సభ్యత,సంస్కారం అని నైతిక విలువల(ఎథిక్స్) కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ వ్యాఖ్యానించారు.

అసెంబ్లీ కమిటీ హాలులో సమావేశమైన మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన శాసనసభ నైతిక విలువల కమిటీ సభ్యులు వివిధ అంశాలను కీలకంగా చర్చించారు. జీతభత్యాలతో పాటు ప్రొటోకాల్ మర్యాదలు పొందుతూ అసెంబ్లీకి రాకపోవడాన్ని ఎలా చూడాలని ప్రశ్నించింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ బాధ్యతను విస్మరించడంపై చర్చ జరగాలని నిర్ణయించింది. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు సభకు వచ్చి చట్టాల నిర్మాణంలో భాగస్వాములు కావాల్సిందేనని శాసనసభ నైతిక విలువల కమిటీ స్పష్టం చేసింది. ఎన్నికైన ప్రజాప్రతినిధుల నైతిక ప్రవర్తన ప్రాధాన్యతను పెంచడంలో ఎథిక్స్ కమిటీ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని కమిటీ ఛైర్మన్ మండలి బుద్ధప్రసాద్ వెల్లడించారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు శాసనసభకు రాకపోవడం నైతికత ఎలా అవుతుందనే అంశాన్ని కమిటీ సభ్యులు లేవనెత్తారు.తమను ఎన్నుకున్న ప్రజలు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంత సమస్యలను శాసనసభా వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి పాటుపడాలని హితవు పలికారు. సభకు రాకుండా ఈ బాధ్యతను విస్మరించడం అనైతికమే అవుతుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. సభకు రాకపోవడం అనైతికమే, తమ బాధ్యతను గుర్తించి వ్యవహరించాలని కమిటీ తరపున విజ్ఞప్తి చేద్దామనే అభిప్రాయాన్ని కొందరు సభ్యులు వ్యక్తం చేశారు. ఎవరెవరు జీతభత్యాలు తీసుకుంటున్నారు, ఎవరెవరు సభకు రాకుండా బయట రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళుతున్నారనేదీ రికార్డులను పరిశీలించి అప్పుడు ఒక నిర్ణయానికి వస్తే బాగుంటుందని ఇతర సభ్యులు అభిప్రాయపడ్డారు. దీంతో వచ్చే సమావేశం నాటికి ఈ రికార్డులను కమిటీ ముందుంచాలని ఛైర్మన్ బుద్ధప్రసాద్ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు.

## వైకుంఠం నుండి వేంకటాద్రిపైకి విమాన వేంకటేశ్వరుడు

### - సాలకట్ల బ్రహ్మోత్సవాల్లోప్రత్యేక ఆకర్షణ



**తిరుమల,సెప్టెంబర్ 24 ప్రభాత వార్తప్రతినిధి:** సప్తగిరుల్లోని తిరుమలలో అంగరంగవైభవంగా మొదలైన శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు వైకుంఠం నుండి విమాన వేంకటేశ్వరుడ్ని గరుత్మంతుడు తీసుకువచ్చే సైకతశిల్పం ప్రత్యేక ఆకర్షణ. దేవదేవుని బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు వస్తున్న అశేషసంఖ్య భక్తుల కల్యాణవేదిక సమీపంలోని ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన పలు రకాల ఫల,పుష్ప,సైకత ప్రదర్శనల్లో గరుత్మంతుడు విమానవేంకటేశ్వరుడ్ని తీసుకువచ్చే ప్రదర్శన సైకతశిల్పం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. టిటిడి ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఈ సైకత శిల్పం భక్తిభావాన్ని పంచుతోంది. బెంగళూరుకు చెందిన కళాకారులు దీన్ని రూపొందించారు. గౌరి,నీలాంబరి ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు. బుధవారం ఉదయం ఈ మహాప్రదర్శనను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవితో కలసి ప్రారంభించారు.

# మామిడి రైతులకు రూ.480 కోట్లు బకాయిపడ్డ పల్ప్ ఫ్యాక్టరీలు

## - ఆలస్యమైతే మరో ఉద్యమం

**చిత్తూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** మామిడి రైతులు పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడి సరఫరా చేసి మూడు నెలలు కావస్తుంది. అయితే పల్ప్ ఫ్యాక్టరీల నుండి మామిడి రైతుకు ఇప్పటి వరకు చిల్లిగవ్వ రాలేదు. మామిడి సీజన్‌లో ఫ్యాక్టరీలకు మామిడి సరఫరా చేసిన రైతులు ఫ్యాక్టరీలు చెల్లించే డబ్బులపై ఆశగా ఎదురు చూస్తున్నప్పటికీ జిల్లాలోని పల్ప్ ఫ్యాక్టరీలు మాత్రం మామిడి రైతును కనికరించడం లేదు. ఈ మేరకు జిల్లాలో మామిడి రైతులు ఫ్యాక్టరీల నుండి తమకు రావాల్సి న బకాయిలు వసూలు చేయడానికి మరోసారి ఉద్యమం చేయడానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలో మామిడి సీజన్‌లో మే, జూన్, జులై నెలల్లో 35 వేల మంది మామిడి రైతులు 4 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని పల్ప్ ఫ్యాక్టరీలకు తరలించారు. జిల్లా అధికార యంత్రాంగం ఈ సీజన్‌లో మామిడికి గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకుంది. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లాలోని ఎమ్మెల్యేలు ప్రభుత్వంతో చర్చించి మామిడి రైతుకు ఒక కేజీపై రూ.4 ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చే విధంగా, పల్ప్ ఫ్యాక్టరీలు ఒక కేజీ మామిడిపై రైతుకు రూ.8 చెల్లిచేలా నిర్ణయం తీసుకున్నారు. అంటే ఈ సీజన్‌లో మామిడి రైతుకు ఒక కేజీపై రూ.12 లభిస్తుందని అధికారులు స్పష్టత ఇచ్చారు. ఈ మొత్తం ఆశించిన మేరకు రైతుకు గిట్టుబాటు కాకపోయినప్పటికీ గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు అంగీకరించాల్సి వచ్చింది. ఈ మేరకు పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులకు మామిడి రైతులు సీజన్‌లో 3 నెలల పాటు 4 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు తోతాపురి మామిడిని సరఫరా చేశారు. అయితే ప్రభుత్వం రైతుకు కేజీ తోతాపురి మామిడిపై చెల్లిస్తామని చెప్పిన రూ.4 ఇప్పటి వరకు చెల్లించలేదు. అలాగే పల్ప్ ఫ్యాక్టరీలు సీజన్‌లో కేజీ తోతాపురిపై రూ.8 చెల్లిస్తామని చెప్పినప్పటికీ అత్యధిక పల్ప్ ఫ్యాక్టరీలు రైతుకు ఒక కేజీ తోతాపురి మామిడిపై రూ.4 నుండి రూ.5 వరకు మాత్రమే చెల్లించడానికి సుముఖంగా వున్నాయి. మిగిలిన మొత్తం చెల్లించడానికి తాము సిద్ధంగా లేమని ఇప్పటికే పలు పల్ప్ ఫ్యాక్టరీలు మామిడి రైతులకు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఫ్యాక్టరీలకు మామిడి కాయలు సరఫరా చేసి మూడు నెలలు గడుస్తున్నప్పటికీ ఫ్యాక్టరీల నుండి ఒక్క పైసా చెల్లింపులు జరుగపోవడంపై మామిడి రైతులు ఆగ్రహంతో ఉన్నారు.

# జిఎస్టీ ప్రభావంతో జోరందుకున్న వాహనాల అమ్మకాలు

## - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 24:** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిచ్చే విధంగా జిఎస్టి సవరణ చేయడం జరిగిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.. రాష్ట్రంలో నూతనంగా అమలైన జీఎస్టీ విధానం వాహనాల అమ్మకాలకు ఊతమిచ్చిందని, పన్ను భారం తగ్గడంతో ప్రజలు కొత్త వాహనాల కొనుగోలుకు ముందుకు వస్తున్నారన్నారు. సోమవారం ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా 2,991 వాహనాలు తాత్కాలిక రిజిస్ట్రేషన్ పొందాయని తెలిపారు. వీటిలో మోటార్ సైకిళ్లు 2,352, కార్లు/క్యాబ్‌లు 241, ట్రాక్టర్లు 60, ఆటోలు 227, గూడ్స్ వాహనాలు 47, ఆటో గూడ్స్ వాహనాలు 50, ఇతర వాహనాలు 12 ఉన్నాయన్నారు ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చిన తరువాత రిజిస్ట్రేషన్ వేగం పెరుగుతుందనన్నారు.

## బ్రహ్మోత్సవాల వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పండి

### మీడియా సెంటర్ ప్రారంభంలో ఛైర్మన్ నాయుడు



**తిరుమల,సెప్టెంబర్ 24 ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ ప్రఖ్యాతిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమలలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామికి జరుగుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా మీడియా పనిచేస్తుందని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆశించారు. ఉత్సవాలు విజయవంతానికి మీడియా సహకారం అవసరమని అన్నారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అవసరమైన సకలసమాచారాన్ని అందించడంలో మీడియాపాత్ర కీలకమని, మీడియాసిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలోని రాంభగీచా అతిధిగృహం-2లో ఏర్పాటుచేసిన మీడియాసెంటర్‌ను బుధవారం ఉదయం ఛైర్మన్ బిఆర్‌నాయుడు ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు,హిందూ భక్తులకు స్వామివారి వైశిష్ట్యాన్ని చాటిచెప్పాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డుసభ్యులు పనబాకలక్ష్మి, శాంతారాం,ఎంఎస్‌రాజు,టిటిడి సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్‌ఓ నీలిమా పాల్గొన్నారు.



# ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం

**గన్నవరం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** దసరా నవరాత్రుల్లో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భారత ఉపరాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్ దంపతులకు గన్నవరం విమానాశ్రయంలో పలువురు ప్రముఖులు ఘనస్వాగతం పలికారు. బుధవారం మధ్యాహ్నం న్యూఢిల్లీ నుండి వాయుసేన ప్రత్యేక విమానంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సుమతి దంపతులు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరీ, గవర్నర్ అబ్దుల్ నజీర్‌లు పుష్పగుచ్చాలు అందించి ఆత్మీయ స్వాగతం పలికారు. మంత్రులు నారా లోకేష్, వాసంశెట్టి సుభాష్, సిఎస్ కె.విజయానంద్, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, బాపట్ల ఎంపి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, డాక్టర్ కామినేని శ్రీనివాస్, కలెక్టర్ డికె.బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తదితరులు ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఉపరాష్ట్రపతి రోడ్డుమార్గాన విజయవాడ చేరుకున్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిఐ శంకరయ్య లీగల్ నోటీసులు

**విజయవాడ, సెప్టెంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు పులివెందుల సిఐగా ఉన్న జె.శంకరయ్య ఏకంగా సిఎం చంద్రబాబుకు లీగల్ నోటీసులు పంపించారు. వివేకా హత్య కేసులో తన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కల్గించేలా దురుద్దేశపూరితంగా చంద్రబాబు పలుమార్లు తప్పుడు ప్రకటనలు చేశారని ఆరోపిస్తూ న్యాయవాది జి.ధరణేశ్వరరెడ్డి ద్వారా ఈ నెల 18న నోటీసులు పంపారు. ఈ విషయం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందులలో మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగింది. ఆ సమయంలో పులివెందుల సీఐగా శంకరయ్య విధులు నిర్వహించారు. హత్య జరిగిన రోజు ఘటనా స్థలంలోనే సాక్ష్యాధారాలు చెరిపివేస్తున్నా సీఐ శంకరయ్య వాటిని ఆపలేదని, అడ్డుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అనేకసార్లు బహిరంగ వేదికలపై వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలే తన ప్రతిష్టకు భంగం కలిగించాయని సీఐ శంకరయ్య భావిస్తున్నారు. తన తరఫున న్యాయవాది ధరణేశ్వర్ రెడ్డి సెప్టెంబర్ 18న సీఎం చంద్రబాబుకు లీగల్ నోటీసులు పంపించారు. 15 రోజుల్లో సీఎం చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే లేదా వివరణ ఇవ్వకపోతే కోటి 45 లక్షల రూపాయల పరువు నష్టం దావా కోర్టులో వేస్తామని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం సీఐ శంకరయ్య కర్నూలు డీసీఆర్బీలో వీఆర్‌లో ఉన్నారు.

# లేపాక్షిలో ప్రత్యేక రాయితీ అమ్మకాలు

**విజయవాడ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లేపాక్షి) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని లేపాక్షి షోరూమ్‌లతో పాటు హైదరాబాద్‌లో కూడా (తిరుమల మినహా) అక్టోబర్ 1, 2025 వరకు దసరా నవరాత్రి పండుగ ప్రత్యేక రాయితీ అమ్మకాలు నిర్వహించనున్నట్లు లేపాక్షి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపోరియంలను లైటింగ్, బ్యానర్లు వంటివాటితో అలంకరించి, ప్రత్యేకంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఇందులో కొత్త డిజైన్‌లతో ఉన్న కొండపల్లి, ఎటికొప్పాక బొమ్మలు, ఓడిఓపి ఉత్పత్తులు, జిఐ ఉత్పత్తులతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన ఇతర హస్తకళా వస్తువులు ప్రదర్శిస్తారన్నారు. ఈ పండుగ ప్రత్యేక అమ్మకాలలో హ్యాండీక్రాఫ్ట్స్‌పై 15 శాతం, హ్యాండ్లూమ్స్‌పై 10శాతం రాయితీ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలు, వస్త్రాలను ప్రోత్సహించడమే లేపాక్షి లక్ష్యమని అన్నారు. ఈ దసరా పండుగ సమయంలో సమీపంలోని లేపాక్షి ఎంపోరియాలను సందర్శించి, రాష్ట్ర కళాకారులను ప్రోత్సహించాలని లేపాక్షి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ కోరారు.



మహిళా ఖైదీ బిడ్డను తన చేతుల్లోకి తీసుకుని లాలిస్తున్న శైలజ

# విశాఖ సెంట్రల్ జైలులో రాయపాటి శైలజ

## మహిళా ఖైదీల సమస్యలు తెలుసుకున్న మహిళా కమిషన్ చైర్ పర్సన్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ బుధవారం ఉదయం విశాఖ సెంట్రల్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా జైలులోని మహిళా బ్యారెక్‌ను పరిశీలించిన ఆమె, వారికి అందుతున్న వసతులపై ఆరా తీశారు. భోజన సౌకర్యాలను పరిశీలించి ఆహారం రుచి చూసిన శైలజ, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శైలజ మీడియాతో మాట్లాడుతూ, జాతీయ మహిళా కమిషన్ ఆదేశాల మేరకు నవరాత్రి సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ తరఫున మహిళా శిశు సంక్షేమ శాఖ పోషమ్మ పథకం అమలు చేస్తున్నదని, మహిళా ఖైదీలకు కూడా 'పోషమ్మ' పథకం కింద ప్రత్యేక డైట్ ప్లాన్ అమలు చేయాలని పరిశీలిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం జైలులో 80 మంది మహిళలు ఉన్నారనీ, వీరిలో 50 మంది గంజాయి అక్రమ రవాణా కేసుల్లో అరెస్టయిన వారు ఉన్నారన్నారు. ఒడిశా, చెన్నై ప్రాంతాలకు చెందిన మహిళలు కూడా ఉన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో మత్తు పదార్థాల రవాణా కేసుల్లో జైలుకి వస్తున్నారు. ఇలాంటి వారిని అవగాహన కల్పించి, స్వశక్తితో బతికేలా చర్యలు చేపడతాం అని శైలజ స్పష్టం చేశారు. వీరికి కౌన్సెలింగ్ ఇప్పించి తిరిగి సమాజంలో గౌరవ ప్రదంగా జీవించే విధంగా చేయాలని కృషి చేస్తున్నామన్నారు. ఇటీవల ప్రసవం అయిన మహిళా ఖైదీ బిడ్డను తన చేతులలోనికి తీసుకుని లాలించారు. జైలులో ఉన్న మహిళా ఖైదీలకు ఐసిడిఎస్ ద్వారా పౌష్టికాహారం అందించే విధానంపై కూడా పరిశీలన జరుగుతోందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ జాయింట్ డైరెక్టర్ చిన్మయి దేవి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామలక్ష్మి, ఇతర ఐసిడిఎస్, సెంట్రల్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యేలు

- శాసనసభ ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లో ప్రభుత్వం దృష్టికి పలు అంశాలు
- మంత్రుల సమాధానాలు... పలు సమస్యలకు పరిష్కార చర్యలు

**విజయవాడ, సెప్టెంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి:** శాసనసభ ప్రశ్నోత్తరాలు జీరో అవర్‌లో పలువురు సభ్యులు వివిధ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తున్నారు. టీడ్కో ఇళ్ళు, రెవెన్యూ, విద్య, వైద్యం, రహదారులు, గ్రామీణ ఆరోగ్యం ఇతరంశాలపై సభ్యులు ప్రభుత్వాన్ని అంటే ఆయా మంత్రులను సూటిగా ప్రశ్నిస్తున్నారు. సమస్య తీవ్రతను వారికి తెలిసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పీఆర్‌సీపై ప్రతిపక్ష సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, ఆకేపాటి అమర్నాధ్ రెడ్డి వేతన సవరణపై ప్రశ్నించారు. వీరు సభకు రావడంతో సమాధానం వాయిదా వేసారు. చంపావతి నది నీటి వినియోగంపై శాసన సభ్యురాలు పూసపాటి ఆదితి విజయలక్ష్మి, నూతన బాలికా సంరక్షణ పథకంపై ఆదిరెడ్డి శ్రీనివాస్, జీవీఎంసీలో రహదారిపై కొణతాల రామకృష్ణ, ప్రజాసమస్యల పరిష్కారంపై దూళిపాళ్ళ నరేంద్రకుమార్, కూన రవికుమార్ తదితరులు ప్రశ్నోత్తర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్అండ్‌బి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నిధులు వచ్చినా విడుదల చేయడం లేదని, దీనివల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరకత వ్యక్తమవుతోందని అసెంబ్లీలో అధికారపక్ష సభ్యులు తెలిపారు. రాజానగరం జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, కొన్నిచోట్ల పనులు చేసినా డబ్బులు ఇవ్వకపోవడంతో మిగిలిన పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. రోడ్లపై వాహనాలు తిరగాలంటే ఇబ్బందిగా ఉందని, ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రోడ్లను వెంటనే బాగు చేయించాలని కోరారు. వెంటనే నిధులు విడుదల చేయించాలని కోరారు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ తన నియోజకవర్గంలో తాగునీరు సమస్య ఉందని అన్నారు. ట్రాఫిక్ సమస్య కూడా ఎక్కువగా ఉందనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ ఉత్తర బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ అంధ్రా యూనివర్శిటీ పరిధిలో 18 పోస్టులు తాత్కాలికంగా నియమించారని, వారిని పర్మినెంటు చేయాలని కోరితే లోకేష్ కార్యాలయం చెబితేనే చేస్తామంటున్నారని అన్నారు. దీనిపై విద్యా శాఖ మంత్రి లోకేష్ స్పందించి వారి నియామకాలు పూర్తి చేయాలని కోరారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు 2,200 టన్నులు కొనుగోలు చేశారని, ఇంకా రైతుల వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. కొనుగోలు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో 20 క్వింటాళ్లకు పైబడి పొగాకు పండించిన రైతుల వద్ద పత్తి నిలిచిపోయిందని తెలిపారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఎల్లన్నపేట మండల పరిధిలో ఇప్పటికీ పోలీసుస్టేషన్ లేదని, నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్‌లేదని తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగితే ఒడిశా ఫైరింజర్లు వస్తున్నాయని తెలిపారు. జక్కంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పంచాయతీరాజ్ కార్మికులకు జీతాలు పెంచకుండా వారి శ్రమను దోచుకుంటున్నామని అన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రఖ్యాతిగాంచిన కాళహస్తి దేవాలయం పరిధిలో ఆస్పత్రి లేదని, అక్కడ ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని దేవాలయానికి అనుబంధం చేయాలని తెలిపారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఎర్‌వివిఎస్‌కె రంగారావు మాట్లాడుతూ గతంలో అసెంబ్లీలకు నియోజకవర్గ అభివృద్ధి ఫండ్ ఉండేదని, దాన్ని పునరుద్ధరించాలని కోరారు. దీనికి పలువురు సభ్యులు బల్లలు చరిచి తమ మద్దతు ప్రకటించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తన అభిప్రాయం కూడా అదేనని, గతంలో నిధులు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలందరూ సిఎంని కలిసి దీనిపై ఒప్పించుకుని నిధులు రాబట్టుకోవాలని కోరారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాదు మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు మునిగిపోతున్నాయని, వాటిని మెరక చేయించాలని, గృహ నిర్మాణశాఖ మంత్రిని కోరారు. కావలి ఎమ్మెల్యే దుగమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గ పరిధిలో కాలువలు సరిగాలేక పొలాలు నీట మునుగుతున్నాయని, పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కూడా మాట్లాడారు.



# అనధికారికంగా 2,524 విగ్రహాలు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి

**విజయవాడ, సెప్టెంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మొత్తం 2,524 విగ్రహాలు అనధికారంగా ఉన్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. 2019లో ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఇప్పటివరకు కొత్త విగ్రహాలకు అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు ముందు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని, లేనిపక్షంలో వాటిని తొలగించే చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. అనధికారికంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను గుర్తించి కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. ప్రజల భావోద్వేగాలు, చట్టపరమైన నిబంధనలు రెండింటినీ దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో అనధికారికంగా విగ్రహాల ఏర్పాటు అంశం శాసన మండలిలో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రశ్నోత్తరాల్లో పాల్గొన్న టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, పులివెందులలో ప్రజా నిధులను దుర్వినియోగం చేసి అనధికారికంగా మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో వైఎస్ఆర్ విగ్రహాల కూడళ్ల అభివృద్ధి పేరిట కోట్లాది రూపాయలు వృథా చేశారని మండిపడ్డారు. అదేవిధంగా టిడిపి ఎమ్మెల్సీలు బి.తిరుమలనాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూడా అనధికార విగ్రహాలపై ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయడంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. టిడిపి సభ్యుల వ్యాఖ్యలపై విపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని కించపరిచేలా మాట్లాడారని ఆరోపించారు. దీనికి నిరసనగా ఆయన సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. బొత్స తీరుపై రెడ్డి ఎమ్మెల్సీలు స్పందిస్తూ విమర్శలు గుప్పించారు. టీడీపీ సభ్యుల విమర్శలు, బొత్స సత్యనారాయణ ప్రతిస్పందనతో సభలో ఉద్రిక్తత నెలకొంది. విగ్రహాల ఏర్పాటు అంశం సర్వసాధారణ పరిపాలనా సమస్యగా మొదలైనా, అది క్రమంగా రాజకీయ వాదనలకు దారితీసింది. ముఖ్యంగా వైఎస్సార్ విగ్రహాల విషయంలో ప్రజా నిధుల దుర్వినియోగం ఆరోపణలు రావడం, వాటిపై వైఎస్సార్సీపీ ప్రతినిధులు అభ్యంతరం తెలపడంతో మండలిలో వాతావరణం వాడివేడిగా మారింది.

# పేద విద్యార్థులంటే అంత అలుసా!

## వైసిపి వైఖరిపై శాసనమండలిలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజం




**విజయవాడ, సెప్టెంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలపై గత వైకాపా ప్రభుత్వం పెట్టలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. రూ.451 కోట్ల భారీ వ్యయంతో ప్యాలెస్ ను నిర్మించిన జగన్ పేద వైద్య విద్యార్థుల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. వైద్య విద్యను పేద విద్యార్థులకు చేరువ చేయాలన్న చిత్త శుద్ధిలేని వైకాపా నేతలు పీపీపీ విధానంలో కొత్త వైద్య కళాశాలల నిర్వహణపై అవగాహన రాహిత్యంతో, అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పీపీపీ విధానం దేశవ్యాప్తంగా అమల్లో ఉందన్నారు. కేంద్ర గణాంకాల ప్రకారం రూ.8 లక్షల 44వేల కోట్ల విలువైన పనులు నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్ లైన్ కింద పీపీపీ విధానంలో పనులు జరుగుతున్నాయన్నారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు అద్భుతంగా నడుస్తున్నాయని తెలిపారు. శాసనమండలిలో బుధవారం వైద్య కళాశాలలు... పీపీపీ విధానం అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. "పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్, ప్రైవేటీకరణ మధ్య ఉన్న తేడా తెలియని వారు సీఎంగా ఐదేళ్లపాటు పనిచేయడం మన దౌర్భాగ్యం. దురదృష్టకరం. పలు రాష్ట్రాల్లో డిజైన్, ఫైనాన్స్, బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్ ఫర్ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణం జరుగుతుందన్నారు. పీపీపీ విధానాన్ని జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, చెన్నై ఐఐటీ వంటి ఉన్నత విద్య సంస్థల్లోనూ అనుసరిస్తున్నారు. 33 ఏళ్ల తరువాత ఆ వైద్య కళాశాలలన్నీ పూర్తిగా ప్రభుత్వం చేతికే వస్తాయి. కళాశాలల నిర్వహణ కోసం టెండరు ద్వారా ఎంపిక చేసిన సంస్థలు పెట్టుబడి పెడతాయి. కళాశాలలు నడుపుతాయి. ప్రభుత్వ భూముల అమ్మకాల ప్రస్తావనే ఇక్కడ ఉత్పన్నం కాదు అని మంత్రి సత్యకుమార్ వివరించారు.

### ప్రతి కళాశాలలో 150 చొప్పున సీట్లు

ప్రభుత్వం వద్దనే యాజమాన్య హక్కులు ఉంటాయి. కళాశాలలపై ప్రభుత్వ అజమాయిషీ ఉంటుంది. పీపీపీ విధానంలో నడిచే కళాశాలల్లో జాతీయ స్థాయి కోటా కింద సీట్లు కేటాయించాల్సిన అవసరం ఉండదు. కన్వీనర్ కోటాలోని 50 సీట్లు ఉచితంగా విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. పీపీపీ విధానంలో నడవబోయే కళాశాలల్లో 150 చొప్పున సీట్లుంటాయి. పీపీపీ విధానంలో ప్రారంభించే వైద్య కళాశాలల్లో 625 పడకలుంటాయి. వీటిల్లో ఓపీ సేవలు పూర్తిగా ఉచితం. ఇన్‌పేషంట్ల కోసం కేటాయించిన పడకల్లో70 ఉచితంగా పేదలకు కేటాయించాలి. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా కింద సేవలు ఉచితంగా పీపీపీ విధానంలో నడిచే కళాశాలల్లోనూ కొనసాగుతాయి. గత వైకాపా పాలనలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ.8,480 కోట్లు ఆమోదిత వ్యయం కాగా...రూ.1,550 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. కేంద్రం, నాబార్డు నుంచి వచ్చిన నిధులను మాత్రమే ఇందుకు వినియోగించింది. వైద్య కళాశాలల నిర్మాణాల పునరుద్ధరణకు రూ.786.82 కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చుపెట్టింది. పార్వతీపురంలో కళాశాల ఏర్పాటుకు గత వైకాపా ప్రభుత్వం భూమిని కూడా సేకరించలేదు. భూమి లేకుండా నిర్మాణాలు జరపగలరా? ఇదసలు సాధ్యమవుతుందా? బెంగుళూరులో భూమిని కొనుగోలుచేయకుండానే.. భవనాలు నిర్మించారా? ప్యాలెస్ నిర్మాణం చేశారా? పులివెందుల కళాశాలలో నిర్మాణాలైతే జరిపారు. కానీ అధ్యాపకులను నియమించడంలో వైకాపా ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఎన్‌ఎంసీ 47.5 బోధకుల కొరత ఉందని తనిఖీల ద్వారా గుర్తించింది. ఇప్పటికే ప్రారంభమైన రాజమహేంద్రవరం వైద్య కళాశాలకు రూ.475 కోట్లు ఆమోదిత వ్యయం కాగా.. గత వైకాపా ప్రభుత్వంలో... కేవలం రూ.81.74 లక్షలు మాత్రమే ఖర్చుపెట్టారు. కూటమి ప్రభుత్వం రూ.53.73 కోట్లు ఖర్చుపెట్టింది. మచిలీపట్నం కళాశాల ఏర్పాటుకు కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం కింద రూ.195 కోట్లు గ్రాంటు వచ్చింది. దీనివల్ల ఈ కళాశాలకు రూ.550 కోట్ల ఆమోదిత వ్యయానికిగాను రూ.206 కోట్లు గత ప్రభుత్వం ఖర్చుపెట్టింది. ఈ కళాశాల బిల్లుల చెల్లింపుల కోసం కూటమి ప్రభుత్వం రూ.86.32 లక్షలను కూటమి ప్రభుత్వం చెల్లించింది అని మంత్రి వివరించారు.

# ప్రజారోగ్యాన్ని తాకట్టు పెట్టడమే

## - మెడికల్ కళాశాలపై ప్రభుత్వ నిర్ణయం తప్పు: మండలి ప్రతిపక్ష నేత బొత్స



**సచివాలయం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** ప్రభుత్వ కళాశాలలను పిపిపి విధానంలో నిర్మించాలని ప్రభుత్వం భావించడం దుర్మార్గమని మండల ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. బుధ వారం శాసనమండలిలో జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరణపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇది పేదల ఆరోగ్యాన్ని తాకట్టు పెట్టే విధానమే తప్పు, ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేయటమే అన్నారు. ప్రభుత్వ విధానంపై స్వల్ప వ్యవధి చర్చపై ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మండలిలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరణ ఇస్తూ... ప్రస్తుతం ఉన్న వైద్య కళాశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల వ్యాప్తంగా ఆమోదించిన 6965 ఎంబిబిఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో 17 ప్రభుత్వ కళాశాలల్లో 3115 సీట్లు, తిరపతిలోని ఎస్‌విఐఎంఎస్ 175 సీట్లు, మంగళగిరి ఎయిమ్స్‌లో 125 సీట్లు ఉన్నాయి. మిగిలిన 3,400 సీట్లు ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నాయి. 1923లో విశాఖపట్నంలో మొదటి వైద్య కళాశాల స్థాపించినప్పటి నుండి ఆంధ్రప్రదేశ్‌లో 38వైద్య కళాశాలలను ఏర్పాటయ్యాయి. ఇందులో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు, 19 ప్రైవేట్ వైద్య కళాశాలలు, మంగళగిరిలోని ఎయిమ్స్, ఒక డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఉన్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

# ప్రభుత్వంపై వైసిపిదంతా దుష్ప్రచారం



**సచివాలయం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** వైసిపి సోషల్ మీడియాలో వారి దుష్ప్రచారం, గోబెల్స్ ప్రచారం ద్వారా బూతోత్సవం జరుపుకుంటున్నారని టిడిపి సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ వారి పోకడలను తట్టుకోలేక జనాలు 11సీట్లు ఇచ్చి పక్కన కూర్చోబెట్టారు. సంఖ్య లేకుండా ప్రతిపక్ష హోదా ఏలా ఇస్తారు? 1994లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 సీట్లకు గాను 26సీట్లు అంటే 10శాతం కంటే తక్కువ వచ్చిన పి.జనార్ధనరెడ్డి హుందాగా అసెంబ్లీకి వచ్చారు. వైసీపీ ఆటవిక పాలన, చేసిన విధ్వంసానికి సమాధానం చెప్పలేక పారిపోతున్నారు. వారి సభ్యులు మండలికి వస్తున్నప్పుడు జగన్ ఎందుకు అసెంబ్లీకి రావట్లేదు? గత వైసీపీ పాలనలో అసెంబ్లీ ఎప్పుడూ సజావుగా సాగలేదు, మమ్మల్ని బయటకు నెట్టి అసెంబ్లీ జరిపారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా చితక్కొట్టి, రాజధాని లేకుండా చేసి, పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని దెబ్బతీశారు. ఇప్పటికైనా జగన్ మారాలి, ఇప్పటికే రాజకీయ చరమాంకంలో ఉన్నారు. ఎసిబి, సిబిఐ పూనుకుంటే త్వరలోనే జైలుకు వెళ్ళే రోజులు ఎంతో దగ్గరలో లేవు అని గోరంట్ల బుచ్చయ్యచౌదరి హెచ్చరించారు.



చంద్రఘంటాదేవి అలంకారంలో జ్ఞానమ్మ

# వైష్ణవి దేవిగా దుర్గమ్మ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అనుబంధ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. అలంకారాలతో భక్తుల్ని ఆకట్టుకుంటున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మూలవిరాట్టు జ్ఞాన ప్రసూనాంబ అమ్మ వారికి ఎదురుగా బొమ్మల కొలువు ఆకర్షణీయంగా మారింది. దసరా సందర్భంగా నాలుగుమాడావీధులతో పాటు ముత్యాలమ్మ గుడి పొడవునా విద్యుత్ దీపాల తోరణాలతో ముస్తాబు చేసారు. కాగా శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అమ్మ వారికి చంద్రఘంటాదేవి అలంకారం నిర్వహించగా కనకా చలంపై వెలసిన కనక దుర్గమ్మకు వైష్ణవి దేవి అలంకారం చేపట్టారు.

### భవాని మాలలతో భక్తులు

అనుబంధ ఆలయాలైన ముత్యాలమ్మ ఆలయం, ఏడు గంగమ్మల ఆలయాల్లో పూజలు వెలువెత్తుతున్నాయి. జగన్మాత ఆదిపరాశక్తి, ఏడు గంగమ్మల అమ్మవారు చంద్రఘంటాదేవి అలంకారంతో దర్శనం ఏర్పాటు చేసారు. ముత్యాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి అత్యధికంగా ఉంది. రాహుకాల సమయంలో ఆలయాల్లో భవాని మాలలు ధరించిన మహిళా భక్తుల తాకిడి అధికంగా ఉంది. కనకాచలంపై దుర్గమ్మ ఆలయంలో పూజలు ప్రత్యేక ఆకర్షణగా రూపొందిస్తున్నారు. శ్రీకాళహస్తిలోని కొత్తపేటలోని శీతలాంబ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయంలో ఏర్పాట్లును ఏఈవోలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, ఆలయ ఇన్స్పెక్టర్స్ వెంకటస్వామి, సుదర్శనం నాయుడు పర్యవేక్షించగా అలంకారాలను ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారథ్యంలో సహచరులు నిర్వహిస్తున్నారు.



# దుర్గమ్మకు శివయ్య సారె

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు ఒక ఆలయం నుంచి మరో ఆలయానికి సారె అందించే సత్ సంప్రదాయాన్ని ప్రవేశ పెట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారెను విజయవాడలోని కనకదుర్గమ్మకు సమర్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సంప్రదాయాన్ని ప్రవేశ పెట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారెను స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, ఈవో డి బాపిరెడ్డి, డిప్యూటి ఈవో ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ ప్రధానార్చకులు దక్షిణామూర్తి పౌరోహితులు అర్ధగిరి గురుకుల్, తదితరులు సారెను అందించారు. ఇక ఆలయాధికారులు సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, రాజా, వేదపండితులు వశిష్ట స్వామి, అవినాష్ శర్మ, మహేష్ స్వామిలు ఉన్నారు. శ్రీకాళహస్తి నుంచి ప్రత్యేకంగా వెళ్ళిన వారికి విజయవాడ ఆలయాధికారులు, ఈవో సీనా నాయక్‌లు సాదరస్వాగతం పలికారు. సారెను అందుకున్న వారు అతిథులకు అమ్మవారి దర్శనం కల్గించారు.



# దేవి హోమాల ద్వారా ప్రపంచ శాంతి

**పెంచలకోన (రాపూరు), సెప్టంబరు 24 ప్రభాతవార్త:** నవరాత్రులలో భక్తి శ్రద్ధలతో హోమాలు చేయడం ద్వారా ప్రపంచానికి శాంతి లభిస్తుందని భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచల కోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలోని మణిద్వీప మహా సంస్థానంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో మూడవ రోజైన బుదవారం గర్భాలయంలోని శ్రీ లలింతాబికా దేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ మహా సరస్వతీదేవిలకు, శ్రీ మహా గణపతి, శ్రీ సుబ్ర మణ్యేశ్వరల స్వాములకు అభిషేకాలు, సుప్రభాత సేవ నిర్వహించారు. శ్రీ మహా రుద్రాభిషేకం, శ్రీ లలింతాబికా దేవి, శ్రీ మహా లక్ష్మీదేవి, శ్రీ మహా సరస్వతీదేవిల ఉత్సవ మూర్తులకు ఆశ్రమ వ్యవస్థాపకరాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీదేవి తన స్వహస్తాలతో అభిషేకాలు, విశేష అర్చనలు, కమలార్చనలు, మహా మంగళ హారతులు నిర్వహించారు. 9.30 నుండి మాద్యాహ్నం 1 గంట వరకు ఆశ్రమంలోని యాగశాలలో శ్రీ మహా గణేశ హోమం, శ్రీ లలితా సహస్రనామ హోమం, శ్రీ ఛండీ హోమం, నవగ్రహ శాంతి హోమం, శ్రీ లక్ష్మీ నృసింహ హోమం, శ్రీ లక్ష్మీనారాయణ హృదయ సూక్త హోమం, శ్రీ పురుష సూక్త హోమం, శ్రీ సంపుటిత శ్రీ సూక్త హోమం,శ్రీ గాయత్రీ హోమం నిర్వహించారు. సాయంత్రం 6.30కి మణి ద్వీప మహా సంస్థానంలో సామూహిక శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన, రాత్రి శ్రీ లలితాంబికా దేవికి శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారం నిర్వహించి, సూర్యప్రభ వాహనంపై ఆశ్రమంలోని మాఢవీదులలో క్షేత్రోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ముగ్గురమ్మలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు భోజన, వసతీ ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు పులిపాటి విజయ్ భరత్, విజయ్ గోకుల్, సింధూ, సౌమ్య, తదితరులు పర్యవేక్షించారు.


# తెర

## బ్లాక్‌ఫర్రీ లుక్



ఆలియా స్టార్ రేంజ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాపులర్ బ్రాండ్లలో తన ఇమేజ్‌ని అమాంతం పెంచిందని చెప్పాలి. ఆలియాభట్ నేటి జెన్ జెడ్‌లో స్ఫూర్తివంతమైన నటి. కెరీర్ ప్రారంభించిన అతి తక్కువ సమయంలోనే సూపర్ స్టార్‌గా తనను తాను ఆవిష్కరించుకున్న మేటి కథానాయిక. ఆర్.ఆర్.ఆర్ తర్వాత వరుసగా పాన్ ఇండియా చిత్రాల్లో నటిస్తూ దేశవ్యాప్తంగా భారీ ఫాలోయింగ్‌ని ఆస్వాధిస్తోంది. ఆలియా స్టార్ రేంజ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాపులర్ బ్రాండ్లలో తన ఇమేజ్‌ని అమాంతం పెంచిందని చెప్పాలి. ప్రఖ్యాత గూచీ బ్రాండ్ ఆలియాను అంబాసిడర్‌గా ఎంపిక చేసుకుంది అంటే అర్థం చేసుకోవచ్చు. గూచీ ఇప్పుడు ది టైగర్ పేరుతో కొత్త కలెక్షన్స్‌ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతోంది. సమ్మర్ 2026 కలెక్షన్‌ను ఆవిష్కరణకు ముందు ఆలియా మునుపటి స్పెషల్ లుక్‌ని రివీల్ చేసింది. ఇది మిలన్ ఫ్యాషన్ వీక్ 2025లో అద్భుతంగా కనిపించిన లేస్ అండ్ శాటిన్ స్లిప్ డ్రెస్ ..లాంగ్ కోట్ లుక్. ఆలియా గ్లోబల్ స్టైల్ ఐకాన్‌గా ఎందుకు రాజ్యమేలుతోందో ఈ ఫోటోగ్రాఫ్ అర్థమయ్యేలా చెబుతోంది. ట్విస్ట్ ఏంటంటే? ఆలియా భట్ బ్లాక్‌ఫర్రీ లుక్ ఇంటర్నెట్‌లో టాప్ ట్రెండ్స్‌లోకి దూసుకెళ్లింది. అలాగే ఆలియా అంతర్జాతీయ పాప్ స్టార్లతో కలిసి ఉన్న ఫోటోలు కూడా ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. గూచీ బ్రాండ్ ప్రచార కార్యక్రమంలో ఇతర తారలు డెమి మూర్, గ్వినేత్ పాల్ట్రో, సెరెనా విలియమ్స్, కెండాల్ జెన్నర్ తదితరులు ఉన్నారు. గంగూభాయి కథియావాడి లో వేశ్య పాత్రలో నటించిన ఆలియా ప్రస్తుతం సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలోని లవ్ అండ్ వార్‌లో నటిస్తోంది. ఈ చిత్రంలో రణబీర్ కపూర్, విక్కీ కౌశల్ కీలక పాత్రలను పోషిస్తున్నారు.

## ఆంధ్ర నుంచి అమెరికా వరకూ ఓజీ నామస్మరణమే



నటి జ్యోతి రాయ్









పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం ఓజీ మరికొన్ని గంటల్లో విడుదల అవుతుండటంతో అభిమానుల్లో ఉత్సాహం తారాస్థాయికి చేరుకుంది. యాక్షన్ ప్యాక్డ్ గ్యాంగ్‌స్టర్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఓజీ మానియా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారందరినీ ఓ ఊపు ఊపేస్తోంది. చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా ఓజీ నామస్మరణమే చేస్తున్నారు. తాజాగా ఈ జాబితాలో దిల్ రాజు బ్రదర్స్ సైతం చేరి మరింత క్రేజ్ తీసుకు వచ్చే ప్రయత్నం చేశారు.

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ఎల్లప్పుడూ మా ప్రయాణంలో తోడుగా, ఇన్నేళ్లూ మాకు స్ఫూర్తిదాయకంగా ఉన్నారు. అతనితో ప్రతి చిత్రం నిజంగా గుర్తుండిపోతుంది ఇప్పుడు ఓజీ అనే ఈ భారీ తుఫానులో మేము కూడా అంతర్భాగం అని చెప్పుకోవడానికి సంతోషిస్తున్నాము అంటూ పవన్ కళ్యాణ్‌కి పెద్ద అభిమాని అయిన ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఓజీ మెర్చండైజ్ ధరించి మీ వెంటే మేము అంటు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. మరోవైపు సీరియల్ నటి జ్యోతి రాయ్ ఓజీ టీ షర్ట్ ధరించి నెట్టింట హాట్ ఫొటో షూట్ షేర్ చేసింది. బ్లూ జీన్స్, వైట్ టీ షర్ట్ ధరించి.. టీ షర్ట్ ముందు భాగంలో ఓజీ ప్రింట్ చేయించి ఫొటోలకు ఫోజులిచ్చారు. అంతేకాదు పవన్ స్టైల్లో చేతిలో కత్తి పట్టుకొని కుర్రాళ్లను ఫిదా చేసింది. ఓజీ టీ షర్ట్‌లో జ్యోతి రాయ్ స్టన్నింగ్ ఫొటో షూట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఫొటోలను జ్యోతి రాయ్ తన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. ఓజీ చూసేందుకు వేచి ఉండలేకపోతున్నాను అంటూ క్యాప్షన్ జోడించింది.

### విజయవాడలో ఆల్‌టైమ్ రికార్డ్

విజయవాడలోని 8 సింగిల్ స్క్రీన్ థియేటర్లలో 4286 టికెట్లు పూర్తిగా అమ్ముడై రూ. 42.64 లక్షల వసూళ్లు సాధించాయి. ఇది విజయవాడ హిస్టరీలోనే ప్రీమియర్ షోస్ ద్వారా వచ్చిన ఆల్ టైమ్ రికార్డ్ అని చెబుతున్నారు. ఇక చుట్టుపక్కల ప్రాంతాలతో కలిపి మొత్తం 64 ప్రీమియర్ షోలు వేయనుండగా, కేవలం ప్రీమియర్స్ నుంచే రూ.1.60 కోట్ల గ్రాస్ వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ అంచనా వేస్తున్నాయి. సుజీత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పవన్ ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నాడు. పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, సింగిల్స్, ట్రైలర్ ఒకదానికి మించి ఉండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఎ సర్టిఫికెట్ జారీచేసింది. పవన్ కెరీర్లోనే హయ్యెస్ట్ ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగిన చిత్రంగా ఇప్పటికే రికార్డు క్రియేట్ చేసిన ఓజీ విడుదల తర్వాత ఇంకెన్ని రికార్డులు క్రియేట్ చేస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆంధ్రా నుంచి అమెరికా వరకు ఓజీ ఫీవర్‌తో ప్రేక్షకులు ఊగిపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బుధవారం రాత్రి ప్రీమియర్ షోలు వేశారు. ఈ టిక్కెట్లు ఏపీలో రూ.1000, తెలంగాణలో రూ.800 ఛార్జ్ చేస్తున్నారు. అయినప్పటికీ పవన్ కళ్యాణ్ సినిమా అందరికంటే ముందు చూడాలని ఫ్యాన్స్ ఉత్సాహంగా కనబరుస్తుండటంతో టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. ఇప్పటికే సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ సూపర్ గా సేల్ అయ్యాయి. ట్రేడ్ వెబ్‌సైట్ నివేదిక ప్రకారం, ఓజీ సినిమా ప్రపంచవ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా రూ. 75 కోట్లు వసూలు చేసింది. ఇందులో భారతదేశంలో రూ. 45 కోట్లు, విదేశాల్లో రూ. 30 కోట్లు వచ్చాయి. ఓజి సినిమా పవన్ కెరీర్‌లో బిగ్గెస్ట్ ఓపెనింగ్ ఇచ్చే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. పవన్ గత సినిమా హరిహర వీరమల్లు మొదటి రోజే రూ. 67 కోట్లు రాబట్టగా, ఓజి మాత్రం ఆ రికార్డును తేలికగా బ్రేక్ చేయబోతోంది. మొత్తంగా ఓపెనింగ్ డే కలెక్షన్లు రూ. 150 కోట్ల వరకు ఉంటాయనే అంచనాలు ఉన్నాయి.

## టాలీవుడ్ టాప్ ఎవరు?

ఇండస్ట్రీ అనేది ఒక చదరంగం. ఇక్కడ ఎప్పటికప్పుడు పావులు కదులుతూనే ఉన్నాయి. కింగ్ అయినా.. క్వీన్ అయినా ఎక్కువ రోజులు అదే స్థానంలో ఉండరు. ఎవరి అదృష్టం బావుంటే వారు ఆ స్థానాలకు వెళ్తారు. ఇక్కడ ఎప్పుడూ నంబర్ గేమ్స్ సాగుతూనే ఉంటాయి... ప్రస్తుతం తెలుగు సినిమారంగంలో టాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్ ఎవరు అనే చర్చ మొదలైంది. ఒకప్పుడు టాలీవుడ్ ఎలా ఉండేది అంటే.. టాప్ హీరోయిన్స్ ఒకపక్క ఉంటే.. కొత్త హీరోయిన్స్ అందరూ ఒక పక్క ఉండేవారు. అనుష్క, పూజా హెగ్డే, రశ్మిక, సమంత, శ్రుతిహాసన్, కాజల్, త్రిష, తమన్నా.. ఇలా ప్రతి ఒక్కరు స్టార్ హీరోల సరసన నటిస్తూ బిజీగా ఉండేవారు. ఇందులో నెంబర్ వన్‌గా అనుష్క ఉండేది. ఆ తరువాత శ్రుతి హాసన్.. సమంత, కాజల్.. ఇలా ఒక్కోసారి ఒక్కొక్కరు ఉండేవారు. కానీ, మిగతావాళ్ళు కూడా నెంబర్ వన్ పొజిషన్‌కి తగ్గట్టే విజయాలను అందుకొని గట్టి పోటీ ఇచ్చేవారు. ఇప్పుడు ఇండస్ట్రీ అలా లేదు. వీరందరూ సీనియర్ హీరోయిన్స్ అయిపోయారు. కొందరు సినిమాలు చేయడం ఆపేశారు. ఇంకొందరు పరాజయాల పరంపరను కొనసాగిస్తున్నారు. కానీ, ఇప్పటికీ టాప్ హీరోయిన్‌గా కొనసాగుతుంది మాత్రం రశ్మికనే. రశ్మిక నటించిన తెలుగు చిత్రాల ఘనవిజయాలు.





ఆమె అందుకుంటున్న పారితోషికం, ఉత్తరాదిన సైతం తనదైన బాణీ పలికిస్తోన్న వైన, ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే రశ్మిక కాక వేరెవ్వరూ లేరని ఇట్టే తెలిసిపోతుంది... టాలీవుడ్ టాప్ హీరోయిన్ అంటే రశ్మికనే అని అందరూ అంగీకరిస్తున్నారు. పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, కుబేర.. ఇలా అమ్మడు నటించిన ప్రతి సినిమా సూపర్ హిట్. తెలుగు, హిందీ భాషల్లో మకుటం లేని మహారాణిగా మారింది రశ్మిక. వచ్చిన ప్రతి అవకాశాన్ని అందుకోకుండా.. తన కెరీర్‌కు ఏది ఉపయోగపడుతుందో అది మాత్రమే ఎంచుకొని టాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్‌గా మారింది రశ్మిక. ఇక టాలీవుడ్ టాప్ హీరోయిన్ చర్చలో చివరికి రశ్మిక పేరు రావడంతో అయ్యా.. అమ్మడిని కొట్టేవారు టాలీవుడ్ లోనే లేరా అని నెటిజన్స్ నోర్లు నొక్కుకుంటున్నారు. ప్రస్తుతం రశ్మిక నటిస్తోన్న లేడీ ఓరియెంటెడ్ మూవీ ద గర్ల్ ఫ్రెండ్ వైపు సినీ ఫ్యాన్స్ చూపు సాగుతోంది. ఈ సినిమా బంపర్ హిట్ ఖాయమని అంటున్నారు. ఇక బాలీవుడ్‌లో థామా, కాక్ టెయిల్ మూవీస్‌లోనూ రశ్మిక తనదైన బాణీ పలికించబోతోంది. ఈ సినిమాలు అనుకున్నట్టు విజయం సాధిస్తే టాలీవుడ్‌లో ఏంటి ఏకంగా ఆల్ ఇండియా నంబర్ వన్ హీరోయిన్ గానూ రశ్మిక సాగినా ఆశ్చర్యపోనక్కరలేదు.

## జైలర్ 2కి స్పెషల్ రోల్

సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ జైలర్ 2 సినిమాపై అభిమానుల్లో భారీ స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. 2023లో వచ్చిన జైలర్ సినిమా మంచి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, రజనీకి మళ్లీ మాస్ ఇమేజ్ తెచ్చిపెట్టింది. ఇప్పుడు అదే సక్సెస్‌ను కొనసాగించేందుకు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో సీక్వెల్ తెరకెక్కుతోంది. తాజాగా ఓ ప్రెస్ మీట్‌లో మాట్లాడిన రజనీకాంత్, జైలర్ 2ను 2026 జూన్ 12న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. షూటింగ్ చాలా బాగా జరుగుతోంది' అని తెలిపారు. ఇప్పటికే ఈ చిత్రంలో మలయాళ లెజెండ్ మోహన్‌లాల్, కన్నడ



పవర్ స్టార్ శివరాజ్‌కుమార్ పాత్రలు కొనసాగించనున్నారని సమాచారం. ఇక తమిళ సినిమానే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి పెరిగేందుకు, టాలీవుడ్ మాస్ గాడ్ నందమూరి బాలకృష్ణ కూడా ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారన్న టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ అధినేత కలానిధి మారన్ నిర్మిస్తుండగా, సంగీతాన్ని మళ్లీ అనిరుధ్ రవిచంద్రన్ అందిస్తున్నారు.

ఫస్ట్ పార్ట్‌లో అనిరుధ్ ఇచ్చిన బీజీఎమ్ సాంగ్స్ ఎంతగా వైరల్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అదే స్థాయి మ్యూజిక్ మళ్లీ జరగొచ్చని అభిమానులు భావిస్తున్నారు.

ఫస్ట్ పార్ట్ చూసిన ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టే, జైలర్ 2లో మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ డ్రామా, పవర్‌ఫుల్ యాక్షన్ సీన్స్ మరింత హై లెవెల్‌లో ఉంటాయట. దీంతో ఈ సినిమా కూడా ఇండస్ట్రీ హిట్ అవ్వడం ఖాయం అనే బలమైన నమ్మకంతో ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు.


## దీపావళి కానుకగా ఎర్రచీర



సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని నటించిన సినిమా ఎర్రచీర. సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్రను పోషించిన సినిమా ఇది. మదర్ సెంటిమెంట్, హార్రర్, యాక్షన్ కథతో తెరకెక్కిన ఈ సినిమా ఎట్టకేలకు దీపావళి కానుకగా అక్టోబర్ 10న విడుదల కాబోతోంది. ఇటీవల ఈ సినిమా బిజినెస్ షో చూసిన పంపిణీ దారులంతా మూవీపై పాజిటివ్ ఒపీని యర్ వెలిబుచ్చారని, డివోషనల్ టచ్ ఉన్న ఈ సినిమాను దీపా వళికి విడుదల చేయడం సబబుగా ఉంటుందని చెప్పడంతో అక్టోబర్ 10న విడుదల చేయ బోతున్నామని సుమన్ బాబు చెప్పారు.

ఇటీవలే ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను సైతం పూర్తి చేసుకుందని, ఇంటర్వెల్ బ్యాంగ్, క్లైమాక్స్ ఎర్రచీరకు హైలైట్‌గా నిలుస్తాయని సుమన్ బాబు తెలిపారు. సినిమా విడుదలలో జాప్యం జరిగినా కంటెంట్ ఫ్రెష్‌గా ఉంటుందని, హారర్ బ్యాక్ డ్రాప్‌లో మదర్ సెంటిమెంట్‌తో తీసిన ఈ లేడీ ఓరియేంటెడ్ సినిమా అందరినీ ఆకట్టుకుం టుందని ఆయన అన్నారు. ఎర్ర చీర ప్రమో షన్స్‌లో భాగంగా హరిహర వీరమల్లు డైరెక్టర్ జ్యోతి కృష్ణను కలిసి సినిమా ట్రైలర్‌ను చూపించారు. ఎర్ర చీర ట్రైలర్ చాలా బాగుందని, అందరూ థియేటర్లలలో చూడాలని జ్యోతికృష్ణ కోరారు.

## పోలీస్ అవతారంలో మాస్ జాతర



మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న అతి పెద్ద మాస్ ఎంటర్‌టైనర్ మాస్ జాతర సినిమాపై ఇప్పటి వరకు పలు ఊహాగానాలు కొనసాగుతున్న తరుణంలో, నిర్మాత నాగ వంశీ ఒక క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమాకి సంబంధించి రిలీజ్ డేట్‌ను అక్టోబర్ 2, 2025న ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఈ సినిమా మొదటగా 2025 ఆగస్టు 27న విడుదల కావలసి ఉంది. కానీ పరిస్థితుల దృష్ట్యా విడుదలను వాయిదా వేయాల్సి వచ్చింది. అయితే తాజా ప్రకటనతో మళ్లీ సినిమాపై హైప్ మొదలైంది. నిర్మాతలు సినిమా రిలీజ్ డేట్ తెలియజేసిన వెంటనే బ్యాక్ టు బ్యాక్ అప్‌డేట్స్ ఉంటాయని తెలిపారు. ఈ చిత్రంలో రవితేజ మళ్లీ ఒక పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. గతంలో క్రాక్, విక్రమార్కుడు, వాల్తేరు వీరయ్య వంటి చిత్రాల్లో పోలీస్ రోల్స్‌తో అభిమానులను మెప్పించిన రవితేజ, ఈసారి మాస్ జాతరలో మరింత పవర్‌ఫుల్‌గా కనిపించనున్నాడు. ఈ చిత్రానికి భాను భోగరపు దర్శకత్వం వహిస్తుండగా, శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇందులో రవితేజ తండ్రి పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా భీమ్స్ సిసిరోలియో పని చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఇటీవల రవితేజ చేసిన రావణాసుర, ఈగల్, టైగర్ నాగేశ్వరరావు వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో, ఈ సినిమా విజయం కోసం అభిమానులు, చిత్రబృందం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే, రవితేజ తాజాగా థియేటర్ రంగంలోకి అడుగుపెట్టి, హైదరాబాద్ వనస్థలిపురంలో ఆర్ట్ సినిమాస్ పేరుతో థియేటర్ ప్రారంభించారు. ఇందులో ఇపిఐక్యూ స్క్రీన్, డాల్బీ అట్మాస్ సౌండ్, 4కె వీడియో క్వాలిటీ వంటి ఫీచర్లు ఉండడం విశేషం.

## గుర్తుండేలా 100వ సినిమా

అక్కినేని నాగార్జున టాలీవుడ్‌లో ఓ మల్టీ టాలెంటెడ్ హీరో.. తెలుగు హీరోల్లో ఎవరూ చేయని ఎన్నో సాహసాలు చేశాడు. రొమాంటిక్ పాత్రల నుంచి యాక్షన్ రోల్స్ వరకూ, భావోద్వేగ సన్నివేశాల నుంచి ఆధ్యాత్మిక కథల వరకూ, ఆయన ప్రతి రకమైన సినిమాలో తనదైన ముద్ర వేశారు. నటుడిగానే కాకుండా.. నిర్మాతగా, టీవీ షోలతో అభిమానులను అలరిస్తూ తెలుగు సినిమా, కింగ్ సంచలనం సృష్టిస్తున్నాడు. అలాంటి వెర్సటైల్ స్టార్.. ఓ అరుదైన మైలురాయిని చేరుకోబోతున్నాడు. నాగార్జున అతి త్వరలో 100వ సినిమా మైలు రాయికి చేరుకోబోతున్నాడు. ఈ మూవీతో



చరిత్ర సృష్టించడానికి రెడీ అవుతున్నాడు. కెరీర్ లో మైలు రాయిగా నిలవబోతున్న ఈ సినిమాకు అంతే మెమోరేబుల్‌గా ఉండేలా చూసుకోబోతున్నాడు. ఇంటర్నల్ టాక్ ప్రకారం.. ఈ స్పెషల్ 100వ సినిమాకు ప్రముఖ తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. కార్తీక్.. కోలీవుడ్‌లో ఓ స్పెషల్ ఇమేజ్ ఉన్న డైరెక్టర్. తనదైన విభిన్నమైన కథలు, ఆసక్తికరమైన కథనంతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటారు. ఈ సినిమా గురించి త్వరలో అధికారిక ప్రకటన రానుంది. కాంబో గురించి తెలిసిన ఫ్యాన్స్ ఎగ్జయిట్ గా ఫీల్ అవుతున్నాడు. నాగార్జున ఈ చిత్రాన్ని 2026 మేలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. 100వ సినిమా కావడంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

## ముప్పై లక్షల వాచ్‌తో మునుపటి సమంత



ఫ్యాన్స్ ఫిదా! మునపటి సమంత అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఒకప్పుడు సమంత చాలా క్యూట్‌గా ఉండేది. కానీ మయోసైటిస్ వల్ల సమంత శరీరం మొత్తం బలహీనంగా మారిపోయి మొహమంతా వాడిపోయినట్లుగా కనిపించింది. సమంత రూత్ ప్రభు.. ఏమాయ చేసావే సినిమాతో అందర్నీ మాయ చేసి పడేసింది. ఈ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమాతోనే టాలీవుడ్‌లో ఎంతో మంచి పేరు సంపాదించింది.. అలా వరుసగా స్టార్ హీరోలతో అవకాశాలు అందుకొని అద్భుతమైన నటిగా పేరు తెచ్చుకోవడమే కాదు ఇండస్ట్రీలో ఉండే బడా ఫ్యామిలీలోకి కోడలుగా వెళ్ళింది. అలా అక్కినేని వంటి బడా ఫ్యామిలీలోకి కోడలుగా వెళ్లాక సమంత పేరు ప్రఖ్యాతలు మరింత పెరిగాయి. నాగ చైతన్యని పెళ్లి చేసుకున్న తర్వాత కూడా సినిమాల్లో రాణించిన సమంత పెళ్లైన నాలుగేళ్లకు ఏమైందో ఏమో కానీ ఇద్దరి మధ్య విభేదాలు వచ్చి విడాకులు తీసుకున్నారు. విడాకుల తర్వాత సమంత సినీ కెరీర్ చాలా వరకు నష్టపోయింది. అదే సమయంలో మయోసైటిస్ వ్యాధి ఆమె జీవితాన్ని తలకిందులు చేసింది. ఈ వ్యాధి వల్ల చాలా సంవత్సరాలు ఇండస్ట్రీకి దూరమైంది కూడా. అప్పుడప్పుడు సినిమాలతో పలకరించినప్పటికీ ఆ సినిమాలు ఆకట్టుకోలేదు. ఇదిలా ఉంటే వ్యాధి నుండి బయటపడ్డ సమంత మళ్ళీ తన అందంపై కాన్సంట్రేషన్ చేసింది. ఎప్పుడు జిమ్ లోనే గడుపుతూ మునపటి రూపాన్ని తెచ్చుకునేందుకు తెగ కష్టపడుతోంది. అటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటూ తన గ్లామర్ ఫోటోలు అలాగే తాను ప్రమోట్ చేసే ఉత్పత్తులకు సంబంధించిన విషయాలను కూడా షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలోనే తాజాగా సమంత తనకి సంబంధించిన కొన్ని క్యూట్ ఫోటోస్‌ని సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోస్‌లో సమంత క్యూట్ లుక్‌కి చాలా మంది ఫిదా అవుతున్నారు. అసలు కథ ఇదే! మునపటి సమంత అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఒకప్పుడు సమంత చాలా క్యూట్‌గా ఉండేది. కానీ మయోసైటిస్ వల్ల సమంత శరీరం మొత్తం బలహీనంగా మారిపోయి మొహమంతా వాడిపోయినట్లుగా కనిపించింది. కానీ ఇప్పుడిప్పుడే మళ్ళీ తన అందంపై కాన్సంట్రేట్ చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన ఫోటోస్‌తో సమంత మునపటి లుక్ లోకి మారిపోయింది అని కామెంట్లు పెడుతున్నారు ఫ్యాన్స్.

## సృజనాత్మక స్వేచ్ఛ ఇచ్చారు



జి.ఎం. ఫిల్మ్ కార్పొరేషన్‌తో కలిసి నేతాజీ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద చోళ చక్రవర్తి నిర్మిస్తున్న చిత్రం ద్రౌపది 2. తమిళతెలుగు ద్విభాషా చిత్రంగా రాబోతోన్న ఈ ప్రాజెక్ట్‌కి మోహన్.జి దర్శకత్వం వహించారు. ఈ మూవీలో రిచర్డ్ రిషి ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. ఈ హిస్టారికల్ యాక్షన్ డ్రామాకు సంబంధించిన షూటింగ్ బుధవారంతో ముగిసింది. ఈ మేరకు దర్శక, నిర్మాతలు సినిమా గురించి కొన్ని విశేషాల్ని పంచుకున్నారు. దర్శకుడు మోహన్.జి మాట్లాడుతూ..దర్శకుడు ఎంత జాగ్రత్తగా ప్లాన్ చేసినా, చివరికి నిర్మాత సపోర్ట్, మద్దతుతోనే షూటింగ్‌ను పూర్తి చేయగలం. చిత్రీకరణమైన సమయంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా కూడా నిర్మాత చోళ చక్రవర్తి ఇచ్చిన సపోర్ట్‌తోనే చిత్రీకరణను పూర్తి చేయగలిగాను. ఆయనకు ఇది తొలి ప్రాజెక్ట్ అయినప్పటికీ, సినిమా పట్ల ఆయనకున్న ప్యాషన్, ఇష్టం, అనుభవం, కళ, విజన్ వల్లే ఇంత గ్రాండ్‌గా చిత్రీకరించగలిగాం. సృజనాత్మక స్వేచ్ఛను ఇవ్వడంతో ఈ మూవీని అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కించానని అనుకుంటున్నాన్తు అని అన్నారు.

## పంజాగుట్టలో కాన్‌ప్లెక్స్ సినిమాస్



హైదరబాద్‌లోని పంజాగుట్ట ఏరియాలోని నాగార్జున సర్కిల్ లో ఓ లగ్జరీ మల్టీప్లెక్స్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. విఙ్రాన్ యార్లగడ్డ, హర్ష కొత్తపల్లి, సుజిత్ రెడ్డి గోలి భాగస్వామ్యంలో నిర్మించిన కాన్‌ప్లెక్స్ సినిమాస్ లగ్జరి యన్ థియేటర్‌ను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ, ఎస్. రాధాకృష్ణ (చినబాబు), నిర్మాత నాగవంశీ, ప్రణీత్ గ్రూప్ ఎండీ నరేంద్ర కామ రాజు ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ..తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ..కాన్‌ప్లెక్స్ సినిమాస్ లగ్జరియన్ థియేటర్‌ను నిర్మించిన విఙ్రాన్ యార్లగడ్డ, హర్ష కొత్తపల్లి, సుజిత్ రెడ్డి గోలి అభినందనలు. ఈ థియేటర్ చాలా బాగుంది. ప్రతీ ఒక్కరూ ఒక్కసారైనా ఈ మల్టీప్లెక్స్‌ను సందర్శించాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమానికి సినీ హీరో సిద్దు, నిర్మాతలు చినబాబు, నాగవంశీ గార్లు రావడం ఆనందంగా ఉంది అని అన్నారు. ..స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ.. కాన్‌ప్లెక్స్ సినిమాస్ లగ్జరియన్ థియేటర్ ప్రారంభోత్సవానికి నన్ను ఆహ్వానించినందుకు థాంక్స్. థియేటర్ చాలా బాగుంది. స్క్రీన్ చాలా నచ్చింది. ఈ రోజు ఇక్కడికి రావడం నాకు చాలా ఆనందంగా ఉంది అని అన్నారు. ..విఙ్రాన్ యార్లగడ్డ మాట్లాడుతూ ఆడియెన్స్‌కి లగ్జరీ సీటింగ్, అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించాలని ఈ థియేటర్‌ను ప్రారంభించాం. మూడు స్క్రీన్లలో కలిపి 171 సీటింగ్ కెపాసిటీ ఉంటుందన్నారు.



వస్తువులు శివానందన్‌కు ఇచ్చారట. అందులో చెస్‌బోర్డ్ కూడా ఉంది. ఆ చెస్ బోర్డ్‌ని ఐదేళ్ల బోధన ఆసక్తిగా గమనించంతో తనకున్న అవగాహనతో ఆట నియామాలు వివరంచారట. అలా యూట్యూబ్‌ల్లో చెస్‌కు సంబంధించిన వీడియోలు చూపించారట. ఈ క్రమంలో చదరంగంలో ఆన్‌లైన్‌లో పలువురితో చెస్ ఆడి, విజయాలను నమోదు చేయడంతో బోధనను స్థానిక చెస్ క్లబ్‌లో చేర్పించారు.

**చిన్న వయసులోనే...** చెస్ క్లబ్‌లో చేరాక బోధన మరిన్ని మెలకువలు నేర్చుకుంది. ఆ తర్వాత వివిధ టోర్నమెంట్లలో పాల్గొని పలు విజయాలు సాధించిన ఈ చిన్నారి. పెద్ద విజయాన్ని టైటిల్‌ని సొంతం చేసుకుంది. తద్వారా పాతికేళ్ల తర్వాత ఇంగ్లాండ్‌కు ప్రపంచచెస్ ఛాంపియన్ టైటిల్ అందించిన ఘనతను దక్కించుకుంది. అంతేకాదు.. ఈ ఛాంపియణన్‌షిప్ మూడు కేటగిరీ (క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్)ల్లోనూ బంగారు పతాకాన్ని దక్కించుకోవడం మరో విశేషం. గతేడాది మహిళల జట్టులో చోటు దక్కించుకున్న బోధన.. బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో పాల్గొంది. తద్వారా ఇంగ్లాండ్ తరఫున అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొన్న పిన్నవయస్కురాలిగా నిలిచింది. అదే ఏడాది రెండుసార్లు రొమేనియా చెస్ ఛాంపియన్, గ్రాండ్‌మాస్టర్‌తో జరిగిన మ్యాచ్‌ని డ్రాగా ముగించింది. తద్వారా గ్రాండ్‌మాస్టర్‌తో ఓటమి తప్పించుకునన్న పిన్నవయస్కురాలిగా మరో ఘనత సాధించింది. ఇటీవలే 'బ్రిటిస్ చెస్ ఛాంపియన్‌షిప్స్'లో 60 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ పీటర్ వెల్స్‌ని ఓడించి పిన్నవయస్కురాలిగా మరో ఘనతను తన ఖాతాలో చేర్చుకుంది. అలాగే ఈ విజయంతో 'ఉమన్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్‌ని కూడా సొంతం చేసుకుంది.

**ప్రాక్టీస్ ఇలా...**

చిన్న వయసులోనే చదరంగంలో అద్భుతాలు సృష్టిస్తోన్న బోధన.. ఎక్కువ సమయం స్కూల్‌లోనే గడుపుతుందని ఆమె తండ్రి శివానందన్ చెబుతున్నారు. భారత్‌లో లాగా అథ్లెట్లు స్కూల్‌ని స్కిప్ చేసే అవకాశం ఇక్కడ ఉండదు. తను ఉదయం 8 గంటలకు వెళితే తిరిగి సాయంత్రం 4 గంటలకు ఇంటికి వస్తుంది. ఓ గంట పాటు చెస్ ప్రాక్టీస్ చేస్తుంది. వారాంతాల్లో మాత్రం ఎక్కువ సమయం సాధన చేస్తుంది. గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధించడానికి తను చాలా దూరంలో ఉంది. చిన్న వయసులోనే పెద్ద విజయాలను నమోదు చేస్తుండడంతో చాలామంది బోధనను అభినందిస్తున్నారు. అయితే మేము మాత్రం సాధారణ అమ్మాయిగానే చేస్తుంటాం. ఎందుకంటే విజయం గర్వం దరిచేరితే తను నష్టపోయే అవకాశం ఉంటుంది' అని చెప్పుకొచ్చారు.

# పదేళ్లు నిండకుండానే ఎన్నో రికార్డులు

జెన్ ఆల్ఫా తరం వారు టెక్నాలజీని ఉపయోగించడంలోనే కాదు.. రికార్డులు సృష్టించడంలోనూ ముందుంటున్నారు. పట్టుమని పదేళ్లు నిండకుండానే చాలామంది పలు రంగాల్లో రికార్డులు సృష్టిస్తున్నారు. భారత సంతతికి చెందిన యుకె చిన్నారి బోధనా శివానందన్ ఈ కోవకే చెందుతుంది. చదరంగంలో అద్భుతాలు సృష్టిస్తోన్న ఈ చిన్నారి పదేళ్ల వయసులోనే ఓ గ్రాండ్‌మాస్టస్ ఓడించింది. తద్వారా చిన్న వయసులోనే గ్రాండ్ మాస్టర్‌ని ఓడించి ఘనత దక్కించుకుంది. ఈ నేపథ్యంలో బోధన గురించి మరిన్ని ఆసక్తికర విషయాలు తెలుసుకుందాం.

ఆసక్తిగా గమనించడంతో.. బోధన తండ్రి శివానందని తమిళనాడులోని తిరుచ్చి. ఉద్యోగరీత్యా లండన్ వెళ్లిన ఆయన.. అక్కడే ఉంటున్నారు. ఓ రోజు తన స్నేహితుడు ఇండియాకు తిరిగి వస్తుండంతో అతని



**రిషిని కలిసి..** బోధనకు పియానో ప్లే చేయడం కూడా వచ్చట. ఒకానొక సమయంలో చెస్‌ని వదిలిపెట్టి పూర్తిగా పియానోపై దృష్టి పెట్టాలనుకుందట. కానీ, నాలుగు రోజులకే మనసు మార్చుకుని తిరిగి చెస్ ఆడడం మొదలుపెట్టిందట. తనకు ఇద్దరు కవల చెల్లెళ్లు ఉన్నారు. వారికి చదరంగమంటే అస్సలు ఇష్టముండదదట. బోధన ప్రతిభ గురించి తెలుసుకున్న అప్పటి బ్రిటన్ ప్రధానమంత్రి రిషిసునాక్.. ఈ చిన్నారిని ప్రత్యేకంగా కలుసుకుని అభినందించారట. చిన్నవయసు లోనే ఎన్నో ఘనతలు సాధించిన బోధన తన లక్ష్యం మాత్రం గ్రాండ్‌మాస్టర్ టైటిల్ పొందడమేనని చెబుతోంది.

## నేటి అలంకరణ

# శ్రీ కాత్యాయనీ దేవి



"ఈశానాం వామాంక నివాసినీ శ్రీ కాత్యాయని దేవ్యై నమః
శరణం ప్రపద్యే కాత్యాయని మహాదేవి శంకరార్ధ స్వరూపిణి
కళ్యాణం కురుమే దేవి శశక్తి నమోస్తుతే
శ్రీ కాత్యాయని దేవ్యై నమః
సర్వదోష ప్రశమని సర్వాలంకార సంయుతే
యావత్వాం పూజయిష్యామి తావత్వాం సుస్థిరాభవ
శ్రీ కాత్యాయని దేవ్యై నమః
భౌమవారే ప్రియే దేవి కుజదోష నివారిణి
స్కందమాత్రే స్వర్ణ రత్న మననం ప్రతిగృహ్యాతాం
శ్రీ కాత్యాయని దేవ్యై నమః
దేవి దేవి మహాదేవి శంకరార్ధ స్వరూపిణి
కాత్యాయనీ మహాదేవి కైలాసాచల వాసిని
తవపూజా భక్తియుక్త చేతసాహం సదాముదా
కరిష్యామి తవప్రీత్యై మమాభీష్టం ద్రుతం కురు
గ్రహదోషాది దుర్దోశాన్ క్షిప్రం నాశయ శాంభవి
కళ్యాణం కురుమే దేవి సౌభాగ్యంచ ప్రయశ్చమే
శ్రీ కాత్యాయని దేవ్యై నమః

**అమ్మవారికి అలంకారం:** ఎరుపు రంగు వస్త్రం
**పుష్పాలు :** ఎరుపు రంగు పూలు
**నైవేద్యం:** అమ్మవారికి ఉప్పువేసి వండిన ఏడు (7) అప్పాలు
**మంత్రం:** శ్రీ కాత్యాయని దేవ్యై నమః అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి.
శ్రీ కాత్యాయనీ దేవి అష్టోత్తరం, స్తోత్రాలు పారాయణ చేస్తు అమ్మవారిని పూజించాలి.

**- భట్టిప్రోలు నటరాజ కుమార్**

## నిమిషాల్లో బిసి బెలే బాత్!



కన్నడిగుల వంటల్లో మనకు బాగా నచ్చేది బిసి బెలె బాత్. తరచూ చేసి, ఇష్టంగా తింటాం కనుక ఇది మనదే అనిపిస్తుంది. అయితే.. అప్పటికప్పుడు అన్ని దినుసులనూ వేయించి, నూరాలంటే కొంచెం పెద్ద ప్రహసనమని.. పౌడర్ కొనుక్కుంటాం. అందులో నిలవుండేందుకు రసాయనాలు కలుపుతారు. అందువల్ల ఈ పొడిని ఇంట్లోనే చేసుకుందామా.. ఇది చేసేందుకు.. శనగ పప్పు, ధనియాలు 4 చెంచాల చొప్పున, ఎండుకొబ్బరి తురుము 3 చెంచాలు, మినప్పప్పు, గసగసాలు 2 స్పూన్ల చొప్పున, నువ్వులు, ఆవాలు, జీలకర్ర చెంచా చొప్పున ఎండుమిరపకాయలు 12, లవంగాలు 3, యాలకులు 2, ఇంగువ ముప్పావు చెంచా, మిరియాలు అర చెంచా, దాల్చినచెక్క అంగుళం ముక్క, కరివేపాకు ఒక కట్ట, పావు చెంచా మెంతులను సిద్ధంగా ఉంచుకోవాలి. ఎలా చేయాలంటే.. కడాయిలో ఆవాలు, శనగ పప్పు, మినప్పప్పు, మెంతులు, జీలకర్ర, ధనియాలను ఒక దాని తర్వాత ఒకటి చొప్పున వేసి వేయించాలి. అవి మంచి వాసన వస్తుండగా పల్లెంలోకి తీసి, నువ్వులు, గసగసాలను వేయించి తీయాలి. తర్వాత.. దాల్చినచెక్క, లవంగాలు, మిరియాలు, యాలకులకు వేయించాలి. వాటినికూడా తీసి.. కరివేపాకు, ఎండు మిరపకాయలను.. అవీ వేగాక..కొబ్బరి తురుమును వేయించాలి. అన్నిటినీ చల్లారనిచ్చి.. ఇంగువ జతచేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీన్ని తడిలేని, గాలిచొరబడని సీసాలో భద్రం చేసుకుంటే సరి.. ఎప్పుడంటే అప్పుడు 'బిసిబెలెబాత్' చేసుకోవచ్చు.

## పెళ్లికి పూల దుపట్టా!









ఒకప్పుడు పెళ్లంటే ఏ పట్టు కట్టాలా అనే తెగ వెదికేవారు. ఇప్పుడు హల్దీ, మెహందీ, పెళ్లికూతుర్ని చేయడం... ఇలా సందర్భాలు బోలెడు. ప్రతి వేడుకలోనూ ప్రత్యేకంగా కనిపించాలన్న తపనే. ముఖ్యంగా హల్దీకి సిద్ధమయ్యే విషయంలో మరీ మరీ జాగ్రత్తలు తీసుకుంటున్నారు అమ్మాయిలు. క్యాండిడ్ పిక్‌లన్నీ దొరికేది ఇక్కడే మరి. అసలే పూలంత సుకుమారం అమ్మాయిలది. కాబట్టే, కవులు సైతం ఏడు మల్లెల ఎత్తు అంటూ ఆమె అందాన్ని పొగిడారు. అలాంటమ్మాయి పూల అలంకరణలో ఇంకెంత అందంగా ఉంటుంది? ఇదిగో ఇలా దేవకన్యలా మెరిసిపోతుంది. ఒకప్పుడు హల్దీ అంటే పసుపు దుస్తులు... పూల నగలకు చోటిచ్చేవారు. ఇప్పటి వధువులు అది పాత ఫ్యాషన్ అంటూ కొట్టిపారేయడం కాదు. పసుపు రంగు వస్త్రాకు జోడిగా కోటుగానో, చీర, లెహంగాలను చుట్టేస్తోనో, టాజిల్స్ లేదంటే ఓణీలానో పూలకు చోటిచ్చేస్తున్నారు. గులాబీ, మల్లె, చామంతి, బంతి, జాజి, విరజాజి, బటన్ డైసీ.. ఇవీ అవీ అని కాదు.. సీజన్‌కి తగనగ పూలతో దుస్తులు డిజైన్ చేయించుకుంటున్నారు. అలాంటి డిజైన్లే ఇవన్నీ. తాజా పూలల్లో ప్రకృతి సౌందర్యమంతా సొంతం చేసుకున్నట్టు వధువులూ అందంగా మెరిసిపోతున్నారు. కాబట్టే, హల్దీ వేడుకల్లో వీటికే ఇప్పుడు ఆదరణంతా. మీరూ పెళ్లి పీటలెకనకబోతున్నార? అయితే ప్రయత్నించేయండి మరి.





### చెలి చిట్కా

పెదవులు కొరికే అలవాటు వలన పెదవి ఎండి పోయి నట్లుగా కనిపిస్తుంది


## నేడు అట్ల బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో ఐదవ రోజు తంగేడు, గునుగు, బంతి, చెమంతి తదితర పూలను నాలుగు ఎత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు.

ఈ రోజు నైవేద్యం : వరిపిండితో చేసిన అట్లు.

## కాబోయే అమ్మ జాగ్రత్తలు



గర్భధారణ... ఈ తొమ్మిది నెలల ప్రయాణంలో ప్రతి రోజూ కీలకమే. అయితే, ఎన్ని జాగ్రత్తలు. సుకున్నా సరే రకరకాల కారణాలతో గర్భిణుల్లో జ్వరం, ఒళ్లు నొప్పులు... వంటివి స్తుంటాయి. అయితే, వీటి చికిత్సకు ఉపయోగించే పారాసిటమాల్ టాబ్లెట్ల విషయంలో గ్రత్తగా ఉండాలని చెబుతున్నాయి తాజా బీఎమ్సీ ఎన్విరాన్మెంటల్లోని అధ్యయనాలు, టిలో వాడే అసిటమినోఫెన్ అనే రసాయనం... శిశువుల్లో ఆటిజం, ఏడీహెచ్ఎ వంటి వ్యారోడెవలప్మెంటల్ డిజార్డర్ల(ఎన్డీడీ)కు కారణమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

పరిశోధకులు దీనికోసం శాస్త్రవేత్తలు లక్షమంది నుంచి డేటాను తీసుకొన్నారు. మునుపటి "ధ్యయనాలనూ విశ్లేషించారు. ప్రెగ్నెన్సీ సమయంలో ఈ అసిటమినోఫెన్ రసాయనం ఉన్న కాబ్లెట్లు వాడిన వారి పిల్లల్లో తరవాత కాలంలో ఎన్డీలు వచ్చే ముప్పు పెరిగినట్లు పెర్తించారు. అందుకే, వైద్యుల పర్యవేక్షణలో దీన్ని తక్కువ రోజులు వాడాలని, మోతాదు కూడా తక్కువగా ఉండేట్లు చూసుకోవాలని సూచిస్తున్నారు పరిశోధకులు.

## వృద్ధాశ్రమంలో నవ్వుతూ బతకండి!


### వ్యథ



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న:** నేను నలుగురు బిడ్డలు ఉన్న అనాధను. కోట్ల ఆస్తి సంపాదించి ఇచ్చినా కూడు పెట్టేవారు లేరు. నాతో నేను బతుకుతూ, పరాయి పనిమనిషి తోడుగా బతుకుతున్నాను. మా రోజుల్లో పిల్లలే సంపద అనే భావన ఉండేది. అందుకే ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలను కనిపెంచాను. నేను మొదటి శ్రేణి విద్యార్థిని అయినా నా పిల్లలకు సరిగా చదువు అబ్బలేదు. నేను పదవతరగతిలో మా స్కూలు టాపర్‌ను. గొప్ప చదువులు చదవాలని ఆశ ఉన్నా, సంపన్న కుటుంబంలో పుట్టినా ఆ కోర్కె తీరలేదు. నాలాగే పదవతరగతి చదివిన భూస్వామి కొడుక్కిచ్చి నా పెళ్ళి చేశారు. అతనికి స్థిరత్వం, చొరవ, తెలివితేటలు తక్కువ. అయినా అతన్నే దైవంగా భావించి రాత్రి పగలు కష్టపడి వ్యవసాయం చేయించాను. మా ఆస్థిని రెట్టింపు చేశాను. ఇద్దరు కూతుళ్ళు పదవతరగతి ఫెయిలయ్యారు. ఇక చదవలేమని, చదువువద్దని మొండికేశారు. ఇక చేసేది లేక మంచి సంబంధాలు చూసి పెళ్ళి చేశాము. పెద్ద అబ్బాయి అతికష్టం మీద ఇంటర్ వరకు చదివాడు. రెండవ వాడిని డొనేషన్ కట్టి ఇంజినీరింగ్‌లో చేర్పించాము. వాడు చదువు మానేసి తిరుగుళ్ళు నేర్చుకున్నాడు. మా కులం కాని అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను. అయినా నా భర్తను బలవంతంగా ఒప్పించి కొడుకు కోడల్ని ఆదరించాము. తరువాత పెద్దవానికి ఒక కలిగినింటి అమ్మాయిని తెచ్చి పెళ్ళి చేశాము. నలుగురు పిల్లలకు ఆస్తులు పంచి ఇచ్చాము. నా భర్త ముందు జాగ్రత్తగా నా పేరుతో మూడు అంతస్తుల మేడ కట్టించాడు. పదేళ్ళ క్రితం నా భర్త క్యాన్సర్ వ్యాధితో మరణించాడు. మావారు చనిపోయిన తరువాత మా బిడ్డల పరిస్థితి అర్థం అయ్యింది. ఎవరికి వారు రహస్యంగా నా పేరున ఉన్న ఇల్లు రాయించుకోవాలని, నగలు తీసుకోవాలని ప్రయత్నించారు. ప్రేమ నటించారు. పిల్లలను నమ్మి ఆస్తి, నగలు పోగొట్టుకుంటే బతుకు ఎలా ఉంటుందో మా అమ్మమ్మను చూసి గ్రహించాను. ఆమెకు నలుగురు కొడుకులు మా అమ్మ ఒక్కతే కూతురు. ఆమె చివరి రోజుల్లో తన పేర ఉన్న ఆస్తి నగలు మా అమ్మకు ఇచ్చేసింది. అయితే స్వార్థ పరురాలైన మా అమ్మ తన తల్లికి బతికి ఉండగానే నరకం చూపింది. అందుకని నేను నాపేరుతో ఉన్న రెండు కోట్ల విలువైన ఇల్లు, 50 సవర్ల బంగారం ఎవరికీ ఇవ్వలేదు. దీనితో అందుకు పిల్లలు అలిగి మా ఇంటికి రావడం మానేశారు. రెండు అంతస్తుల్లో వచ్చే అద్దెతో ఒక పనిమనిషి తోడుతో బతుకుతున్నాను. నా వయస్సు 70 ఏళ్ళు. ఇంకా బతకాలని ఆశలేదు. చావడానికి ధైర్యం చాలడం లేదు. మనశాంతితో చివరి రోజులు గడవడానికి మార్గం చెప్పండి.

**-ఒక సోదరి, శ్రీకాళహస్తి**



**జవాబు:** అమ్మా మీ పరిస్థితికి జాలిపడుతున్నాను. ఇప్పటి పిల్లల్లో కొందరు మానవత్వం మరచి ప్రవర్తిస్తున్నారు. ఎంత డబ్బు, సంపద వున్నా తృప్తి లేకుండా అడ్డదారుల్లో సంపాదించాలని తపిస్తున్నారు. ఆధునిక జీవన విధానాలు, ప్రమాణాలు, సంస్కృతిలో వస్తున్న మార్పే ఇందుకు కారణం. మీరు ప్రకృతిని ఆదర్శంగా తీసుకుని, మారుతున్న సమాజాన్ని గమనించి మీకు మీరే, మీతో మీరే అన్నట్టు బతకడం నేర్చుకోండి. మీ ఆరోగ్యం ఎలా ఉందో తెలపకపోయినా, వయస్సును బట్టి వృద్ధాప్య సమస్యలు ఉంటాయని భావిస్తున్నాను. ఈ వయస్సులో ఒంటరిగా ఉండటం అంత శ్రేయస్కరం కాదు. మీ వద్ద నగల కోసం ఎవరైనా దురాగం చేయవచ్చు. యే అర్ధరాత్రో అపరాత్రో ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి ఏదైనా వృద్ధాశ్రమంలో చేరిపొండి. మీ నగలు, ఇంటి అద్దెద్వారా వచ్చే డబ్బుతో వృద్ధాశ్రమంలో హాయిగా బతకవచ్చు. నలుగురి మధ్య నవ్వుతూ హాయిగా బతకడానికి ప్రయత్నం చేయండి. కన్న బిడ్డలు చూడలేదన్న సెంటిమెంటుతో బాధపడడం మానేయండి. మీ మరణానంతరం ఇల్లు ఏమి చేయానుకుంటున్నారో వీలునామా రాసి పెట్టండి.

## ఇంట్లో తమలపాకు ..

**హృదయాకారంలో పచ్చగా నిగనిగలాడే తమల పాకులు తెలియనివారుండరంటే అతిశయోకి కాదేమో, వీటికి ఔషధగుణాలే కాదు, సాంస్కృతిక ప్రాధాన్యమూ ఎక్కువే. మరి ఇంకేం, దీన్ని పెంచే విధానమే కాదు, మరెన్నో ఆసక్తికర విషయాలూ తెలుసుకుందామా!**

తమలపాకుల్నే నాగవల్లి ఆకులనీ పిలుస్తారు. దక్షిణాసియా మొత్తం విరివిగా కనిపించే ఈ మొక్కను ఒక్కసారి నాటితే చాలు ఏళ్ల బతికేస్తుంది. దీన్ని ఆంగ్లంలో బీటల్ అని పిలుస్తారు. ఇది తమిళంలో వెట్టిల అనే పదం నుంచి వచ్చింది. దీనికి మూలం పోర్చుగీసు భాషట. తమలపాకుల్ని ఉత్తర భారతంలో పానా ఆకులుగా పిలుస్తారు. హిందూ సంస్కృతి పూజల్లో, శుభ సందర్భాల్లో వీటిది అగ్రస్థానం. ఈ మొక్కను నాటడానికి నీరు నిలవని సారవంతమైన మట్టి అవసరం. అయితే, నేల పొడిబారకుండా తేమగా ఉంచుకోవడమూ ముఖ్యమే. కొద్దిగా ఆమ్లతత్త్వం ఉంటే ఇవి చక్కగా ఎదుగుతాయి. ఇది పెప్పర్ కుటుంబానికి చెందినది కావడంతో మాస్ పోల్స్, ఎత్తైన చెట్లు, గ్రిల్స్ వంటివాటిపైకి సులువుగా ఎగబాకుతుంది.



**సులువుగా పెరుగుతుందిలా...** తమలపాకు మొక్కను నాటితే ఎక్కువ శ్రద్ధ పెట్టాలేమా అన్న భయం అక్కర్లేదు. దీన్ని పెంచేందుకు నీరు నిలవని సారవంతమైన మట్టి అవసరం. నీళ్లూ రోజు పోయాలి. తేమ నిలిచి ఉండేందుకు మొక్క చుట్టూ ఉన్న మట్టిలో కోకోపీట్ కలిపితే సరి. దీనికి ప్రత్యక్ష సూర్యకాంతి అవసరం లేదు. నీడలోనూ ఆరోగ్యంగానే ఎదుగుతుంది. తమలపాకు మొక్కకు ఎరువుల అవసరం పెద్దగా లేకపోయినా పెద్దగా, నాణ్యంగా ఆకులు రావాలంటే మాత్రం ప్రతి ఇరవై రోజులకోసారి నైట్రోజన్ ఎక్కువగా ఉండే ఫెర్టిలైజర్‌ని వేయాలి. దీన్ని కొమ్మ కత్తిరింపుల ద్వారానూ పెంచుకోవచ్చు. ఎండిన కొమ్మలు, కింది భాగంలో ఉన్నవి తీసేస్తూ ఉంటే పైవి నిగనిగలాడుతూ వస్తాయి. ఇక, చీడపీడల విషయానికి వస్తే తెల్లదోమ కనిపిస్తే.. చెంచా వేపనూనెను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేస్తే సరి. ఎక్కడైనా ఆయిలీ ప్యాచెస్ కనిపిస్తే ప్రూనింగ్ చేసేయండి చాలు.

**ఎన్నెన్నో ప్రయోజనాలు :**



తమలపాకుల్లో కాల్షియం, ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఎ,సి,లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఫైబర్ కూడా ఎక్కువే నూనెలు, ఇతర పదార్థాలు ఆక్సీకరణకు గురై చెడిపోవడాన్ని ర్యాన్సిడిటీ అంటారు. ఈ ప్రక్రియను తమలపాకు అడ్డుకుంటుంది. నువ్వుల నూనె, ఆవనూనె, వేరుశనగనూనెలు పాడవకుండా వాటిల్లో ఓ తమలపాకు వేసి నిల్వ చేస్తే సరి.



# ఆసియా కప్ మాదే
## షాహీన్ అఫ్రిది

**దుబాయ్, సెప్టెంబర్ 24:** పాకిస్తాన్ టీ20 జట్టు ఫామ్‌లో లేదన్న వార్తలను ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిది తోసిపుచ్చారు. తాము ఇంతకు ముందు ఆడిన నాలుగు సిరీస్‌లలో ఒకటి మినహా అన్నింటా గెలిచామని గుర్తుచేశారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆసియా కప్ కైవసం చేసుకుంటామని అఫ్రిది ధీమా వ్యక్తం చేశారు. ఆసియా కప్ సూపర్-4లో భాగంగా మంగళవారం శ్రీలంకపై పాక్ విజయం సాధించింది. 3 వికెట్లతో రాణించి జట్టును విజయతీరాలకు తీసుకెళ్లడంలో షాహీన్ అఫ్రిది కీలక పాత్ర పోషించారు. వరుసగా టీ20 ఆసియా కప్ ఫైనల్స్ ఆడిన వారి విజయాలలో అఫ్రిది ఒకరు. 13ఏళ్ల తర్వాత తొలిసారి ఆసియా కప్ టైటిల్‌ను సాధించాలనే తపనతో జట్టు ఉందని, ఎవరినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా పాక్ జట్టు ఉందని షాహీన్ అఫ్రిది పునరుద్ఘాటించారు. "తాము గత దజనుకు పైగా ఆడిన మ్యాచ్‌లలో చాలా వరకు గెలిచాం. పటిష్ట జట్లపై గెలవలేదనేది మాత్రం నిజమే, కానీ ఇటీవలి మ్యాచ్‌లలో చాలా వరకు గట్టిపోటీ ఇస్తునాం. ముక్కోణపు సిరీస్ గెలవడానికి సిద్ధంగా ఉన్నాం. తాము గెలిచాం. అలాగే ఆసియా కప్ గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం, ఆదిశగా దృష్టి సారించి సఫలీకృతమవుతాం" అని షాహీన్ అఫ్రిది ఆశాభావం వ్యక్తం చేశారు.



# రెస్ట్ కావాలంటూ బిసిసిఐకి అయ్యర్ లేఖ

**ముంబై, సెప్టెంబర్ 24:** ఆస్ట్రేలియా-ఏ జట్టుతో అనధికార టెస్టు మ్యాచ్ సిరీస్ కోసం భారత్-ఏ జట్టుకు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. తొలి టెస్టు మ్యాచ్ డ్రాగా ముగిసింది. రెండో టెస్టు ప్రారంభం కానున్న వేళ, అయ్యర్ బీసీసీఐకి లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఐపీఎల్‌లో తన మార్క్ కెప్టెన్సీతో ఆకట్టుకున్న శ్రేయాస్ అయ్యర్ టీ20ల్లో, టెస్టుల్లో పునరాగమనం కోసం ఎదురుచూస్తున్నాడు. అక్టోబర్ నుంచి సొంతగడ్డపై వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌తో అతడు జట్టులోకి వస్తాడని అభిమానులు ఆశించారు. కానీ, అనూహ్యంగా అయ్యర్ సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తనకు కొంచెం బ్రేక్ కావాలని బీసీసీఐకి లేఖ రాశాడు. అతడిని అభ్యర్థనకు బోర్డు ఆమోదం తెలిపింది. దాంతో వైస్ కెప్టెన్ ధ్రువ్ జురెల్ జట్టును నడిపించనున్నాడు. అయితే, ఫిట్‌నెస్ సమస్యలతోనే అయ్యర్ బ్రేక్ తీసుకోవాలని భావించినట్లు సమాచారం.

# యూఎస్ క్రికెట్ బోర్డుపై ఐసిసి వేటు
## -సభ్యత్వంపై సస్పెన్షన్ విధింపు

**లండన్, సెప్టెంబర్ 24:** అమెరికా క్రికెట్ బోర్డుపై ఐసీసీ వేటు వేసింది. యూఎస్ఏ క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని సస్పెన్షన్‌లో పెట్టింది. తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని అంతర్జాతీయ క్రికెట్ మండలి ప్రకటించింది. గత ఏడాది కాలం నుంచి స్టేక్ హోల్డర్స్‌తో నిర్వహించిన సమీక్ష ఆధారంగా ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఐసీసీ సభ్య దేశంగా యూఎస్ఏ క్రికెట్ బోర్డు వరుసగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు ఐసీసీ ఓ ప్రకటనలో పేర్కొంది. 2028లో లాస్‌ఏంజిల్స్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు ప్రవేశం కల్పించాలన్న ఉద్దేశంతో ఐసీసీ ఉంది. కానీ ఐసీసీ నియమావళిని అమెరికా క్రికెట్ సంఘం పదేపదే ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూఎస్ఏ క్రికెట్ బోర్డుపై సస్పెన్షన్ విధిస్తున్నట్లు ఐసీసీ చెప్పింది. ఐసీసీ బోర్డు మంగళవారం వర్చువల్‌గా సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. క్రికెట్ ఆట దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తప్పలేదని ఐసీసీ పేర్కొంది. అయితే ఐసీసీ ఈవెంట్లలో అమెరికా జట్టు పాల్గొనే హక్కు ఉన్నట్లు ఐసీసీ తెలిపింది.

# గోల్ఫ్ ఇండియా చాంపియన్‌గా వీర్ అహ్లావత్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24:** గోల్ఫ్ ఇండియా చాంపియన్‌షిప్‌గా భారత యువ క్రీడాకారుడు వీర్ అహ్లావత్ నిలిచాడు. బుధవారం ఢిల్లీ గోల్ఫ్ క్లబ్ (డీజీబీ)లో జరిగిన ఫైనల్‌లో అద్భుతంగా రాణించాడు. డీజీసీలో త్వరలో జరుగనున్న 4 మిలియన్ డాలర్ల డీపీ వరల్డ్ ఇండియా చాంపియన్‌షిప్‌పై దృష్టి సారించాడు. ఇండియా చాంపియన్‌గా నిలిచిన 29ఏళ్ల వీర్ అహ్లావత్ మీడియాతో మాట్లాడుతూ... 'ఢిల్లీ గోల్ఫ్ క్లబ్ నాకొక ప్రత్యేక వేదిక. చిన్నప్పటి నుండి ఇక్కడే ఆడాను. గోల్ఫ్ కోర్సు ప్రతి మూల నాకు తెలుసు. ఉత్తమ రౌండ్ 8-అండర్' అని తెలిపారు. ప్రస్తుతం డీపీడబ్ల్యూటీ స్టాండింగ్స్‌లో 141వ స్థానంలో ఉన్న అహ్లావత్ తన ఆట తీరును మెరుగుపరుచుకుని టాప్-115లోకి ప్రవేశిస్తేనే, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో అవకాశాలుంటాయి. మిస్ అయితే, వచ్చే సీజన్ వరకు చాన్స్ కోసం ఎదురుచూడాల్సి ఉందని వీర్ అహ్లావత్ అంగీకరించాడు.



# యువ భారత్ జట్టు భళా
## ఆస్ట్రేలియాపై 51 పరుగుల తేడాతో ఘనవిజయం
### వైభవ్ సూర్యవంశీ విధ్వంసం
### అత్యధిక సిక్సర్లతో ఆల్‌టైమ్ రికార్డు
### 2-0తో వన్డే సిరీస్ టీమిండియా కైవసం

**బ్రిస్బేన్ (ఆస్ట్రేలియా), సెప్టెంబర్ 24:** ఆతిథ్య ఆస్ట్రేలియాపై భారత్ అండర్-19 జట్టు ఘనవిజయం సాధించింది. బుధవారంనాడిక్కడ జరిగిన రెండో వన్డేలో 51 పరుగుల తేడాతో ఆసీస్‌ను మట్టికరిపించింది. ఈ విజయంలో సూర్యవంశీ, కీలక పాత్ర పోషించారు. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో 2-0తో భారత్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ అండర్-19 వన్డేల్లో మెరుపు హాఫ్ సెంచరీ చేయడంతోపాటు అత్యధిక సిక్స్‌లు బాదిన క్రికెటర్‌గా ఆల్‌టైమ్ రికార్డు సృష్టించాడు. మాజీ టీమిండియా ప్లేయర్ ఉన్ముక్త్ చంద్ పేరిట ఉన్న రికార్డును తన పేరిట రాసుకున్నాడీ చిచ్చరపిడుగు. సూర్యవంశీ తుపాన్ ఇన్నింగ్స్ ఆడి 4 ఫోర్లు, 6 సిక్సర్లతో వీరంగం సృష్టించి కంగారూ జట్టుపై మొదటి హాఫ్ చేసరీ నమోదుచేశాడు. మొత్తంగా వైభవ్ 68 బంతుల్లో 70 పరుగులు చేశాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, భారత్ ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా 49.4 ఓవర్లలో 300 పరుగులు చేసింది.

భారత జట్టులో సూర్యవంశీ 70, విహాన్ మల్హోత్ర 70, అభిజ్ఞాన్ కుందు 71 పరుగులు చేశారు. అనంతరం 301 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు చతికిలపడింది. 18.5 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 63 పరుగులు చేయగా, ఆ తర్వాత వరుసగా రెండు వికెట్లను జారవిడుచుకుంది. ఆస్ట్రేలియా 109 పరుగులు చేరేటప్పటికి ఆరు వికెట్లు కోల్పోయింది. జాయ్‌డెన్ డ్రాపర్ - ఆర్యన్ శర్మ ఆచితూచి ఆడుతూ ఏడో వికెట్‌కు 112 పరుగులు జోడించారు. 47.2 ఓవర్లలో 249 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో డ్రాపర్ 101, ఆర్యన్ శర్మ 38 ఆయుష్ మాత్రే 27 పరుగులు చేశారు.



# ఐసిసి టి20 ర్యాంకింగ్స్‌లో మనోళ్లు టాప్
## బౌలర్లలో వరుణ్ చక్రవర్తి.. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ
### ఆల్‌రౌండర్‌గా హార్దిక్ అగ్రస్థానం

**దుబాయ్, సెప్టెంబర్ 24:** ఐసీసీ తాజాగా ప్రకటించిన టీ20 ర్యాంకింగ్స్‌లో భారత జట్టు, టీమిండియా క్రీడాకారులే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. టీ20ల్లో భారత్ జట్టు నంబర్ 1 స్థానంలో ఉంది. టీ20ల్లో టీమిండియా ప్లేయర్ అభిషేక్ శర్మ నంబర్-1లో ఉండగా, తిలక్ వర్మ 3వ స్థానానికి ఎగబాకాడు. బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి నం.1 స్థానంలో కొన సాగుతున్నాడు. ఆల్ రౌండర్లలో హార్దిక్ పాండ్యా నం.1 స్థానంలో ఉన్నాడు. అభిషేక్ శర్మ తన అగ్ర స్థానాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా ఇప్పుడు రేటింగ్ పాయింట్లలో 900 మార్కును దాటాడు. అభిషేక్ శర్మ 900 పాయింట్ల మార్కును దాటిన మూడవ భారతీయ బ్యాటర్‌గా నిలిచాడు. టీ20ల్లో సూర్యకుమార్ యాదవ్ 912 రేటింగ్ పాయింట్లతో అత్యధిక పాయింట్ల రేటింగ్‌ను కల్గి ఉన్నాడు. విరాట్ కోహ్లీ 909 పాయింట్లతో ఉన్నాడు. బౌలర్ల విభాగంలో వరుణ్ చక్రవర్తి 747 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇక టీమిండియా మరో యంగ్ బ్యాటర్ తిలక్ వర్మ ఒక స్థానం మెరుగుపరుచుకుని 791 రేటింగ్స్‌తో 3 స్థానానికి చేరుకున్నాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఆరుస్థానాలు ఎగబాకి అగ్రస్థానంలో నిలిచాడు. ఇలా టాప్-10లో ముగ్గురు టీమిండియా ప్లేయర్లు ఉన్నారు.

# డాలర్ వర్సెస్ రూపాయి
## మరోసారి క్షీణించిన భారత్ కరెన్సీ

**ముంబయి, సెప్టెంబరు 24:** విదేశీ కరెన్సీ మార్కెట్లలో డాలరుతో రూపాయి మారకం విలువలు కనిష్టానికి పడిపోయాయి. 0.52శాతం క్షీణించి 88.79 రూపాయలవద్ద స్థిరపడింది. విదేశీ ఫండ్ ఇన్వెస్టర్లు తమ సొమ్ములు విత్‌డ్రాచేసుకోవడం ఒక ఎత్తయితే అమెరికా సుంకాలు కూడా కొంతమేర ఒత్తిడికి గురిచేసాయి. హెచ్‌వన్‌బి వీసా ఫీజులు పెంపు కూడా రూపాయి మారకంపై ప్రభావంచూపించింది. ఎందుకంటే సేవలరంగం, ఎగుమతుల రంగం,విదేశీ జమలపరంగా కూడా డాలర్‌పటిష్టం అయి రూపాయి కనిష్టానికి చేరింది. అంతకుముందు ఈనెల 11వ తేదీ 88.47 వద్ద ట్రేడింగ్ జరిగింది. ట్రేడర్లు రూపాయిపై ఒత్తిడి ఇలాగే కొనసాగు తుందని రూ.90కి చేరినా ఆశ్చర్యంలేదని త్వరలోనే నమోదవుతుందని కూడా చెపుతున్నారు. బుధవారం 13 పైసలు క్షీణించి ట్రేడింగ్ ప్రారంభం అయిన రూపాయి ఇంట్రాడేలో 88.82వద్దకు చేరింది. చివరకు ట్రేడింగ్‌ముగిసే సమయానికి 51 పైసలు క్షీణించి 88.79రూపాయలుగా నమోదయింది. విదేశీ ట్రేడర్ల అంచనాలనుచూస్తే వీసా ఫీజు పెంపు, సుంకాలు వంటివి విదేశీ జమల్లో వృద్ధిని కట్టడిచేసాయి. అంతేకాకుండా



సేవలరంగ ఎగుమతులను కూడా తగ్గించాయని అందువల్లనే రూపాయిపై ఒత్తిడి పెరిగిందని చెపుతున్నారు. దేశీయ ఐటి కంపెనీలనుంచే 60శాతం రెవెన్యూ అందుతుంది. జనవరి నుంచి ఆగస్టు మధ్యకాలంలో కార్పొరేట్ కార్యకలాపాలు డాలర్/రూపాయి విలువల్లో 70శాతంపెరిగి 73 బిలియన్ డాలర్లకు చేరాయని ట్రేడర్ ఒకరు చెప్పారు. అదే 2020లో ఈ మార్కెట్ 20 బిలియన్లకంటే తక్కువ ఉంది.

2025నాటికి గణనీయంగా వృద్ధిని నమోదుచేసింది. ఆర్బీఐ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నదని, అందువల్లనే ప్రత్యేకకౌంటర్ ఇంకా ప్రారంభించలేదని ప్రైవేటు బ్యాంకర్లు చెపుతున్నారు. దీనికితోడు 50శాతం సుంకాలు అమెరికా ఎగుమతులపై ప్రారంభం కావడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగిందనే చెప్పాలి. ఇక బ్రెంట్‌ముడిచమురు చూస్తే 0.41శాతంపెరిగి బ్యారెల్ ఒక్కింటికి 66.84 డాలర్లుగా నడిచింది.ఫ్యూచర్ మార్కెట్లకు అయితే బ్యారెల్‌కు 70డాలర్లకు మించి లేదు.



# రిలయన్స్ బ్లాక్‌రాక్ కొత్త ఫండ్ లాంచ్!

**ముంబయి, సెప్టెంబరు 24:** రిలయన్స్‌అనుబంధ సంస్థ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, సింగపూర్ కంపెనీ బ్లాక్‌రాక్ అడ్వైజర్స్ సింగపూర్‌సంస్థలు సంయుక్తంగా జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ అసెట్ కంపెనీని ప్రారంభించడంతోపాటు కొత్త మ్యూచువల్ ఫండ్స్ స్కీమ్స్ తీసుకొచ్చాయి. తొలి యాక్టివ్ ఈక్విటీ స్కీం జియో బ్లాక్‌రాక్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ప్రారంభించింది. సబ్‌స్క్రిప్షన్ కోసం ఇది ఓపెన్ అయింది. సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 7 వరకు న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఒ) కోసం అందుబాటులో ఉండనుంది. అలాట్‌మెంట్ జరిగిన 5 రోజుల తర్వాత మళ్లీ రెగ్యులర్‌గా యూనిట్ల కొనుగోలు కోసం అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేసింది. జియో బ్లాక్‌రాక్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ అనేది ఓపెన్ ఎండెడ్ డైనమిక్ ఈక్విటీ స్కీమ్. ఇది లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. వేర్వేరు మార్కెట్ క్యాపిటలైజేషన్ ఈక్విటీ, ఈక్విటీ రిలేటెడ్ ఇన్‌స్ట్రుమెంట్లలో పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రాబడి అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది.ఇది డైరెక్ట్ ప్లాన్ గ్రోత్ ఆప్షన్‌తో వస్తుంది. ఇక్కడ ఎగ్జిట్ లోడ్ ఆప్షన్ లేదు. కనీస లంప్‌సమ్ పెట్టుబడి మొత్తం లేదా స్విచ్ ఇన్ సొమ్ము రూ. 500 ఉంటే సరిపోతుంది. ఆపైన ఎంతైనా ఇన్వెస్ట్ చేసేందుకు ఛాన్స్ ఉంటుంది. సిప్ విధానంలో కూడా కనీసం రూ.500తో చేరొచ్చు. కనీసం 6 ఇన్‌స్టాల్‌మెంట్లు చేయాల్సి ఉంటుంది. పోర్ట్‌ఫోలియో పరంగాచూస్తే 65నుంచి 100 శాతం వరకు ఈక్విటీ, ఈక్విటీ రిలేటెడ్ ఇన్‌స్ట్రుమెంట్లలో మార్కెట్ క్యాప్‌తో సంబంధం లేకుండా ఇన్వెస్ట్ చేస్తుంది. 0-35 శాతం వరకు డెట్, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్లలో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇంకా 010 శాతం వరకు రీట్స్, ఇన్విట్‌లలో లో పెట్టుబడి పెడుతుంది. ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంది. తన్వీ కచేరియా, సాహిల్ చౌధరీ ఈ ఫండ్ మేనేజర్లుగా ఉన్నారు.




# నాలుగో రోజూ మార్కెట్లకు తప్పని నష్టాలు
## హెచ్‌వన్‌బి వీసా ఫీజు పెంపు ఎఫెక్ట్

**ముంబయి, సెప్టెంబరు 24:** దేశీయ ఈక్విటీసూచీలు బుధవారం కూడా నష్టాల్లోనే ముగిసాయి. వరుసగా నాలుగోరోజు కూడా వివిధ రంగాలు ఒత్తిళ్లకు లోనయ్యాయి. యుఎస్ హెచ్1బి వీసా నిబంధనల్లో వచ్చిన మార్పులే ఇందుకు కారణం అని అంచనా. ఎక్కువ స్టాక్స్ క్షీణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు తమతమవాటాలను విత్‌డ్రాచేసుకోవడంతో అమ్మకాలు పెరిగాయి. దీనితో నిఫ్టీ కూడా 25,100 స్థాయికి దిగువన ట్రేడింగ్ ముగించింది. ఎస్అండ్‌పి బిఎస్ఇ సెన్సెక్స్ 386.47 పాయింట్లు క్షీణించి 81,715.63 పాయింట్లవద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 112.60 పాయింట్లు క్షీణించి 25,056.90 పాయింట్లవద్ద స్థిరపడింది. వరుసగా నాలుగురోజుల్లో కూడా నిఫ్టీ, సెన్సెక్స్‌లు తిరోగమనంలోనే ఉన్నాయి. సెన్సెక్స్ 1.56శాతం, నిఫ్టీ 1.44శాతం దిగజారాయి. ఇక మిడ్‌క్యాప్‌సూచీ 0.51శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.85శాతం పతనం అయ్యాయి. వివిధ విభాగ సూచీలపరంగా నిఫ్టీ ఎఫ్ఎంసిజి 0.18శాతం, పిఎస్‌యు బ్యాంక్ సూచీ 0.26శాతం నిఫ్టీ 50సూచీలో పెరిగాయి. అలాగే నిఫ్టీ రియాల్టీ 2.49శాతం, ఆటో సూచీ 1.15శాతం, ప్రైవేటు బ్యాంకు సూచీ 0.86శాతం నిఫ్టీలో క్షీణించాయి. భారత్ పదేళ్ల బెంచ్‌మార్క్ బాడ్లు0.25శాతం పెరిగి కూపన్‌రేటు 6.483కి చేరింది. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 88.73గా చెలామణి అయింది.ఎంసిఎక్స్‌గోల్డ్ ఫ్యూచర్స్ అక్టోబరు 3వ తేదీనాటికి 0.54శాతంపెరిగి 1,13,221గా నమోదయింది. అమెరికా పదేళ్ల బాండ్ల రిటర్నులు 0.12శాతం దిగజారాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 62 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 68.25గా నమోదయింది. గ్లోబల్ మారెనకట్లపరంగాచూస్తే ఐరోపా మార్కెట్లు క్షీణిస్తే ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిసాయి. ఎస్అండ్‌పి 500 0.55శాతం క్షీణించింది. నాస్‌డాక్ కాంపో.ఇట్ ఒకటిశాతం క్షీణిస్తే డౌజోన్స్ ఇండస్ట్రియల్ సగటు 88.76 పాయింట్లు క్షీణించింది.

# హిండెన్‌బర్గ్ ఆరోపణలు మొత్తం భారత్ కార్పొరేట్‌పైనే దాడి
## -ఛైర్మన్ గౌతమ్ ఆదానీ



**ముంబయి, సెప్టెంబరు 24:** హిండెన్‌బర్గ్ రీసెర్చినివేదిక పేరిట విడుదలచేసిన నివేదిక కేవలం ఒక్క ఆదానికే పరిమితం కాదని మొత్తం భారత భారీ వ్యాపార సంస్థలపై జరిగిన దాడి అని ఆదాని ఛైర్‌పర్సన్ గౌతమ్ ఆదాని పేర్కొన్నారు. వాటాదారులకు ఆయన బుధవారం లేఖరాసారు. సెబీ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించలేకపోయిందని చెపుతూ ఆదానికి క్లీన్ చిట్ ఇచ్చినతర్వాత ఆదాని షేర్లు ఒక్కసారిగా 40 వేలకోట్లుపెరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వాటాదారుల్లో విశ్వాసం పెంపొందించేందుకు గౌతమ్ ఆదాని అందరికీ లేఖలురాసారు. హిండెన్‌బర్గ్ నివేదిక మా సంస్థ సుపరిపాలనను ప్రశ్నించిందని, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్న భారత కార్పొరేట్లను సవాల్‌చేసినట్లుగా ఉందని ఆదాని పేర్కొన్నారు. హిండెన్‌బర్గ్ విడుదలచేసినివేదికతో ఆదాని గ్రూప్‌షేర్లు 150 బిలియన్ డాలర్లమేర క్షీణించాయి. ఇపుడు సెబీ క్లీన్‌చిట్‌తో మళ్లీ అన్ని కంపెనీలు పుంజుకున్నాయి. సెబీ క్లీన్‌చిట్‌తో ఆదాని గ్రూప్ కంపెనీల్లోకొనసాగుతున్న సుపరిపాలన వ్యవస్థకు క్లీన్‌చిట్ అచ్చినట్లయిందని కంపెనీ కార్యకలాపాలు మరింతపారదర్శకంగా నిర్వహిస్తూ స్థిరమైన పెట్టుబడులు ఆహ్వానిస్తామని వాటాదారుల సొమ్ము పరిరక్షణ తమ తక్షణ కర్తవ్యమని గౌతమ్ అన్నారు. ఉద్యోగులకు పంపించిన సందేశాల్లో ఆదాని మన కంపెనీలపై హిండెన్‌బర్గ్‌చేసిన ఆరోపణలు లక్ష్యనిర్దేశిత, భిన్న కోణాలనుంచి మూకుమ్మడి దాడిచేసినట్లుగా ఉందని అన్నారు. అయితే సంక్షోభంలో కంపెనీ స్టాక్ ఎలాంటి ఒడిదొడుకులకు లోనుకాకుండా చూడటంలో సిబ్బంది పాత్ర మరువలేనిదని అన్నారు.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.